
శారదా పీఠ గ్రంథ మాలిక

ASK01Q148



శారదా విలాసము

శారదా విలాపము

(ప్రసంగ వ్యాసములు)

★

శ్రీ పిల్లలమఱ్ఱి

వేంకట హనుమంతరావు, ఎం. ఏ.,

ఆంధ్రోపన్యాసకులు : హిందూకళాశాల

★

శారదా పీఠము : గుంటూరు

శ్రీ పిల్లలమఱ్ఱి వారి

శారదా విలాసము

రూపాయిన్నర

★

సర్వ స్వామ్యములు : గ్రంథకర్తవి

ప్రథమ ముద్రణము : జనవరి 1959

★

ప్రకాశకులు

శ్రీ పిల్లలమఱ్ఱి వేంకట సుబ్రహ్మణ్యం,

పుణ్యధామమ్ : పట్టాభిపురమ్ : గుంటూరు-2

శారదా విలాసము

శ్రీ పిల్లలమఱ్ఱి కృతి

మిత్రులకే

మా నాగేశ్వర కార్యానికి

సాదరంగా

[illegible]

6.8.61

ఇది

శారదాదేవి

ప్రసాదము

+

వదాహ్వ్యాహమ్

మాది శారదా పీఠము ! నేను వాణి యింటి వాఁడను!! శారదా దేవి నా యిష్టదైవము!!! మామకస్వాంత వీథియందు నాదేవి సలిపిన యపూర్వ విలాసముల నక్షరరూపమున లోకహితార్థము పదిలపరిచి సుమనస్సుల కందించుచుండుటయే నా వ్రతము : తపస్సు !

పవిత్ర బ్రాహ్మముహూర్తమున స్వప్నమందు మాదంపతులకు నేఁడు సాక్షాత్కరించి, మమ్మపూర్వముగాఁ బ్రబుద్ధపరచి, రసావిష్టుల నొనర్చి, మా ప్రణామములఁ గొని యాదేశించిన ప్రకారము, నెల్లనుపలక్షించి 'శారదచంద్రచంద్రికాడంబరచారుమూర్తి'చేతము రంజిల్ల, నారచించిన యీ వ్యాసపుష్పహారమును భక్తిమై శారదాంబకే సమర్పించుచున్నాను !

ఇతఃపూర్వము పంద్రొండేడులలో (1946-1958) నపుడపుడు విశిష్ట సాహిత్య సభా వేదికాస్థలుల నుండియు, నాకాకవాణీ ముఖమునను, నేఁ జేసిన పరిసంగవ్యాసములఁ గొన్నింటిని కొలఁదిమార్పులతోఁ బ్రామాణిక భావలోఁ దిరుగవ్రాసి యిట్లు గూర్చితిని.

నా శిష్యమిత్రుఁడు, వర్థమానకవి, చిరంజీవి ఎక్కిరాల కృష్ణమాచార్య యభిమతానుసారము "శారదావిలాసము"ను బేర నీ గ్రంథమును వెల యించుచున్నాను.

ఇం దేరెండో తప్ప మిగిలినవి "ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక-ఆంధ్ర ప్రభ - భారతి - జాగృతి - సుజాత" లను బ్రసిద్ధాంధ్ర పత్రికల ముఖమునఁ బూర్వము వెలువడినవే. మద్వాణీవిలాసమున కింత సాదృతి నొసంగిన యాకాకవాణ్యధికారులకు, నాయా పత్రికా సంపాదకులకు, నాయా సభాపర్యవర్తకులకు నా ధన్యవాదములు.

నోట నేవచింప, లోనూహ తెలిసి, యజస్రము వ్రాయసము నెఱపుచు నా గ్రంథరచనా వ్యాసంగములో సహాయముచేయు సంగీత సరస్వతి నా సహధర్మచారిణికిఁ గృతజ్ఞుడను.

ఈ వ్యాససంపుటమును ప్రచురించి నన్ను ప్రోత్సహించిన మా తండ్రిగారికిఁ బ్రణామములు.


ఈ 'శారదావిలాసము'ను సారస్వతేయు లెల్లరు సాదరముగ సంభావింతురని విశ్వసించుచున్నాను.

17-1-1959

శారదా పీఠము

శారదా తనయుఁడు,

పిల్లలమఱ్ఱి వేంకట హనుమంతరావు



శారదాంకితమ్

ఆంధ్ర శారద నీకు అక్షరాంజలులూ !
అందుకో ఆదుకో రావమ్మ మాయమ్మ !!
తరతరాల్ మాయింట తాండవించి వంట
తలపు తరగల వెల్లి తళుకు బెళుకుల తల్లి !
తెలుగు నేలలపైన తేనె మాగాణినీ
తీరుగా తేటగా తీర్చిదిద్దిన తల్లి !
పద కవితా సుదతికి మధుర గాన ఫణితులక్
ముదముతో ముద్దుగా చదువ నేర్పిన తల్లి !
ప్రబంధ సుందరీ రస బంధుర భంగిమలు
ప్రభలతో ప్రబలగా ప్రబోధించిన తల్లి !
నవ కవితా యువతీ భావాభినయ గతులూ
శివములౌ లీలలక్ హావణించిన తల్లి !
ప్రణయ రాగములోన ప్రణవ నాదము నింపి
ప్రవిమల యోగ నియతి పరిసాదించెడి తల్లి !
ఆంధ్ర శారద నీకు అక్షరాంజలులూ !
అందుకో ఆదుకో రావమ్మ మాయమ్మ !!

శారదా విలాసము

పిల్లలమఱ్ఱి ప్రసంగములు

*

1	విమర్శక లక్షణములు	...	1
2	కళా రంగము - ప్రతిభా వ్యుత్పత్తులు	...	5
3	భాష - బాధ్యత	...	10
4	తెలంగాణ భాష - యాసలు	...	17
5	మన నానుడులు పలుకుబడులు	...	26
6	శతకములు - ధార్మిక ప్రబోధములు	...	41
7	వర్తమా నాంధ్ర వచన రచనము	...	53
8	గద్య కవిత	...	76
9	తెలుఁగు నవల - రచనా శిల్పము	...	87
10	తెలుఁగులో గేయము-స్థూల పరిశీలనము	...	99

★

ఓమ్

శారదాయైనమః

౧

విమర్శక లక్షణములు

ఏ భాషా సాహిత్యమైన విమర్శవలననే దీప్తివంతము, బహుళవ్యాప్తము, పరివర్థమానము కాఁగలుగును. విమర్శకుని నందుచేతనే సాహిత్యోద్ధారకునిగా గణింపవలసియున్నది. విమర్శకుఁ డనఁగా అయిన దానిని, కాని దానిని చెడ తిట్టెడి పండితుఁడను భ్రమ యుండుట వలన లోకములోఁ జాల కాలమువఱకు విమర్శకునకు గౌరవము లభింపక వచ్చినది. కాని విమర్శకుని బాధ్యత గురుతరమైనది. సాహిత్యాన్వీక్షణ దారి కాఁదగిన యతనికిఁ గొన్ని యుత్తమ లక్షణములనఁ దగినవి లేకపోలేదు. ప్రాచ్య పాశ్చాత్య పండితు లెందఱో యా యా సూత్రములను దక్షతతో విచారించియున్నారు.

విమర్శనము నొక కళగా పాశ్చాత్యు లుపాసించినారు. ప్రాచ్యులు దాని నొక పాండితీవైభవముగా గమనించినారు. పాశ్చాత్య విమర్శకుల దృష్టిస్థాలమైనది. (Comprehensive out look.)చారిత్రిక పరిశీలనము(Historical perception) సూత్రవిభజనము (Analytical treatment) తారతమ్య పరిశీలనము (Comparative study)వారి విశిష్ట లక్షణములు. ప్రాచ్య వ్యాఖ్యాతలు నిశితదృష్టితో సూక్ష్మపరిశీలనము

చేయువాను. వారిది యెక్కుడుగా శాబ్దికవిమర్శ, ప్రామాణిక దృష్టియు; ఈరెండు దృక్పథములకు సమన్వయము సాధించు కొను తలంపుతో విమర్శక లక్షణములను గ్రహింతము:

విమర్శకుడు కవి వలె ద్రష్ట; సృష్ట యును. నవనవో న్మేషశాలిని యయిన ప్రజ్ఞ యతనికిఁగూడ సహజముగా నబ్బు నట్టిదే. లోకశాస్త్ర కావ్యాద్యవేక్షణము చేత నతఁడును వ్యుత్పన్నుఁడు కావలెను; బహుకావ్య పఠనమువలన మనో ముకురము విశదీభూతమగును అప్పు డాతఁడు సహృదయుఁ డగుచున్నాఁడు. అపుడు కవి చిత్రించిన భావములలోఁడను, పాత్రలలోఁడను, వర్ణనములతోఁడను. బరిచయ మేర్పడి, కవి హృదయ ప్రవేశము చేయఁగలిగి, యాయా ప్రకరణములందు లీనమై పోఁగలిగి రసానందానుభవమును బొందఁగల్గును. ఇందు లకు విమర్శకుఁడు కేవలము బుద్ధినైభవమును శాస్త్రజ్ఞాన మును మిక్కిలిగాఁ బెంపొందించు కొన్నందువలనఁ బ్రయోజ నము పూర్తిగా సమకూడదు. వీనితో నాతఁడు తనహృదయ కమలమును నవనవము సుకుమారము, నార్ద్రీభూతము చేసి కొని రసపిపాసువు, కళాశీలి కావలెను. అనఁగా విమర్శకోత్త ముఁడు, హృదయములేని శుష్కపండితుఁడు కాఁడని తెలియ వలెను. అట్లే తార్కికశక్తి లేని పండితుఁడు విమర్శక శిఖా మణి కానేరఁడనుట తథ్యము.

శబ్ద స్వరూపము - అర్థ గౌరవము - భావ గాంభీర్యము ఆలంకారిక చమత్కృతి - రస పోషణము - శిల్పవ్యక్తి మొద లైన విషయముల నన్నిఁటిని నతఁ డెఱింగియుండవలెను. అనఁగా లాక్షణిక సూత్రపరిజ్ఞానము విమర్శకున కెంతయు నవ

సరమైనది. కేవల మా సూత్రముల నన్నిటిని వల్లెవేసిన పండితుఁడయిన ప్రయోజనము లేదు. అన్యాయము చేయఁ గల ప్రతిభావంతుఁడై యాత్మఁ డుండవలెను. అనఁగా లక్ష్య లక్షణ సమన్వయ శక్తి గలవాఁడు కావలె నన్నమాట! అంతటి శక్తిసంపన్నుఁడైన వాఁడనహంకారిగా నుండఁ జాలఁడు. అహంకారి యైనవాఁడు విమర్శనమునకుఁ బూను కొనరాదు. అట్టి యహంకారి విమర్శ దోషైకదృష్టితోఁ గూడినట్టిదగును. లేకపోయిన స్వీయపాండితీప్రకర్షతో నిండి యుండును. వైయక్తి కాభిరుచుల కెక్కువ స్థానము లభించును. కేవల నైయాకరణి యైనచో శాబ్దిక చర్చలతో సాధుత్వాసాధుత్వ విచారముతోఁ దలనొప్పి కలిగించును. కనుక విమర్శకుఁడు తా నెంతటి విద్వన్మణియైనను వినయ శీలముగలిగి కవిని కావ్యమును నాదరముతో నరయుగల్గు సహనము, సహృదయత్వముల నలవఱచుకొనవలసి యున్నది.

కావ్య మంము దేశకాలపాత్రల నెఱిఁగి సాహితీ విమర్శ చేయనొప్పనే కాని విమర్శకుఁడు తనకాలమునాఁటి సులోచన ములతోఁ నాఁటి యభిరుచులతోఁ గొలబద్దలతోఁ బరిశీలింప రాదు. కవి ప్రతిపాదించిన భావముల నాత్మఁ డుపయోగించిన శబ్దములనుండి గ్రహింప ప్రయత్నముచేయవలెనే కాని విమర్శ కుఁడు తన యూహలను దనపాండితిని జొనిపి యితరములఁ బ్రదర్శింపరాదు. మల్లినాథసూరి వ్యాఖ్యానకర్తగాఁ బూనిన ప్రతిజ్ఞ తాదృశమైనది. మూలమంము లేని దానిని స్పృశిం పక మూలమునే యనుసరించి యందలి వెలుఁగు జిలుగులను తీరుతీయములను విమర్శించుటయే, లెస్సగా విచారించుటయే

విమర్శక లక్ష్యమై యుండవలెను.

చారిత్రికదృష్టి, తారతమ్యపరిశీలనము, విమర్శకున కెంతేని నావశ్యకములు. వీనితో ననుకృతులు మాత్సర్యకలు వాని ముందువెనుకలు నిర్ణయింప ననుకూలపడును.

పరిచయకర్తగా, గుణగ్రహణ పారీణుఁడుగా, వందిగా, వ్యాఖ్యాతగా, న్యాయమూర్తిగా విషయ వివేచనమునుండి రసాభివ్యక్తి వఱకుఁగల వివిధ స్థితులతోను, సామాన్యపాఠకుని నడిపించి శిక్షణమొసఁగి యలరించి యానందమును బంచి యమృతత్వస్థితి కల్గించునట్టి యుత్తమ దార్శనికుఁడే విమర్శకుఁడు. అంతటి యధికారమున ప్రమత్తత లున్నవాఁడే స్ఫోటక మయము, నవరసరుచిర మయిన మధురజగత్తును స్పృజింపఁగల సమర్థుఁడు కాగల్గును. అట్టి విమర్శకుఁడు కవివలె ప్రజాపతిత్వము బొంది సమ్మానము నందఁగలఁడు; సాహిత్యగహనమున రాచబాటలను వేయఁగలఁడు!

[విజయవాడ ఆకాశవాణివారు జరిపినగోష్ఠిలో (24-6-1951 తేదీన) నేఁజేసిన ప్రసంగము. శ్రీ 'అమరేంద్ర', శ్రీ జమ్మలమడక మాధవరామశర్మ గార లీగోష్ఠిలో నాతోఁ బాల్గొనిరి. కాకినాడ "ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక" 40వ సంపుటము: ౧-౩ సంచికలోఁ బ్రికటితము.]

1

కళా రంగము - ప్రతిభా వ్యుత్పత్తులు

కళ యొక యమృత సరస్సు వంటిది; ఒక రమ్య హర్మ్యము వంటిది; కస్తూరపు బరణివంటిది. కళ సత్యమును స్థాపించునది; కల్యాణప్రద మైనదియు. సౌందర్యమును రూపించునది కళ; నిశ్చలము నలౌకికము నయిన యానంద మును బ్రసాదించునది. లలితము, మధురము, మంజులము, సుకుమారము, సున్నితము, నున్నతము, నౌపదేశికము నయిన శాశ్వతానుభూతుల నందించునది కళ. గజిబిజిగా, జడముగా, నవ్యవస్థితముగా నున్న లోకనైజమునకు నాకృతి నొసంగి, యాకర్షణమును గూర్చి, ప్రాణప్రతిష్ఠ చేసి, యొక చక్కని లయను బరిష్కారమును గూర్చు నట్టిది కళ.

కళాజగత్తు వాస్తవికజగత్తు కంటె భిన్నమైనది. ప్రకృతి శరీరమైనచో కళ ప్రాణమగును. కళ వాస్తవికము నాధార ముగఁ జేసికొనినదే. కాని యది ప్రకృతికిఁ గేవల మనుకర ణము కాదు. కళ ప్రత్యేకమును విశిష్టమునైన సృష్టి. ఈ భావము 'ఆర్స్' 'Ars' అను లాటిన్ పద మొసంగు నర్థములోనే యిమిడియున్నది. 'That which is not nature' అని 'Ars' అను పదమున కర్థము. 'Art begins where the artist departs from strict imitation of nature' అని అనినపుడు

"డ్యూయింగ్" భావముకూడ కళ ప్రకృతికి ననుకరణము కాదనియే. వాస్తవికము కంటె నున్నతము, నుదాత్తము, స్థూలైకమయము, నవరసరుచిరము నయినది కళ.

కళాజగత్తులోఁ భేదసాధులకు స్థానము లేదనుకోవలదు. సమాజము లోని వ్యక్తులను, సమస్యలను, వారి వారి భావములను గళాకారుఁడు వదలఁజాలఁడు; తాత్కాలిక సమస్యలనియు శాశ్వత సమస్యలనియు, నుండును గదా! సత్యము, శాంతి, అహింసలను వానిని సాధించి కళాకారుఁడు నిర్వికల్పానందమును బ్రసాదింపఁ జూచును. ఆ యత్నములో హింస, దారిద్ర్యము, అస్వాతంత్ర్యము, నిరాశానిస్పృహలు మొద లైన తాత్కాలిక సమస్య లన్నియుఁ గళాకారునిచే నానుషంగికముగాఁ బరిష్కారమును బొందుచునే యుండును.

ఇతర కళాకారులలోఁ గవి స్థానము విశిష్టము ప్రధానము నైనది. ఎట్లందురా? లలితకళలలో నెయ్యది భౌతిక వస్తు సహాయమును నిరసించి భావనాశక్తియై సృజింపఁబడునో యయ్యది యుత్తమమైనదని పండితుల తీర్మానము. ఆ పరికారము పరిశీలించినచో బాహ్యమైన యుపకరణములు దివ్యసహాయము లేకయే కవిత్వసృష్టి కవి మనసులో జరిగిపోవుచున్నది గదా! ఇట్లు కవిత్వకళ ప్రాధాన్యము వహించుచున్నది. ఇది గాక సంగీతకళలో నున్న హృదయ ద్రవీకరణ శక్తియు, నాదసౌందర్యము శిల్ప చిత్రలేఖనములలో నున్న యవస్థానుకృతియుఁ గవిత్వములో మేళనము పొందియే యుండుట, కవితా కళా ప్రాశస్త్యమును బుజువు పరచుచున్నది గదా! ఏమైనను కళాకారుఁడు తనకు సహజముగా నున్న

వ్యక్తిత్వపరికల్పనను బట్టియుఁ దానార్జించిన పాండిత్యమును బట్టియు, బృథక్త్వమును, ప్రత్యేకతను, విశిష్టస్థానమును బొందుచు నుండును.

పాశ్చాత్యాలంకారికులవలెనే పాశ్చాత్య విమర్శకులు కూడ "ఇన్స్పిరేషన్" (Intution) అనియు, "ఒరిజినాలిటి" Originality) అనియు, నీప్రతిభనుగూర్చి, కారయిత్రీ శక్తిని (Creative faculty) గూర్చి తెలిపినారు. కవి కాంతదర్శి యనియు, ద్రష్ట యనియుఁ బలికిన "కార్లైలు" మొదలైన వారు జన్మసిద్ధముగా లభ్యపడునది ప్రతిభయనియు నది యాతనిఁ త్రికాలవేత్తగా, సత్యదర్శిగా, నుత్తమమార్గదర్శిగాఁ దీర్చునట్టిదనియు నంగీకరించినారు.

కావ్యహేతువులలోఁ గవికిఁ గేవలము ప్రతిభయుండి లాభములేదు. కళాకారునకు వ్యుత్పత్తి యత్యావశ్యకము. అవ్యుత్పత్తి యొక దోషమే. మహాకవి కాళిదాసు తన యుదాత్త భావనా కౌశలముచే గణనకెక్కుచున్నను, కాళిదాసు కవిత్వములోఁ గాన్పించు సంస్కృతీ సంప్రదాయముల మరువఁజాలము సుమా. లోకశాస్త్రకావ్యాద్యవేక్షణము, శబ్దాధికారము, సమాసఘటనాచాతుర్యము, అర్థవ్యక్తి, ఛందోలంకారాది శాస్త్రపరిచయము, సంప్రదాయజ్ఞత, యౌచిత్యము, నిగ్రహము లేనివాఁడెంత ప్రతిభావంతుఁడైనను, ఎంతగా నూహాపోహాలను గలిగియున్న వాఁడైనను, ఉద్దిష్ట రసానుభూతిని సహృదయుఁడైన పాఠకునికిఁ గల్గింపఁజాలఁడు. వ్యుత్పత్తి లేనిప్రతిభ యస్తావిస్తముగా నక్రమముగాఁ గూర్చిన మాలిక వంటిదగును. పుష్టిలేని లేఁత మొక్కవలె

వాలి పోఁగలదు; వాడి పోఁగలదు. కావునఁ జేఁ పింగళి సూరనామ్యుఁడు—

పొసఁగ ముత్తెపు సరు ల్పోహణించిన లీల
దమలోన దొరయు శబ్దములు గూర్చి
అర్థంబు వాచ్య లక్ష్య వ్యంగ్య భేదంబు
లెఱిఁగి నిర్దోషత నెసఁగఁ జేసి
రసభావములకు నవ్వామముగ వైదర్భి
మొదలైన రీతు లిమ్ముగ నమర్చి
రీతుల కుచితంబులై తనరా రెడు
ప్రాణంబు లింపుగాఁ బాదుకొల్పి
యమర నుపమాదులు యమకాదులు నగు
నట్టి యర్థ శబ్దాలంకృతులు ఘటించి
కవిత చెప్పంగ నేర్చు సత్కవి వరునకు
వాంఛితార్థంబు లొసఁగని వారు గలరె!

అని సత్కవితను గూర్చి నిర్వచించినాఁడు.

సంప్రదాయము పవిత్రముగాఁ గళాకారుఁడు భావింప వలెను. సంప్రదాయము రెండు విధములు. జాతికి విశిష్టమైన సంప్రదాయ మొకటి; రచనాసంప్రదాయము వేఱొకటి. కవిత్వములో మార్పు నభిలషింపవచ్చును. కాని సంప్రదాయములో జాతీయ సంస్కృతీ మూలసూత్రములకు క్షతి రానంతవఱకు మార్పంగీకార్యమే కాగలదు. మార్పును దీసికొనిరా యత్నించు వా రధికారము కలవారై యుండవలెను. వారు వ్యుత్పన్నులై యుండవలె; భారతీయ సంస్కృతి క్షుణ్ణముగా నెఱిఁగినవారు కావలె;

మన నవ్య కవితోద్యమములను తన్మార్గదర్శులను గమనింతము: వీరేశలింగముసంతులు, గిడుగు వెంకటరామమూర్తి పంతులు, గురజాడ అప్పారావు గారు తెచ్చిన ప్రక్రియావైవిధ్యము, భాషా సంస్కారము, ఛందఃస్వాతంత్ర్యములు జాతీయసంపదాయములను, మూలసూత్రములను ఛేదించినవి కావు. సౌలభ్యము నభిలషించిన యుద్యమములే యగుచున్నవి. ఇటీవల కాలమున మన కవితలో వచ్చిన "క్యూబిజం, డాడాయిజం, అగ్నీజం, సర్రియలిజం" మొదలైన యన్య దేశభాషా కవితా సంప్రదాయములు భారతీయ ధర్మమునకు భంగకరములై, వైఫల్యమును బొందియుండుట మన మెఱిఁగిన విషయమే గదా! కనుక జాతికి విశిష్టమైన సంస్కృతీ సంపదాయములతోఁ గూడికొనిన పాండిత్యము కళాకారునికిఁ జాలనవసరము. ప్రతిభ లేక కళాకారుఁడే లేఁడు. కేవల పాండిత్యముండి ప్రతిభ లేకపోయిన కళ వట్టిపోవును. రసానుభూతికిఁ బ్రతిభ యావశ్యకము. తదభివ్యక్తికి వ్యుత్పత్తి యావశ్యకమునని యెఱుంగవలెను. ప్రతిభ గలవాఁడే కళాకారుఁ డగును. కాని యాతఁడు పాండిత్యమును గడించి తీరవలెను. ప్రతిభా వ్యుత్పత్తులు రథ్యసారథి సంబంధము వఁటి సంబంధము గలవని మఱువరాదు.

విలక్షణ కళాఖండము నవతరిలఁజేయు సుకవి ప్రజ్ఞానిధియు, వ్యుత్పన్నుఁడునై వేశలహృదయసంపదను, నిశిత బుద్ధివైభవమును గలిగినవాఁడై విశ్వశ్రేయస్సును సాధించు తపస్వియని యెఱుంగవలెను.

[విజయవాడ ఆకాశవాణి కేంద్రమునుండి 17-6-1954 తేదీన ప్రసారితము. శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి గారితో నేను జరిపిన చర్చలోని భాగము.]

భాష - బాధ్యత

భాష భావ వ్యక్తీకరణమున కుపయోగపడు సాధనము. అది ప్రవాహము వంటిది. నిత్యవ్యవహారములో నలుగుడు బడిపోవుచుండును. ప్రాంతమునుబట్టి యితరభాషల పరిభావమును బట్టి, కాలమును బట్టియు, భాషలో మార్పు కలుగుచు నుండును. పండితులైనవారు శిష్టులైనవా రెప్పటి కప్పుడు కావ్యరచనమునకు యోగ్యమైన భాష నేరుకొనుచు నుందురు. అంతియ కాదు. వైయాకరణ మతము ననుసరించుచు, వీరు శబ్దసాధుత్వమును గాపాడుచు నుందురు. ఈవిషయములో నపండితుల కధికారము లేదు విద్యాగంధము లేని పామరులు, విద్వత్తులేని సామాన్యప్రజ భాషను తమ యిచ్చ వచ్చినట్లు స్వేచ్ఛగా వ్యవహరించు చుందురు. అక్షరజ్ఞాన మున్న వారందఱు పండితులు కాగు గదా. భాషను సంస్కరించుటకు వారధికారులు కారాదు. భాషా జ్ఞానము రచయితకు చాల నవసరము. భాషలో నొడుపు, జాతీయము, పలుకుబడి, సౌందర్యము, కర్తృ కర్మ క్రియాది వివిధ భాషాభాగముల స్థితియు, సంధి సమాసముల సంవిధానము, కారక విధులు, తత్సమ తద్భవ దేశ్య గ్రామ్య పదవిభేదము, అలంకారిక 'మర్యాదలు' శబ్దార్థ భావముల కుండు పరస్పర సంబంధము మొదలైన భాషాసంప్రదాయములు బాగుగ నేర్చుకొన్నవాడై యుండవలె. ఎవరుబట్టినను వారు సులభముగ రచయితలై పోయి- 'నాయిష్టం వచ్చినట్లు వ్రాస్తాను' అనరాదు. భాషా విషయములో నట్లు బలుకువాడు నాచరించు

చున్న వారును నేఁడధిక సంఖ్యాకులైరి. కావుననే యియ్యది చర్చనీయాంశ మగుచున్నది.

పురాణ యుగమునుండి ప్రబంధ యుగాంతము వఱకు వచ్చిన కావ్యములలోఁ బ్రయోగింపఁబడిన తెలుఁగు భాష దాదాపుగ నొకే యచ్చునఁ బోసినదై పోయినది. ఆ కావ్య భాష కీనాఁడు మన కనేక వ్యాకరణము లేర్పడి యున్నవి. మహాకవి ప్రయోగములు గ్రాహ్యములని యట్టివానికిఁ గూడ వ్యాకర్తలు సూత్రములఁ గల్పించి, గతి కల్పించుచు వచ్చిరి.

మఱి యిపుడు వచనవాఙ్మయము హెచ్చుగా సృజింపఁ బడుచున్నది. యదార్థమునకు దీనిని వచనయుగ మనియే పేరొక్కనవలె. వచనమును సర్వోపభోగ్య మొనరించి, విజ్ఞాన ప్రచార సాధనముగా గ్రహించిన వీరేశలింగముగారి పేర కూడ నీయుగమును బేరొక్కనుచుండుట మన మెఱుంగుదుము గదా. వచనములో వివిధ ప్రక్రియలు బహుళముగా వృద్ధి పొందుటయు వీరేశలింగముగారి తర్వాతనే. ఇందుల కాంగ్ల సారస్వత ప్రభావము ముఖ్యకారణ మనవలెను.

వచనము వైశద్య ప్రధానమైనది. అందు వలనఁ బద్యములోవలెఁ గ్లిష్టాన్వయమును గాని, సమాసబంధురతఁ గాని వచనము చేరనీయరాదు. వచనములోఁ జెప్పునది స్పష్టముగా విషయ విభజన కల్గినదై సుబోధముగ నుండవలెను. వీరేశలింగముగారు వచనమును సర్వోపభోగ్యము జేయఁగా, గిడుగు రామమూర్తి పంతులుగారు మఱింతగాఁ బ్రజా బాహుళ్యమున కర్థమగుటకై వ్యావహారిక భాష నామో

దించి ప్రచారము చేసిరి. కాని వారు కోరిన వ్యావహారిక భాషకు "శిష్టులు" ప్రామాణికులు. వారు 'శిష్ట వ్యావహారిక' మనిరే కాని భ్రిష్ట వ్యావహారిక మనలేదు సుమా! వెంటనే 'ఎవరు శిష్టు'లను ప్రశ్న రానే వచ్చినది. శిష్టులనఁగా - భాషా సంప్రదాయ జ్ఞానమున్న వారని చెప్పుకొనవలెను. కనుక గిడుగు వారు కూడ, భాష కొక ప్రామాణికత్వ ముండుట కభిలషించిన వారే కదా!

ఇపుడు జరిగిన దేమనఁగ- భాష కున్న పూర్వపు కట్టు బాట్లను గిడుగువారు సడలించు సరికి భాషాధికారము లేని వారును రచయితలుగా బయలుదేరినారు. వారు విచ్చల విడిగాఁ తమ తమ యుచ్చారణలను ప్రమాణములుగా భాషను ప్రయోగించుచు భాషపై నొకవిధముగాఁ బెత్తనము వహించుట (స్వారీచేయుట) కారంభించినారు. అదేమని ప్రశ్నించిన భావమే ప్రధానము కాని భాషకాదని వాదించు చున్నారు; ఈ విశృంఖలత్వము నరికట్టవలెనని, దీనినిట్లే సాగ నిచ్చిన భాషకు ప్రమాదము రానున్నదనియు నస్మదాదులకు భీతి నేఱికిఁ గలుగఁ జొచ్చినది. వ్యావహారికభాషలో శిష్టులు వ్రాసిన గ్రంథములు కూడ నేటి కనేకము వెలువడినవి. కనుక నింకఁ బండితులందఱు పట్టుదలవహించి యొక వ్యాకరణమును వ్యావహారికభాషకు నేర్పాటు చేయవలె నందును *అట్లే యొక మాండలికకోశము కూడ మనభాషలోఁ దయారు గావలెను.

---

* శ్రీ వడ్లమూడి గోపాలకృష్ణయ్య నా సూచనను కార్యరూపమునఁ బెట్టుట సంతోషకారణము.

పూర్వము కావ్యభాషకు నన్నే భిన్న కాలములలో భిన్న వ్యాకరణములు నిర్మింపఁ బడినవి. ఇపుడు వ్యావహారిక భాషకూడ వ్యాకరింపఁ బడవలసిన స్థితికిఁ బెరిగినది. ఇది వరలో మహాకవి ప్రయోగములను గ్రహించినట్లు నేడు "శిష్ట" వ్యావహారికము వాడియుచున్న మహాగ్రంథకర్తల గ్రంథముల నుండి ప్రయోగములను గ్రహింప వానికి గతి కల్పింపవలెను. ఇప్పటి వ్యావహారిక భాషారూపమును బూర్వ గ్రాంథిక భాషారూపమునకుఁ జేరువగా దీసికొని రాగల్గవలెను. అనఁగా నా రూపములు భాషాపరిణామమును సూచించునట్లుగా నుండవలెనని నాతాత్పర్యము. గ్రాంథిక వ్యావహారిక భాషల కీవిధముగా సమన్వయము కుదరవలసియున్నది.

నియమములో నీతి యున్న దందును. అలసత్వ మవిద్య లకే పట్టము కట్టవలెనను స్థితి భాషావిషయములో నేర్పడు చుండుట యెప్పరానిది. ఉచ్చారణము వ్యావహారిక భాషా రచనకుఁ బ్రమాణము కారాదు. శబ్దస్వరూపమును నాశము చేయు పద్ధతి నరికట్టవలెను. ఇందులకుఁ బండితులు కేవలము వ్యాకరణము వాడికొని ప్రయోజనము కలుగఁబోదు. అట్టి వ్యాకరణమునకు రచయిత లెల్లరు కట్టుబడియుండుట ముఖ్యమైన బాధ్యత.

గద్యసాహిత్య ప్రక్రియలైన చరిత్రలు, భాషా సాహిత్య శాస్త్ర విషయక విమర్శలు, వ్యాసములు, నుదాత్త వస్తుసమన్వితములు గావునఁ బ్రామాణిక భాషలోనే యుండి తీరవలెనని నా యభిమతము. ప్రజాసామాన్యమున కధిక ముగా వీనిపై నభిరుచి తక్కువ యనియే చెప్పవలె. వీనిని

వ్యావహారిక భాషలో వ్రాసినను విషయోద్దాత్తతనుబట్టి ప్రజాసామాన్యమున కెట్లు నంతుపట్టునవి కాఁబోవు.

ఇంకఁ గథ, నవల, వచననాటిక, లేఖ లనునవి ప్రజాసామాన్యమున కెక్కువగాఁ బ్రీతిపాత్రమైనవి. తేలిక రచన లని వీనిని దోసిరాజన వీలులేదు. వీనిలోఁ గావ్యత్వము గోచరింపవలె. అందుచే రచయిత భాషావిషయములోఁ గూడ శ్రద్ధవహింపవలెను. సామాజికేతివృత్తమును గ్రహించి గ్రాంథికభాషలో సంభాషణములను నడిపించినచో విపరీతముగా నుండును. అందువలన రచయిత యొనర్చు కథాకథన మాకర్షణీయమైన శైలిలో నుండి పాత్రల సంభాషణములు వాని వాని నంతస్థులఁబట్టి సంస్కారములనుబట్టి విభిన్నరీతులలో నడిపింపవలెను. దీనినే పాత్రోచిత భాష యందురు.

సుకవి భావములో నుదాత్తత నభిలషించుచున్నప్పుడే రసానందము కొఱకు తీవ్రముగా నాలోచించుచున్నప్పుడే ఆలంకారిక దృష్టిని బెంపొందించు కొన్నప్పుడే వచన రచయిత కూడ భాషావిషయమున – శబ్ద స్వరూప ప్రయోగముల పట్ల – శ్రద్ధ తీసికొనుట యావశ్యకము.

ఈ నాఁడు వచన రచయితల సంఖ్య పెరిగిపోవుటకు ముఖ్యముగా వ్యావహారికభాషయే ప్రధానకారణ మంచును. ఇది రామమూర్తి పంతులుగాదు పెట్టినభిక్ష యే! మఱి, దానితోపాటు "భ్రష్ట" (భ్రంశ్-ధాతువు) వ్యవహారికమును భరింపవలసిన దుర్గతిని కూడ గిడుగువారే కల్పించి రందుమా? వారను కొనినది వారి తరువాత మనవంటివా రుందురనియు, వ్యావహారిక భాషానియమము నేర్పరించుటకు వారి తర్వాత

కాలము వచ్చితీరుననియు; అట్టి సమయము రానే వచ్చిన దని నామనవి.

భాషాధికారము లేనివారు, ఛందోధికారము లేనివారు పద్య మల్లుటకు భయపడుదురు. కాని వ్యావహారిక వచనము వ్రాయుట యనఁగా నందునను విశృంఖలముగా నెవరి యుచ్చా రణమును బట్టి వారు వ్రాయుట యనఁగా రచయిత లసంఖ్యా కముగా బయలుదేరుదురు. అందులకుఁ బ్రయత్నమే, శిక్షయే యక్కర లేదాయె! పండిత పామర విచక్షణమే యవసరము లేకపోయినచో మన తెలుఁగుభాష నిర్గతికమై, సంకరమై, భ్రష్టమును నష్టమును బొందఁగలదు.

ఇంక వ్యావహారికము వ్రాయుటకుఁ బాండిత్య మవ సరములేదని యనుకొనుటలోను, పాండిత్య మున్నవారు వ్యావహారిక భాషాస్థితికిఁ దిగివ్రాయుటకు శ్రమపడనక్కర లేదను కొనుటలోను బొరపాటున్నది. (కొందఱు పండితుల వ్యావహారికభాషారచనము సహజముగాక కృతిమమై దురవ గాహమై చనుటయుఁ గాంతుము.) ఏది తేలికరచనము? ఏది యుదాత్తమైన రచనము? అని ముందు విచారింపవలెను. నవ లను ('లైట్‌లిటరేచర్' గా) తేలికగా గ్రహింపరాదు. గద్య సాహిత్య ప్రక్రియలలో విస్తృతావకాశము కలిగి, కావ్యత్వ మును బొందించుకొను రచనము నవల. మనము దీని నాఖ్యా యిక యందును. పద్యకావ్యమున కున్నంతటి స్థితి యీ వచన కావ్యమున కున్నట్లు గ్రహింపవలె. వర్ణనములు, సంభాషణ ములు, సన్నివేశములు, చర్చలు నైతికబోధలు మొదలైన వన్నియు నవలలోఁ బద్య ప్రబంధ మందువలె నుండును.

గావునఁ దన్నిర్మాణమునకు నధికమైన శ్రద్ధ గ్రహింపవలసి యుండును.

మానవులపై పత్రికల ప్రభావ మీనాఁటి కాలమున విపరీతముగా నున్నదనుట సత్యము. ఈ పత్రికల మూలమునఁ పాత్రికేయులు (Journalists) అనఁగా - విలేఖకులు, సంపాదకులు, సహాయసంపాదకు లందించుచున్న భాష భిన్నరీతులలో నుండి (భాషావిద్యార్థులపై) వింతపరిణామమును, వింత ప్రభావమును జేకూర్చు చున్నవి. వీరి చేతులలోనున్న సాధనము (పత్రిక) చాల నిశితమైనది. అది బహుళప్రచారమున కనువైనది. వీరికి భాషాధికారము చాల నవసరమైనది. కేవల మాంగ్లభాషా ఛాయాలలో నడుచు వచనరచన మనువాదములతోఁ జేయుచున్నచో- తెలుఁగుభాషకు క్షేమము కాదు. సంస్కృతభాష తెలుఁగుభాషలో బాగుగ మేళనము పొందియున్నది. కనుక తెలుఁగురచయితలకు సంస్కృత భాషా పరిచయము కూడ నవసర మగును. వ్యుత్పన్నుని రచనమునకు సామాన్యుని రచనమునకు నెంతయో వ్యత్యాస ముండును. భాషాకృషి లేక రచయిత యగుట యేమంత సులభమైనది కాదనుభావము కల్గుట యీవశ్యక మేమో. పాత్రికేయులు* కూడ భాషాదృష్టి పెట్టుకొని తీరవలెనని యుందును. పత్రికలే పరమగురువులు; కనుకలి జ్ఞానమే గాఢముద్ర వేయఁ జాలినది గదా.

[డాక్టరు గిడుగు వేంకట సీతాపతిగారి యధ్యక్షతన విజయవాడ ఆకాశవాణివారి ఉగాదిగోష్ఠిలో (చున్మథ) నా ప్రసంగము.]

---

*నేను సృజించినపదము.

తెలంగాణ భాష - యాసలు

సకల జీవకోటిలో మానవుఁడు విలక్షణుఁడు. ఇట్లు మానవుని సంభావించుటకు రెండు విషయములు కారణ భూతము లగుచున్నవి. అవి భాషాబుద్ధు లనునవి. వివేచనా శక్తి బుద్ధివలనను మనోభావములు భాషవలనను వ్యక్తము లగును. బుద్ధిహీనుని గాని మూగవానిని గాని మన మెన్న లేము గదా. మానవుఁడను వానికి భాషా బుద్ధు లను నవి యుండుటచేతనే సృష్టిజాలములో నతనికి విశిష్టస్థానము నుత్తమస్థానము లభించుచున్నది. తదితర జీవులలో మాన వుఁడే యధిగమించి భాషాబుద్ధుల చేత లోకకల్యాణము జేకూర్చు యత్నములో సాధకుఁ డగుచున్నాఁడు.

ఈ భాషాబుద్ధులలో భాష బాహిరమునకుఁ జెంది నది. బుద్ధి యంతరమునకు సంబంధించినది. ఈ రెండింటికి నవినాభావ సంబంధ మున్నది. భాషలోబుద్ధి ప్రతిబింబించును. బుద్ధి వివేచించుకొను సందర్భమున - పైకిఁ గన్పింపక పోయినను - భాషావ్యాపారము లోలోన జరుగుచునే యుండును. అనఁగా బుద్ధిని నడిపించు భాష రహస్యముగా నంతరంగమున నణగియుండునని తాత్పర్యము. కనుక భాషా బుద్ధులు బహిరంతఃప్రవృత్తులకుఁ జెందినవైనను వాని నాధారాధేయములుగాఁ బరిగణింపవలె. అనఁగా బుద్ధి భాషాభివ్యక్తమనియు, భాష బుద్ధి ప్రేరకమనియుఁ దెలియవలెను.

భాషింపఁబడునది భాష; అట్లు- తెలుఁగు జాతీయులు మాట్లాడునది తెలుఁగు భాషయైనది. ప్రపంచభాషలలోఁ

తెలుఁగుభాష యిటలీభాషతోఁ దుల్యమై, నాదసౌందర్యము నకుఁ బెట్టినది పేరుగా, లలితభావప్రకాశమున కనువైనదిగాఁ బ్రసిద్ధికెక్కినది. తెలుఁగుభాషలో నున్నమధురిమ, మార్దవము మఱొక భాషలో నంతగా లేదనుట పరిశీలనముచేఁ జెప్పఁడి యభిప్రాయమే. దీనిని బట్టి తెలుఁగువారి హృదయ మెంతనార్ద్రమైనదో వ్యక్తము కాకతీరదు. భాషను బట్టి యా మానవుని ప్రకృతి, జాతినైజము నభివ్యక్త మగు చుండును.

ఆలంబనము బట్టి భాష ద్వివిధముగా భాసించును. భాష ప్రజనుబట్టియు, గ్రంథములనను సరించియుఁ బెరుగుచుం డును. గ్రంథములలో కంటెఁ బ్రజావ్యవహారములోని భాష సజీవముగను, నవనవోన్మేషముగ నుండును. భాషలోనుండు నిసర్గశక్తి, జాతీయములు, సంప్రదాయములు, మర్యాదలు, వక్తృహృదయోద్వేగము, వ్యాకరణసూత్రబద్ధమైన ప్రామా ణికభాషలో నిమీలితములై మరుగునఁ బడిపోవును. కాని వ్యావహారికభాష యట్లుగాక, స్వేచ్ఛాయుతమైనది కనుక కాకువుల నుచ్చారణ మాత్రముచే జనించునర్థభేదముల నందించుచు నొకవిధమైన 'ఊపు - తూగు' నున్నట్టిదై యుర మరలు లేక నిరాటంకముగ సూటిగా భావము హృదయగమ్య మగుట కెంతయోనను కూలించును. కృత్రిమోపవన రమ్యతకు సహజప్రకృతీ సౌందర్యమునకు నెంతటి భేద ముండునో - కాగితపుఁబూలకుఁ జెట్టునఁబూచిన పూవులకు నెంత భేదముం డునో యంతటి యంతరము ప్రామాణికభాషకును వ్యావ హారికభాషకు నున్నది. అపరిష్కృతము ననావిద్ధరత్న సదృ

శము నైనది వ్యావహారికభాష. దీనిని గమనించియే గిడుగు వేంకట రామమూర్తి పంతులుగారు వ్యావహారిక భాషా వాద మును బ్రతిపాదించి త్రికాచార్యమునకు మూలపురుషులైరి.

భాష నిత్యవ్యవహారములో నలుగురు పదుచుండి వ్యక్తిని బట్టియుఁ బ్రాంతమును బట్టియుఁ బరివర్తనము జెందు చుండును. కొందఱు మాటలను దేల్చి పలుకుదురు. మఱి కొంద ఱొత్తి పలుకుదురు. కొంద ఱక్షరముల ప్రింగుదురు. మఱికొందఱు సాగదీసి పలుకుదురు. కొన్ని ప్రాంతములలోఁ బ్రత్యేకముగాఁ గొన్ని పదములు వాడుకలో నుండును. మఱి కొన్ని ప్రాంతములలో నవి యపురూపములే యగును. ఇతర భాషా ప్రభావమీభాషపై నెక్కువగాఁ గలిగియుండుట మూల మున నా భాషాపదము లిందులో సంకీర్ణము లగుచుండును. నిరంతరము వాడుకలో నున్న నాణె మెట్లరిగి పోవునో యట్లే ప్రజల వ్యవహారములోఁ బదములు నలుగుడుపడి, స్వరవిశేష ములలో విచిత్రమైన మార్పుఁ జెంది, వినువారికి వింతను, నవ్వును జనింపఁ జేయుచుండును.

తెలుఁగుభాష వివిధ ప్రాంతములలోఁ బ్రసంగింపఁ బడుచు నమితముగాఁ బెరిగిపోయినది; మాండలికములు - యాసలు శోభితలకు వినోదమును గూర్చుటయే కాక భాషా శాస్త్రజ్ఞునకుఁ బనికల్పించునవిగా నున్నవని యెఱుంగవలెను- విశాఖపట్టణ ప్రాంత యాసవేఱు- గోదావరీ ప్రాంతోచ్చా రణము వేఱు- గుంటూరు కృష్ణామండలములు మాటలతీరు వేఱు-నెల్లూరు ప్రాంతీయులు వేఱు. రాయలసీమ తెలంగాణా ప్రాంతములలోని తెలుఁగుభాష పీని కంటె వైశిష్ట్యము, ప్రత్యే

కతయుఁ గలది. నేటి రచనములలో వ్యావహారికభాష బహుళముగా వాడుచున్నను రచయిత లెందువలననో రాయలసీమ, తెలంగాణ ప్రాంతములలోని 'మాండలిక' భాషను లోకమున కందించినవారు కారైరి.

తెలంగాణమని పేరువడసిన యెనిమిది తెలుఁగు జిల్లాల లోని ప్రజలు వ్యవహరించుకొను తెలుఁగు భాషలోని తీరు తీయముల నెన్నుకొందము:

తెలంగాణపుఁ దెలుఁగు భాషలో యాసలు చాల విచిత్రముగ నుండును. వీనిఁ బరిశీలింప వలెనని గ్రామసీమలలోఁ బనిపాటలవారు, పాలేరులు మాటలాడు భాషను గమనింపవలె. వీరిభాష నాగరకతకు, వ్యాకరణ సూత్రములకుఁ గట్టుబడక సహజసౌందర్య ప్రకాశముతోడను జాతీయముల ప్రాచుర్యముతోడను విలసిల్లుచుండును- నాదసౌందర్యము, నాదశక్తి, శబ్దోత్పత్తి క్రమవికాసాదులను వీరుచ్చరించు భాషలోఁ గనఁగల్గుదుము.

తెలంగాణపు భాషలో శిష్టమైన భాషాపదములు స్వరూపమును గోల్పోనిక వ్యవహారములో నున్నవి. కొన్ని పదము లుచ్చరించు తీరులో భిన్నతను బొందుచున్నవి. కోర్టులలో, కచ్చేరీలలోను వ్యహరించు భాష, ఉరుదూ, యగుటంజేసి, ప్రజలు ప్రసంగించు తెలుఁగు భాషలో నా యురుదూ భాషాపదములు వచ్చిచేరుట పరిపాటైపోయినది. తెలంగాణములోఁ బ్రచురముగ నున్న కొన్ని కొన్ని పదములు మఱెచ్చటను లేనివై తెలుఁగు భాషావికాసమునకు నెంతగనో తోడ్పడునవిగా నున్నవి.

కొన్ని పదములఁ బరిశీలించుచుండిన నిఘంటువులలోఁ జేర్చఁదగిన పదజాలమనేకముగాఁ దెలంగాణములోని తెలుఁగుభాషలో నున్నట్లు కనుగొందుము. కొన్ని క్రియా పదములు నామవాచకములు వినుటకు ముచ్చటగా నుండును. ఇంక వీనిని కొన్ని యుదాహరణ పూర్వకముగా గ్రహింతము.

వర్ణలోపములు, వర్ణప్లుతులు, వర్ణసాంకర్యము లుచ్చారణములో నెట్లమరియున్నవో యీ దిగువ చూడుఁడు:

1. అగ్గో గడేందుల్లో, 2. ఊకె పరాశికం ఆడ్తవూ, 3. నీ బాంచెను, కాల్మొక్కత, 4. అచ్చిండు పంతులూ ఉయ్, 5 పుట్నాలు బుక్కతున్నడూ పోరడూ, 6. అరె అస్తె అద్దంటమ? 7. నా కెర్క లేదు, 8. ఇయ్యాల రేపు మీకు కండ్లబడతమా మేం! 9 నెత్తి నొస్తుందంట పన్నడు, 10. శుక్క రారం అచ్చి నాఒడు, 11. అమ్మగారు గిట్ట బాగున్నరా? 12. అగ్గొ-ఊకె నవ్వ బట్టిండూ?

పైవాక్యములలో భాష ప్రామాణిక శబ్దముల కెంత సన్నిహితముగ నున్నదో పరికింపుఁడు. అదిగో=అగ్గో యైనది; బానిసను=బాంచెను గా మారినది; పరిహాసము=పరాశికం అయినది; బొక్కచున్నాడు = బుక్కతున్నాడు అయినది; ఎరుక=ఎర్కగా కుదింపఁబడినది; కాలు మొక్కెద=కాల్మొక్కత అని మారినది. అచ్చిండు, అస్తె, అను పదములలో వచ్చినాడు, వచ్చిన అను రూపములు మాతృకలుగా నిలచి పదాదిఁ 'వ' కారలోపము జరిగినట్లు చూడఁగలము; ఊరక = ఊకెగా పరివర్తనము బొందినది; ఇవ్వేళ=ఇయ్యాల అయినది;

నొచ్చుచున్నదఁట=నొస్తుందంట అని మారినది పండుకొని నాఁడు=పన్నడు అయినది. నవ్వుట కారంభించె నేమి? యను టకే– నవ్వబట్టిండూ? అను ప్రయోగము.

''పలికిండు, పలికినాఁడు?'' మొదలగు పదములలో నకారము దీర్ఘమగుటచేఁ బూర్ణబిందువుగా మారుటచేతను నవి కొత్తగాఁ గన్పించుచున్నవి.

ఉరుదూ పదములువచ్చి తెలంగాణపు తెలుఁగు భాషలో నెట్లు హత్తుకొనిపోయినవో, యెంతగా నవీనమై తెలుఁగు పదాలుగానే పరిగణింపఁ దగినవిగా కలసిపోయినవో చూడుఁడు:

1. ఏం సతాయిస్తవూ? 2. నల్ల ఖుల్ల ఉంచిండు పోరడు, 3. కాస్తాలో బుకాయించిండు, 4. నాకేం జిమ్మేదారీ? 5. ముసాపుస్లు బంగలల దిగిన్రు, 6. గల్లీలోకి ఫిరాయించిండు, 7. మోరీ కడిగినాఁవు? 8. చౌదా లన్నీ గిరాకిగ వున్నయ్, 9. జల్ది పోరాదురి, 10 పురసత్ లేదు, 11. నా రుమాల్, ఛతీ జర తేరాఁదు? 12. కచిరీ ఖుల్ల లేదా? బంచున్నదా? 13. ఇమానం సొప్పన సెప్పు, 14. కందిలి తెచ్చినవా?

పై వాక్యములలో నున్న యురుదూ పదములను జూచితిరి గదా! గరీ బోణ్ణి–గులాపోణ్ణి అను శబ్దములలో గరీబ్, గులామ్ అను ఉరుదూ పదములు 'వాణ్ణి' (వాఁడను) అను తేలుగుపదముతోఁ గలసిపోయి ప్రత్యేకపదములుగా నేర్పడినవి. 'ఆజ్ కల్' అనుప్రయోగమునకుఁ దుల్యముగా 'ఇయ్యాల్రేపు' అని యవతరించినది.

ఊకుండ బుద్ధి కాదు? (ఊరక యుండ లేవా? = అంకాయలు పట్టి ఉన్నయ్యా? (వంకాయలు కావలెనా?) - పోరిని తోలు కొచ్చిండా? (పిల్లను దీసికొని వచ్చినాఁడా?) అనెడి ప్రయోగములలోని వైశిష్ట్యమును జూచితిరి గదా.

అరె పడగలవు-ఎన్నడు రాకడ- మమ్మ్మల నడుగవూ- అగ్గో ఆత్రిమూ- మొదలైన వానిలో శబ్దములు గ్రాంథిక రూపములుగనే నిలచియుండుట గమనింపఁ దగినది.

ఇవి కాక తెలుఁగు నిఘంటువులో నింక జేర్చుకొనఁ దగినపదము లచ్చమైనవిఁ తెలంగాణపుఁ బొలములలోఁ బండిన రసవత్ఫలములు ఎన్నియో!

ఈ క్రింది పదప్రయోగములను జూచునది :-

1. లగ్గమైనాఁదిరి? అనఁగా వివాహమైనదా యని, 2. చిప్పలపండు = శీతాఫలపుపండు, 3. గోకర కాయ = గోరు చిక్కుడు కాయ, 4. పెండ తెచ్చినవ? = పేడ తెచ్చితివా?, 5. నూకుతవా = ఊడ్చెదవా!, 6. పుంటికూర = గోంగూర, 7. పుట్నాలు = సెనగపప్పు, 8. బేస్తారం = గురువారము, 9. పోరి = పిల్ల, పోరఁడు = పిల్లవాఁడు, 10. మైదాకు=గోరింటాకు, 11. తొక్కు పెట్టిర్రా? = పచ్చడిపెట్టినారా? 12. సక్కముక్కలం కూకో = పద్మాసనమువైచి (బాసిపెట్టు) కూర్చుండుము, 13. అరుచుకురా = కనుగొనిరా, (అరసికొనిరా,) 14. ఒర్లుతవూ? = అరచెదవేల? 15. సైసు = సహించియుండు, 16. బాసండ్లు = అంట్లు, 17. చూపి = దాహము, 18. తోలుకు పోతవా? = తీసికొని వెళ్ళెదవా?

ఇట్లు తెలంగాణపు భాషలోఁ గ్రొత్తపదములు లభింప

గలవు. తెలంగాణపు భాషలో యాసలు వినుటకు ముచ్చటగా వింతగా, విపరీతముగా, నూతనముగా, జీవయుతముగాను గన్పించుచు నొక ప్రత్యేకత గలిగియున్నవి.

ఈ పదములను నందలి యాసలను బరికించి పరిహాసింపఁబూనుకొనుట తప్పిదమే యగును. అట్లు పరిహసింతురేమో యను భయముచే నొకప్రాంతమందలి ప్రజలు తదితర ప్రాంతముల వారి యెదుట మాట్లాడుటకు జంకుదురు. ఆ యాసతో మాట్లాడినచోఁగతాళి చేయుదురేమో యని యాప్రాంతీయులెప్పుడుగాని వెనుదీసినచో మనభాషకు మనకును దీరనిలోటు, నపచారము వాటిలినట్లే కాఁగలదు. ఆ మాండలికములు నా యాసలు, నా ప్రయోగములు, నా జాతీయములు, వారి భాషాసంపద, మరుగున పడిపోయినచో నిజముగాఁ బెన్నిధిని గోల్పోయినట్లే యగును. ఇట్లే యన్ని ప్రాంతముల భాషా పదముల విషయమునందును శ్రద్ధ యవసరము. ఒక ప్రాంతమువారు మఱొక ప్రాంతమువారి భాషలోని యాసలను, విశిష్టతను సానుభూతితోనే కాక యాసక్తితోఁ బరిశీలించి వానిని భద్రపరచుట కర్తవ్యముగా భావింపవలెను. సర్వతోముఖముగ నాంధ్ర భాషావికాస మపుడుగాని యభివ్యక్తమైనట్లు గాదు. ముఖ్యముగా [మహాంధ్ర నిర్మాణము నిమిత్తము ప్రయత్న మొనర్చుచున్న] మన మీ నాఁడు భాషాపరముగా నొక యైక్యతను సంపాదింపవలసిన యవసర మెంతయైనఁ గలదుసుమా!

రాయలసీమ రత్నాలసీమ. తెలంగాణము తేనెమాగాణము, తెలుఁగుభాషా యోషకు తెలంగాణము పెట్టు భూషలను గూడఁ బ్రిమాణికబుద్ధితో గ్రహించుట యభిలషణీయము. కాబట్టి భాషాపదముగా సాన్నిహిత్యమును గూర్చుకొను నిమిత్తము భిన్న మాండలికముల నరమరలు లేక - భేద భావము లేక వాత్సల్యమును బురస్కరించుకొని మహోదారబుద్ధితోఁ గృషి సల్పుటకుఁ బండితులు రచయితలు బ్రిజానాయకులు బూనుకొందురని నా యాకాంక్ష !

[మదాసు ఆకాశవాణి కేంద్రమునుండి 21-2-1950 తేదీన నేను జేసిన ప్రసంగము; ఆంధ్ర పత్రిభలో పత్రికటితము. ఈ నా ప్రసంగముతో పాటు డా. గిడుగు వేంకట సీతాపతి, డా. చిలుకూరి నారాయణ రావు గారలు కోస్తా - రాయలసీమభాషలపైఁ జేసిన పత్రిసంగములు చూడఁదగినవి.]

మన నానుడులు పలుకుబడులు

ఏ భాషాసౌందర్యమైన నాభాషలోఁ గన్పించు సహజ మగు నానుడులపైనను పలుకుబడుల మీఁదను ముఖ్యముగా నాధారపడి యుండును. వీనినే జాతీయము లనియు నందురు. భాషను జీవస్రవంతి వలెఁ బ్రవహింపఁ జేయునవి, భాషలో నందచందముల నందించునవియు నందంతర్గర్భితములైన నానుడులు పలుకుబడులే. ఈ జాతీయముల నే భాషలంజైన పదిల పఱుపఁగల్గిన వారాయాభాషలను మాతృభాషలుగాఁ గలిగిన వారే. అన్య భాషీయులు నూతనముగా మఱియొక భాషను వ్యాకరణ నింఘంటువుల మూలమున నభ్యసింపవచ్చును. కాని, సహజసిద్ధమగు భాషాసౌందర్యమును- ఆ భాషలోని నాన్నుళ్లలోను పలుకుబళ్లలోనున్న జీవమును వంటపట్టించు కొనఁ జాలరనుట తథ్యము. అట్టి రమ్యానుభవము నాభాషా ప్రాంతములందుఁ బుట్టిపెరిగి యా భాషను జీర్ణింపఁ జేసికొన్న వారు తప్ప నితరులు పొందలేరు. జాతీయముల సౌందర్యమును, అట్టి ప్రయోగములను గమనింపక పోయినచో - భాషాకన్యయొక్క- యొయ్యారములను, ఒదుగులను, ఎదుగు బొదుగులను, తీరు తీయములను దెలిసికొనక పోయినచో-భాషాభ్యాసము చేసినవాఁడు వ్యర్థుఁడే యగును. ఇట్టి నానుడులు పలుకుబడులు, సామెతలు= (జాతీయములు) నే భాషకాభాషకుఁ బ్రత్యేకముగా నమరియుండి యాయా భాషలను విశిష్టములైనవిగాఁ బ్రత్యేకించి భద్రపరుచుచుండును.

సహజ సౌందర్య విలసితములు, స్వయం ప్రకాశములు నయిన నానుళ్లు- పలుకుబళ్లు నా భాషను మాతృ భాషగాఁ గలిగిన వారి భాషావ్యవహారములో లభించుట యన్న విషయము నట్లుంచి, ముఖ్యముగా నివి పట్టణవాసుల వ్యవహారమునందు కంటె గ్రామీణుల వ్యవహారములో మిక్కిలిగా నిమిడి యుండుననుట తథ్యము. అన్యభాషా సంపర్కము, విజాతీయ నాగరకతా ప్రభావము లే భాషపైన నైనను భాషీయులపైన నైన కొంతవఱకుఁ బడి, వారి భాషావ్యవహారములో మార్పులను దీసికొని వచ్చితీరును; కృత్రిమత్వమును గల్పించి తీరును. ద్విభాషాప్రాంతములలోను, బహుభాషా వ్యవహారము లుండు పెద్ద పెద్ద నగరములలో నిట్టి భాషాసాంకర్యము గోచరించి తీరును. వాక్యనిర్మాణ పద్ధతిలోఁ బదప్రయోగ క్రమములో నన్య భాషా ధోరణులు ప్రభావమును నెరపుట, కొన్నియెడలఁ గేవ లానువాదములే దొరలుట, మనము కనిపెట్టుచుందుము. ఇటీవలఁ గొన్ని శతాబ్దముల తరబడి ప్రభుత్వభాషగా నేలిక వహించిన యాంగ్ల భాషాప్రభావ మన్ని భారతీయ భాషలలోను హెచ్చుగా నున్నట్లు తెలిసికొనఁగలము. అట్లే తత్పూర్వము ముస్లిముల పరిపాలనా ప్రభావము దేశభాషల పైన లేకపోలేదు. న్యాయస్థానములలో, విపణివీధులలో నలుగుడుబడుచున్న భాషను జూచిన ఆంగ్ల, ఉరుదూ భాషాపదముల బాహుళ్యము స్పష్టముగా నవగతమగును. అట్లే ద్విభాషాప్రాంతములలోఁ గన్నడపద సాహచర్యము, తమిళపద సంసర్గము, ఒరియూ పదప్రభావము, ఉరుదూ భాషాప్రాచుర్యము నాయూ, భాషల

యుచ్చారణములు తెలుఁగు భాషకు సంక్రమించుట మనము గమనించుచున్నట్టిది నిత్యానుభవములోనిదేకదా!

ఇట్టి యన్యభాషా నాగరకతా సంసర్గములేని గ్రామీణుల వ్యవహారములో, నట్టి ప్రభావమునకు దూరముగ నున్నట్టి వారి వ్యవహారములో నానుళ్ళు - పలుకుబళ్ళు పదిలపడియుండుట - గ్రామము లన్నియుఁ బట్టణములుగాఁ గ్రమముగా మారిపోవుచున్న యీ దినములలో - కష్టమేయయి నను భాషకు యదార్థముగ జీవమును బోయు నీజాతీయము లింక నశించిపోవక యుండుట మన యదృష్టమే! కవులు, రచయితలు తమతమ రచనములం దాయాప్రాంతము లందలి భాషాజీవిత సర్వస్వ మనఁదగు జాతీయము లను బెన్నిధిని చాలవఱకు భద్రపరుచుచు వచ్చిరనుట నిస్సందే హాంశము. కాని గ్రాంథికభాషలో రచనము సాగిన కావ్యములలోఁ ప్రాచీన కాలమున నిట్టి నానుళ్లు - పలుకుబళ్లను బహుధా చొప్పించుటకు నెక్కువ యవకాశములు లేనిమాట వాస్తవమే; వ్యావహారిక భాషోద్యమమును నడిపిన కీ శే. గిడుగు వేంకట రామమూర్తి పంతులు ధర్మమా యన్న ట్లీ యిరువదవ శతాబ్దములో వ్యావహారిక భాషలోఁ జెలుఁగు పత్రికలు, గ్రంథములు, కావ్యములు, నుపన్యాసములు నసంఖ్యాకములుగా వెలువడుట మూలమున మనకుఁ గొంతకుఁ గొంతయైనను మన నానుళ్లు - పలుకుబళ్లు, సామెతలు. మాండలికములు, నేటి మన వాఙ్మయములో భద్రపడి యున్నవి. తెలుఁగున వ్యావహారికభాషయే గ్రాంథిక (గ్రంథస్థ) భాషయైన యీ సమయమునఁ బ్రామాణికత్వము వ్యావహారికభాష కేర్పడ

వలసిన యీ తరుణమున మననానుళ్లు - పలుకుబళ్లు, సామెతలు, మాండలికములు కోడీకరించి నిఘంటువులుగా రూపొందుటకు యత్నము నొకదెస జరుగుచుండుట మనము హర్షింపఁ దగిన విశేషము. ఈ నావ్యాసమట్టి యత్నమున కేకొలఁదిగనో దోహదము కాగలదనియే విశ్వసించుచున్నాను.

ఏభాషలో నున్న నానుళ్లు, పలుకుబళ్లు నా భాష మాట్లాడు వారి శీలమును, ఆచారవ్యవహారములను జీవితమును బ్రతిబింబింపఁగలిగియుండు ననుట సత్యము. అలంకారములపైఁ బ్రీతి, ముక్కుమీఁద కోపము, పరులను బరిహసించు స్వభావము, నల్పసంతోషస్వాంతత, వ్యావసాయిక జీవిత సౌభాగ్యము, ప్రకృతి సౌందర్య పారవశ్యము, పైకగుపడుటలోఁ బాషాణ సదృశ కాఠిన్యము, హృదయములో నార్ద్రితా పూర్వకమైన ప్రేమ, పాపభీతి, దైవభక్తి, ఉదేకము, స్వజాత్యభిమానము, కళాప్రియత్వము మున్నగునవి తెలుఁగువారి గుణశీలములన్నట్లు తెలియజెప్పునవి మన నానుళ్లు, పలుకబళ్లు *

ఇంక మననానుళ్లను, పలుకుబళ్లను, గొన్నింటిని వివిధ శీర్షికల క్రింద విభజించి యీ దిగువ నుదాహరించు చున్నాను.

* జంటపదములు *

ఇవి నామ వాచకములకుఁ జెందినవి. వీనిలోఁ బ్రాసలు నాద్యంతాక్షర నియమములు, సాదృశ్యము లెంత చక్కగా

* ఇంతవఱకు వ్రాయసము నెఱపి తోడ్పడిన మత్పితృపాదులకుఁ బ్రణామములు.

నమరియున్నవో గుర్తింపుడు. ఇందుఁగొన్ని పదముల కర్థ మింక విచారింపవలసియున్నది. ఒకే యర్థమును దెలుపునవై రెండు పదము లుండుటయుఁగలదు. వీనిలో యతిప్రాసల యందమే యందము సుమా!

పెళ్లీ పేరంటమూ	కలో గంజో
ఊరూ పేరూ	కాలం కర్మం
నౌకర్లూ చాకర్లూ	వానీ వరునా
కొంపా గోడూ	నయాన భయాన
డాబులు డచ్చీలు	బండీ బడుద్ధమూ
చెట్టూ పుట్టా	అదుపూ ఆజ్ఞా
పిల్లా పీచూ	గుడ్డా పాతా
పరువూ ప్రతిష్ఠా	ఆగం అల్లరీ
మన్నా దుమ్మా	దుమ్ము దుమారం
చెట్టూ చేమా	దగ్గరా దాపా
నీతీ జాతీ	చీకూ చింతా
సందూ గొందూ	నుయ్యో గొయ్యో
ఈడూ జోడూ	జీతం నాతం
కొయ్యా గొణతమూ	డబ్బా దస్కం
ఆకూ అలమూ	అభము శుభము
ఆలనా పాలనా	మంచీ చెడ్డా
గాలీ ధూళీ	మూటా ముల్లే
అతీ గతీ	పాడీ పంటా
వానో వంగుడో	తలా తోకా
శుద్ధం బద్ధం	బీదా బిక్కీ
పూలూ పుక్కాయి	ఇరుగూ పొరుగూ

బూడిదా బుగ్గీ
కూలీ నాలీ
ఎదుగూ బొదుగూ
ముసలీ ముతకా
నగలూ నాణ్యాలు
ముద్దూ మురిపెమూ
మడీ మైలా
తీర్థం సార్థం
మందూ మాకూ
పీలూ చాలూ
తేళ్లూ జెంకర్లూ
విధి విరామమూ
అంతూ పొంతూ
నదరూ బెదరూ
పొలము బొటారి
రుచీ పచీ
భాగ్యమో బంగారమో
సిగ్గూ ఎగ్గూ
చదువూ సంధ్యా
దిక్కూ దివాణం
దారీ దొంకా
అమీ తుమీ
మాటా మర్యాదా
భయమూ భక్తీ

కూడూ గుడ్డా
తిండి తిప్పలు
చెత్తా చెదారం
అంటూ సొంటూ
మణీ మాన్యం
చాటూ మాటూ
లెక్కా డొక్కా
గొడ్డూ గోదా
అన్నెము పున్నెము
బాగూ ఓగూ
పిల్లా జెల్లా
ఇల్లూ వాకిలి
రేపో మాపో
పుణ్యమూ పురుషార్థమూ
సొమ్మూ సంబంధమూ
చీరెలూ సారెలూ
గట్టూ గనుమూ
మాటా మంతీ
తాడూ బొంగరమూ
కూరా నారా
గడ్డీ గాదం
చేటూ పాటూ
వంటా వార్పూ
సాయిలా పాయిలా

ఆలూ చూలూ	చాటూ మాటూ
మన్నూ మశానం	దిక్కూ మొక్కూ
అగ్గీ బుగ్గీ	పురుగూ పుట్రా
గుట్టూ మట్టూ	ఊరూ నాడూ
దేవుడూ దయ్యమూ	ఆస్తీ పాస్తీ
బేరం సారం	మడీ దడీ
వన్నే చిన్నే	చెట్టూ పుట్టా
కథా కమామిషు	కరువో కాలమో
చిన్నదా చితుకదా	తీరూ తీయమూ
నీళ్ళూ నిప్పులూ	పండూ ఫలమూ మొదలైనవి.

* వ్యస్త సమస్త పదములు *

వ్యస్తముగాఁ గొన్ని, సమస్తములుగాఁ గొన్ని పదములు విశేషణములతోడను, నలంకారములతోఁ గూడియుఁ గన్పించుచున్నవి. కేవలము సూటిగా నొక యర్థమును జెప్పునవికాక – వీనిలోఁ గొన్ని భావమును, శీలమును దెలియుఁ జెప్పునవియు నున్నట్లు తెలియుదుము. వ్యస్తముగను సమస్తముగను వాని సొగసులను విశిష్టార్థములను బరికింపవలసియుండును. ఇందుఁ గొన్ని యవ్యయములను గూడఁ జూడవచ్చును.

ఆక తాయి	ఆకస బోకసగా
తింగు రంగా యని	కానరాని చీలి
ససేమిరా	ఉత్త అర్భకుడు
కబుర్లరాయుడు	వెకిలి వేషాలు

శష భిషలు
కలికానికైనా
దూరా భారం
తనప నేమో తా నేమో
చూచాయగా
బ్రతుకు జీవుడా అని
ఉత్త పుణ్యానికి
బులిబుచ్చికాలు
తిప్పకాయ
నా సామి రంగా అని
తగుదు నమ్మా అని
ఊట్రుడియంగా
మూగి మునానమ్మ
పరాచికం
వెట్టి వెంగళప్ప
ఇచ్చకాలు
మనసులో మాట
ఉప్పుతో తొమ్మిది
తామరతంపర
పోచాయింపులు
బట్టబయలు
రావంధాళి
ఉక్కిరి బిక్కిరి

మిడిమేలం
బుక్కా ఫకీరు
ఆప సోపాలు
తాయిలం
ఆరిందా
బళ్లు బరువు
కట్ట కట్టుకొని
కాలికి బలపం కట్టుకొని
విచ్చల విడిగా
వీస మెత్తు
గుండెమోద చేయి వేసికొని
చెవులు దోర పెట్టుకొని
ఆదమరచి
చెప్పులలో కాళ్లు పెట్టుకొని
పోచికోలు కబుర్లు
తండోప తండాలు
బతుకు బండారం
వన్నెల విసనకట్టి
పైలా పచ్చీసు
కల్లబొల్లి కబుర్లు
బొడ్డూడని వాడు
నంగనాచి
గోచీపాత రాయుడు
ఉన్నపళంగా

లావాదేపీలు
తలవిరపనకాయ
అదే పనిగా
గడుగ్గాయ
పొట్ట నాయకట్టుకొని
చీమ చిటుక్కు మంటే
ఒళ్లు తెలియక
వేలం వెట్టి
వాత కోతలు
కో అంటే కోటిమంది
అంతర పొంతర వాళ్లు
కన్నుల పండువు
పాపాయి పరుపడాయి
మొదలైనవి.

* అలంకారిక పదాలు *

ఉపమ, రూపకా ద్యలంకారాదులను బోధిగొన్న పదములు కొన్ని ముచ్చట గొల్పుచు, కన్పించుచుండును.

కుక్కగొడుగు లాగా
కొంగు బంగారం
గాడిద బరువు
కాకి గోల
ఆవగింజంత
ఏనుగు పాడి
కుళ్లు గుమ్మడికాయ
ఎంగిలి మంగలం
అరటిపండొలిచి చేతిలో పెట్టినట్లు
అట్టుడికి నట్లు
కుండ పగల గొట్టినట్లు
కుక్కిన పేను లాగా
మొహంవాచేటట్లు చివాట్లు
ఏడ్చి మొత్తుకున్నట్లు
మిన్నువిరిగి మీదపడినట్లు
కాటుక కళ్లు
సానకిందవెన్నెలలాగా
తల కొట్టి వేసినట్లు
అరన చాకిరి
కోతిమూక లాగా
నక్కవినయాలు
శీతకన్ను
మూసివాయనం ముత్తైదులాగా
గుడ్డిద్దు చేలోబడినట్లు
కాలుకాలిన పిల్లిలాగా
కట్టె విరిచి నట్లు
పొట్ట చెక్కలయ్యే టట్లు

చెప్పుకింద తేలులాగా పిండి ఆరబోసి నట్లు
పూలలో దారము లాగా చెంపకు చేరడేసి కళ్లు
పొట్టి బుడంకాయ బెల్ల కొట్టిన రాయి లాగా
మొదలైనవి.

• ధ్వ న్యనుకరణములు : ఆంగిక వస్తు విశేష సూచకాలు • •

వస్తు విశేషముల నంగ వికారములను సూచించు నప్పుడు గాని, ధ్వని ననుకరించు సమయమునఁగాని ప్రత్యేక ముగా నా పదములనే మనము వాడవలసియుండును. వేరు పదములను వాడినచో నుడికారము తెలియనివారమే యగు దుము. ఆ యా క్రి యా ప ద ము ల ను ప్రయోగములను జూడుఁడు:—

గజగజ వణకడం	దభేలున పడడం
(గుండె) ఝల్లు మనడం	గుజగుజలు పోవడం
(ఆకులు) బలబల రాలడం	తళతళ మెరవడం
(గుండె) దడదడ లాడడం	చరచర సాగిపోవడం
చెంగుచెంగున ఎగరడం	బిరబిర నడవడం
కలకల నవ్వడం	(వేళ్ళు) కొంగర్లు పోవడం
గిలగిల తన్నుకొనడం	రెపరెప లాడడం
ఘుల్లుఘుల్లున గజ్జలు	(ప్రాణులు) నకనక లాడడం
బోరున వర్షం	(చేతులు కాళ్లు) విలవిల కొట్టుకోవడం
రణగొణ ధ్వని	
చిరుబుర్రు మనడం	మలమల మాడడం
చివాలున లేవడం	గబగబ నడవడం
బావురుమని ఏడ్వడం	ఖంగుమని మ్రోగడం

కుతకుత ఉడకడం	చకచక నడవడం
కణకణ లాడే నిప్పులు	చురచుర చూడడం
ధగధగ మెరసే (అంబరం)	(పళ్లు) పటపట కొరకడం
హోరుమని గాలి	కళపెళా వేయించడం
ముసిముసి నవ్వులు	వలవల ఏడ్వడం
చడామడా తిట్టడం	(చర్మం)విరవిరలాడి పోవడం
భోరుమని ఏడ్వడం	కరకర వేచడం
నిటారుగా నిల్వడం	పరపర కోయడం
(గుండె) గుభేలు మనడం	వలిగొని పోవడం

మొదలై నవి.

* క్రియా పదములు *

ప్రత్యేకముగా బరిశీలింప దగినది క్రియా పదముల ప్రయోగ మందున్న వైచిత్రి. ఇది వ్యక్త భావోద్వేగమును, భావనై శిత్యముకు నందలి తరతమ భేదములను దెలుపునవిగా నుండి భావములు కేంద్రములుగా బెట్టుకొని సంచారము సల్పునవిగా నున్నవి. కొన్ని కొన్ని నామవాచకములతో గ్రియాపదములు చేరి విశిష్టమయిన యర్థముల నిచ్చునవి. ఈ పలుకుబడులను దిలకింపుడు:-

చెవి కోసుకోవడం	కవిత్వం చెప్పడం
మాట ఇవ్వడం	పుట్టి మునగడం
లెక్క కట్టడం	నల్లపూసలు పెరగడం
వేషాలు వెయ్యడం	ప్రాల్మాలడం
పోకిళ్ళు పోవడం	మనసులో పాలు త్రాగడం

నడుము బిగించడం
నీళ్ళు నమలడం
పోకుపెట్టి ఏడ్వడం
నోరు తెరచుకొని వినడం
కళ్ళప్పగించి చూడడం
చంకలు ఎగరవేయడం
పల్లికిలించడం
ఇల్లు చక్కబెట్టుకోవడం
చెవులు దోరపెట్టుకొని వినడం
చెవు లప్పగించడం
చితుక గొట్టడం
మరగడం
కాళ్ళా వేళ్ళా పడడం
మసిలి పోవడం
కాలు మీద కాలు వేసికొని కూచోడం
తంపటలు పెట్టడం
చాప చంకన పెట్టుకోవడం
తందనాలు తొక్కడం
కళ్లలో వత్తులు వేసుకోవడం
నోరు పారేసు కోవడం
కాళ్ళీడ్చుకు నడవటం
తలదాచు కొనడం
నూరి పోయడం

కంకణం కట్టుకోవడం
పట్టి పల్లార్చడం
మెతుకు గతకడం
పందెం కాచడం
పద్య మల్లడం
పూలు ముడవడం
దీపం కొండెక్కడం
చెవులో గీపెట్టడం
నిభాయించడం
కళ్ళప్పగించడం
గుటకలు మింగటం
చప్పరించడం
చిన్నబుచ్చు కోవడం
పగలబడి నవ్వడం
లొట్టలు వేయడం
చెవిన పడడం
కళ్లు పడడం
తలపట్టి పోవడం
ఒళ్ళు దాచుకోవడం
కళ్లూ గడ్డాలు పట్టుకోవడం
వళ్లంతా కళ్లు చేసుకోవడం
కళ్ళలో నిప్పులు పోసుకోవడం
కళ్ళలో వత్తు లేసుకొనిచూడడం

మొదలైనవి.

* చీవాట్లు : అధిక్షేపణలు *

తెలుఁగువారికి ముక్కుమీద కోప మెక్కువయని సామాన్య పరిశీలనచేఁ జెప్పికొనెడి యభిప్రాయము. ఆకోపము చిరకాలముండి వేధించునది కాదు ; 'సోడాబుడ్డి'ని కొట్టి నపుడు వచ్చు పొంగువలె నప్పటికపుడే చల్లారి పోవునట్టిది. ఏమైనను, వారి కోపమును నిరూపించు అధిక్షేపణలను దిగువ గమనింతము గాత:-

కళ్లు కన్పించడంలా
తీసరమా ?
ఏ ముఖం పెట్టుకు వచ్చావు
పట్ట పగ్గాలు లేవు
తేరగా వచ్చిందేం ?
ఎక్కడ దాపురించాడు ?
నీ మొహం తుమ్మలలో
పొద్దు గుంకినట్టుంది
కోతులు కారుతూ మొహం
చెవులలో చెట్లు మొలచాయా
తెలివి చట్టుబండ లైనట్టు
పీడా వదిలింది
తెలివి తెల్లవారి నట్లుంది
ఇంత విరగబాటా

మరీ సోద్దెంగా (చోద్యము)
[ఉన్న దే
పనీ పాటా లేకపోతే సరి !
పొట్టి కోస్తే అక్షరం
[ముక్క లేదు
నీకేం మతి పోయిందా
డొక్క చీల్చి డోలు కట్టడం
నానా మాటలు
అఘోరించావులే
ఎం పోయ్యే కాలం
పిల్లికి బిచ్చం పెట్టడు
జిడ్డు మొహం
చలిమిడి మొహం
చాతగాని చెన్నయ్య

మొదలైనవి సర్వసామాన్యముగ విన్పించు నట్టివే. మానవుల యంతస్థును బట్టి వారి వారి సంస్కారముల నివి

తెలుపుచుండును. శిష్టజన వ్యవహారమే పరిమాణముగా వీనిఁ కూడ నెంచుకొనవలసి వచ్చినది.

* పరిశిష్టము *

తెలుఁగుజాతిలో మాగిన సామెతలు కొన్ని సుపరిసిద్ధముగా వ్యవహారములో నున్నవాని నుల్లేఖించుకొనినఁగాని యీ వ్యాసము శోభాయమానముగా నుండదని కొన్ని మాతరిమిందు పొందుపరుచుచుంటిని. ఇందులో నానుళ్లపలుకుబళ్ల శ్రేణిలోనికి వచ్చునవి కొన్ని తోంగి చూచుచున్నట్టివి యున్నవి; చిత్తగింపుఁడు:

పుట్టుకతో పుట్టింది పుడకలతో గుజ్జుం గాడిద సమానం
గాని పోదు చూరుపట్టుకు వేలాడడం
చెవులలో ఇల్లు కట్టుకొని నోట్లో నువ్వుగంజి నానదు
పోరడం కుడుం పెడితే పండగ
ఏటికి ఎదురీతగా కాలికి వేస్తే వేలికి వేలికి వేస్తే
పిండి కొద్ది రొట్టె కాలికి
చెంపకు చేరడేసికళ్లు కడుపులో చల్ల కదలకుండా
తల మునిగి తాటి పరిమాణం దేవుడు చాలమేలు చేస్తే
మున్నాళ్ల పట్టపగలు మూడు పూతా తరు
అయినవాళ్లకు ఆకులలో కాయలూ
కానివాళ్లకు కంచాలలో చేతిలో చిల్లి గవ్వైనా లేదు
ముందు వాళ్లకు మూకిళ్లు- కన్నమ్మకే వాపి-తిన్నమ్మకే వాపి
వెనక వాళ్లకు నాకిళ్లు కోనబోతే కొరివి, అమ్మబోతే
రమ్మన్నారు తిమ్మన్న బంతికి అడివి
ఆడింది ఆట పాడింది పాట జన్మకు శివరాత్రి!

ఈ పై నుదాహరించిన నానుళ్లలోను బలుకుబళ్లలోనున్న యందచందములను, భాషలోని ఒంపులను, ఒయ్యారములను బ్రత్యేకముగా వివరించుటకుఁగాని, వాని వాని యర్థవివేచనమునకుఁ గాని పూనుకొనలేదు. ఇందులకు గ్రంథ విస్తర భీతియే కారణము. భాషావేత్తలు, విజ్ఞులు, నిందలి యందచందముల నభిమానముతో ననుశీలింతురుగాక. మన తెలుఁగు వెలుఁగుతో పాటుగ భాషలోని నాద సౌందర్యమును, జాతీయములను భద్రపరచుకొనవలసిన కర్తవ్యమాంధ్రులందఱిపై నున్నదని విజ్ఞప్తి చేయుచు విరమింతును.

[నా యీ వ్యాసము 1958 జనవరిలోఁ దయ్యముకొని వచ్చిన ఆంతర ప్రేరణమును బురస్కరించుకొని కూర్చితిని. నా శ్రీమతి యీ కూర్పులో నాకు సైదోడు; మా తండ్రిగారు వ్రాయసము నెరపినారు. జులై 1958 'భారతి' లోఁ బ్రచురితమైనది.]

శతకములు - ధార్మిక ప్రబోధము

భారతభూమి వేదభూమి మంత్ర దర్శులయిన ఋషులు చేసిన తపోఫలితముగ భారత దేశము తపోభూమి యనిపించు కొన్నది. పుణ్యశ్లోకులు పుట్టిన దేశమగుటచే భారతవర్షము పుణ్యభూమి యైనది. అణువణువున నాధ్యాత్మిక తత్వపరికాణ ముచే వెలుఁగొందుచున్నది. భారతీయుల కాధ్యాత్మిక తత్త్వ ముగ్గుపాలతో నలవడి నట్టిదే!

ఐహికము కేవలము నిమిత్తమాత్రమే. జీవి యుత్తమ మైన మానవజన్మమెత్తి లౌకికమైన సకలకలుషములనుండి వివేకవంతుఁడై వైదొలఁగి జ్ఞాన సముపార్జనముచేఁ బరంజ్యో తిని సాధనవంశమున దర్శించుటయే పరమావధిగా నున్న ధర్మము. దీని నజ్ఞుఁడుగాని విజ్ఞుఁడు గాని భారతీయుఁడైనచో నీ విషయము నెఱిఁగిన వాఁడే యగును. కాని భ్రమ యను దొకటి మానవుని వేధించుచు నుండును. జ్ఞానమును మాయ యనునదొకటి యావరించి యుండును. అందుచే మానవజన్మ మెత్తిన జీవి యరిషడ్వర్గమును జయించి బద్ధమనస్కుఁడై యేకాగ్ర దృష్టితో యోగసమాధియుండు పరంజ్యోతిని దర్శించుట యంత సులభమైన కార్యముగాదు. ఇందులకు మానవుఁ డెన్నెన్నో సాధనములు చేయవలసియున్నది.

---

* ఈ వ్యాసరచనమునకు సహాధ్యాయులు శ్రీ మన్నవ గిరిధరరావు అభిలాష కారణము; చిరంజీవి త్రిమూర్తి వాగ్రియసము నెరపినాఁడు.

ముందుగా మానవుఁడు తన ప్రవర్తనమును జక్కదిద్దు కొనవలసిన యవసరమెంతయో యున్నది. అర్థకామములను పురుషార్థములు మానవునిఁ బ్రలోభపరచి ధర్మమార్గమునుండి తప్పించును. మోక్ష జిజ్ఞాసకుఁ గావలసిన చిత్తైకాగ్రత లేకుండు నట్లు చేయును. మానవుఁడు ముందుగా సజ్జన సాంగత్యమును గూర్చుకొనిన గాని మానవుడు మానవత్వమును దాను నిలు వరించు కొనఁజాలఁడు. మానవుడు దానవుఁడై పోవకుండుటకై తన్ను దాను రక్షించుకొనవలెను. లోకోపకారార్థము దా నుప యోగపడుటకై యత్నింపవలెను. అనంతరము దివ్యుఁడగు టకుఁ దానెంతగనో తపస్సు చేయవలసి యుండును. మానవుఁడుత్తమశ్లోకుఁడనిపించుకొనవలె ననియే భార తీయుఁడు మానవలోకమునకుఁ దరతరములుగా బోధించిన పరమార్థము!

ఈ బోధ భారతవర్షములో నన్నియుగములలోఁ దపో ధనులచేత ననారతముగా నవిరళముగాఁ జేయఁబడుచునే వచ్చు చున్నది. బాల్య, కౌమార, గార్హస్థ్య, వానప్రస్థ, సన్యాస దశలలో నున్న మానవులు తమ తమ యధికారానుగుణముగ నా పరమబోధను తెలిసికొను నిమిత్త మనేక వాఙ్మయశాఖల సృజించియున్నారు శ్రుతిస్మృతి పురాణేతిహాసములు. ప్రబంధ నాటకములు, సత్కీర్తన యక్షగానాదులు, చాటుధారలు మొదలైన వెన్నియో ప్రకీయ లీపరమబోధామృతమునే పంచిపెట్టుటలో సహాయపడుచున్నవి. కథలతోడను, పాత్రల తోడను, వర్ణనములతోడను, సంభాషణములతోడను, నిబిడ

ములై యనేక సాహిత్యశాఖలు ప్రధానమైన పరతత్వ బోధామృతమును దనివిదీర నానందించుటకుఁ జాలినవి కాక పోవుచున్నవి. సౌందర్యజిజ్ఞాసలో సత్యశివంకరమైన యుపదేశ మున కధికావకాశము లేకపోవచ్చును. రసాంబుధిలో మునిగి తేలెడి పాఠకుఁడను నావికుఁడు ధార్మికకర్ణమును (చుక్కా-నిని) జారవిడచిన వాఁడు కావచ్చును. అట్టిచో నా వాఙ్మయము, దానిలో నిగూఢముగా దాగియున్న యుపదేశము వ్యర్థమైపోవును. దీని నుంచి తప్పించు నిమిత్తము కల్పింపఁబడిన వేమో యన్నట్లు శతకములు వర్ధిల్లుచున్నవి.

శతకమనఁగా నూరుపద్యము లున్నట్టి కావ్యము. ఇందు నే పద్యమున కా పద్య మొక చాటుధారవలెఁ బరిగ ణింపఁ దగినది; ఒక ఖండకావ్యమును బోలినది; ఒక్కొక పద్య మొక్కొక ముక్తక మనిపించుకొనును, కాని యీ శత కములలో నూరుపద్యములు నొకే తాటి బంధించునది యొకే మకుటము. ప్రత్యేకముగా కథ యేదియు నిందుం డదు. పూసలన్నియు నొకేదారమునగుచ్చినట్లు శతక మందలి పద్దెము లన్నియు నొకే భావమునకుఁ గేంద్రీకృతములై వర్తిల్లును. అది భక్తిభావము కానగును; నీతి కావచ్చును; శృంగారభావము కాఁదగును; లేదా సంఘమందలి యాచార ముల నధిక్షేపించుటయైనఁ గానగును. ఏదియైనను శతకములో యావత్ప్రపంచమున్నట్లే గోచరించును. నీతిశతకర్త గొప్ప లోకానుభవము కలవాఁడై కన్పించుచున్నాఁడు. కవికాలము నాఁటి ప్రజల యభిరుచులు, నాశయములు, నలంకారములు,

నారగింపులు, నధికారములు, నధిపతులు;- ఒక టేమి? సమస్త సాంఘిక జీవితమును దర్పణములోవలెఁ బ్రతిఫలింపఁ జేయుచు నీ శతకము లుండునన్న నతియోక్తి కాదు. సౌలభ్యము, సారళ్యముకలిగి హృదయమునకు చప్పున స్పందము కలిగించి, మనసునకు జ్ఞానము తోడి వికాసము కల్గింపఁ జాలినది శతకము. విద్యుత్తాడనము వలె శతకము మనుష్యునిఁ గదిలించి యాతనిలోని వైకల్యములు దొలఁగించునది.

తెలుఁగు సాహిత్య పరిక్రియలలోఁ బ్రత్యేకముగాఁ జెప్పుకొనఁదగినది, యాంధ్రులు విశిష్టముగా నందించినదని గర్వపడి చెప్పుకొనఁ దగినదియు నీశతకమను ప్రక్రియసుమా! కవులు సాధారణముగఁ దమ తమ యిష్టదైవమును సంభావించి సాధనావస్థలో నున్నపుడు చెప్పినవి చాలవఱకు నీశతకములని చెప్పవచ్చును. భక్తి శతకము లన్నియు నిట్టివే.

శతకమును గావ్యముగాఁ బూర్వము మనవారు గ్రహింపరైరి. వీరేశలింగముపంతులు గారును చిన్నయసూరే శతకకర్తలపైఁ జూచియున్నారు. వంగూరు సుబ్బారావు పంతులుగారు శతకకవుల చరిత్ర వ్రాయువఱకు శతకకర్తలకుఁ బ్రజలలో గౌరవమున్నను, సాహిత్యలోకమున స్థానము లభింపదాయెను. రానురాను దాని కొకస్థితి సాహిత్య పరిపంచమునఁ గల్పించుట జరిగిన దనిన, నది యుత్తమశబ్దాలంకార శోభితములై, నానుడులతోడను, పలుకుబడులతోడను, సామెతలతోడను సమలంకృతములై యొప్పెడి దాశరథీశతకము- భాస్కరశతకము- కాళహస్తీశ్వరశతకముల వంటికొలఁది శతక

ముల వలననే యనవలెను. శివకవులతోఁ బారంభమైన యీ శతకరచనాసంపరిదాయ మవిచ్ఛిన్నముగా నేఁటివఱకుఁ దెలుఁగునాట సాగుచునే యున్న దని గమనింపఁగలము. ఈ నాఁటి శతకములలో "విశ్వేశ్వర - మృత్యుంజయ" శతకము లుత్తమకావ్యశ్రేణికిఁ జెందినవి.*

ఈ శతకములు భక్తి, శృంగార, నీతి, వైరాగ్యములను బోధించునవియై విభిన్నములుగఁ గన్పించుచున్నవి, కావ్యముపదేశాత్మకమైనది కావున నీతి శతకములు జాతికిఁ గరదీపికలవంటివి కాగలవు.

ఇంక మన నీతిశతకములను బరికించి యందలి ధార్మిక బోధ యెట్లున్నయించు కొనఁదగి యున్నదో పరిశీలింతము:

సత్యము తప్పరాదనియు, నౌచిత్య మెఱుఁగవలెననియు, భక్తసాంగత్యము శ్రేయమనియుఁ గాయము బుద్బుదమనియుఁ, బరకాంతా గమనము, రాజ్యలోభము, పరుషోక్తులు, జూదము, వేట, ఛలము, దండము, పానము మున్నగునవి దోషములనియు, 'నీతియె తోడెవ్వారికి'ననియు, లావు గలవాని కంటెను భావింపఁగ నీతిపరుఁడు బలవంతుఁడ' నియు, బోధించిన నీతిశతకములలోఁ బేరెన్నిక వహించినవియు, జనసామాన్యమును లోగొన్నవి సుమతీశతకము- వేమనశతకములని ప్రత్యేకముగాఁ జెప్పఁ బనిలేదు. భాస్కర శతకము,

---

*విద్యత్కవి శ్రీ వేదము వేంకటకృష్ణశర్మగారి టీవలఁ గడుశ్రమించి లెస్సగాఁ బరిశీలించి "శతకవాఙ్మయసర్వస్వము"ను (పరిధము భాగము) గ్రంథమును బ్రచురించి యుండుట సారస్వతేయములకు బ్రమోద కారణము.

నృసింహశతకము, రామలింగేశ్వర, కుక్కుటేశ్వరశతకములు, కుమార, కుమారీత్యాది శతకములు నీతిబోధ చేసినవానిలో నెన్నఁదగినవి. కేవలము శతకముల పేర్లను దెలిసికొని మరచి పోవుటకంటె వానిలోఁ జెప్పిన బోధల నరసి మనము సన్మార్గ వర్తనుల మగుట (అనేక వైదేశిక సంస్కృతులచే నుక్కిరి బిక్కిరి యగుచున్న నేటి కాలమున) మన భారతీయుల కర్తవ్యము.

ఆ బోధామృతమును సాక్షాత్కరించు నీ క్రింది వాక్యములను – శతకములనుండి యుల్లేఖించుచున్నాను; గ్రహింతురు గాక!

మనము విసర్జింప వలసిన వానిలో "అక్కరకు రాని చుట్టము, మొక్కిన వరమిమ్మని వేల్పు, ఎక్కినఁ బారని గుఱ్ఱము, అడిగిన జీతం బీయని మిడిమేలపు దొర" యన్నట్లు దెలిసికొనుట శ్రేయము. "అప్పిచ్చువాఁడు, వైద్యుఁడు, నెప్పుడు నెడతెగక పారు నేరు, ద్విజుఁడు" లేని యూరులో నుండరాదు. అధికారదర్పము పనికిరాదు; 'అధికార రోగ పూరిత బధిరాంధక శవము జూడ పాప' మనినాఁడు కవి; 'అప్పుగొని చేయు విభవము', 'తప్పరయని నృపురాజ్యము' కీడు దెచ్చునని యెఱుంగవలెను. "ఆ కొన్న కూడె యమృతము; తా కొందక నిచ్చువాఁడె దాత; సోకోర్చు వాఁడె మనుజుఁడు" అని శతకకవి మనలఁ దెలిసికొనఁ గోరుచున్నాడు. 'ఇచ్చునదే విద్య; సుకవీశ్వరులు మెచ్చునదే నేర్పు' అపకారికి నుపకారము నెపమెన్నక సేయువాఁడే నేర్పరి. 'ఇమ్ముగ చదువనినోరు వ్యర్థము.'

ఇంక ధన్యుని లక్షణము జూడుఁడు : "ఎప్పటికెయ్యది ప్రస్తుత మప్పటి కా మాటలాడి, అన్యుల మనముల్ నొప్పిం పక తానొవ్వక తప్పించుక తిరుగువాఁడు" ధన్యుఁడగును. 'ఎప్పుడు తప్పులు వెదకెడు నప్పురుషునిఁ గొల్వఁగూడద'ని, 'దూరకు మీ బంధుజనుల'లనియు హితవచనము. "తమతమ నెలవులు దప్పిన తమమిత్రులు శత్రు" లౌదురు. కవి కాని వాఁడు వ్రాసిన వ్రాత వ్యర్థము; అట్లే కారణములేని నవ్వు కూడ వ్యర్థమగును. కులకాంతతో నెప్పుడు కలహింపకు; వట్టి తప్పు ఘటియింపకుమి - యని బోధించి మీదు మిక్కిలి "కలకంఠి కంటఁ గన్నీ రొలికిన 'సిరి' యింట నుండనొల్లదని"యు హెచ్చరించు కవి వాక్యము లరయఁదగినవి. లోక నైజమును దెలుపుచుఁ గూరిమిగల దినములలో నేరము లెన్నడును గలుగ నేరవు. ఆ కూరిమి విరసంబైనను నేరములే తోఁచుచుండును. 'గతం నాస్తి నకర్తవ్యమ్' అను వాక్యమే 'చింతపడకు గడచిన పనికి'నని తెలుఁగు రూపము దాల్చినది.

దానము చేతుల కలంకారము వంటిదను చున్నాఁడు. 'తన కోపము తన శత్రువు సుమా.' తనవారు లేని చోట, చనువులేని చోట, జగడమున్న చోట, నమానమైన చోట నిలుచుట తప్పగును. శుచి శుభ్రముల గూర్చి గ్రహింపవలసిన మాటలు:- "తలమాసిన, నొలుమాసిన, వలువలు మాసినను బ్రాణవల్లభు నైనం గులకాంతలైన రోతురు తిలకింపఁగ." కొండెములు వినరాదు. కొండెములు విని ప్రజ కెగ్గునాచరించుట, బొగ్గులకై కల్పతరువును బొడుచుట వంటిదగును. సుంకరిని, జూదరిని, అగ

సాలెవాని, వెలయాల, వామహస్తు, నంగడివానిని విశ్వసింప రాదని కవి బోధ. నయముతోఁ బాలు గ్రావరు; భయముతో విషమైనఁ గ్రాగుదురని చెప్పి నయముకంటె భయమే యుండుట మేలను నభిప్రాయము కల్గించుచున్నాఁడు. నవ్వు నాల్గు విధముల చేటు. సభలో, పరసతితో, విప్రులఁ జూచి, తలిదండ్రులతో, నాధులతో నవ్వరాదని నిషేధము. 'వినఁదగు నెవ్వరు జెప్పిన;' కాని విచక్షణకల్గి కల్ల యేదో, సత్య మేదో తెలిసికొనుట యావశ్యక మనును. బలగర్వము గాని, విద్యా గర్వముగాని, అధికారగర్వము గాని పనికిరాదని శతకకవి బోధించుచున్నాఁడు.

చిత్తశుద్ధి యవసరమనియు, వట్టి యాచారములు, పూజలు, నాడంబరములు, పనికిరావనియు కవిబోధ ;గురుజనుల గుణములు కస్తూరివలెఁ బరిమళించుననియు, సజ్జనుల సారము మిరపగింజవంటి దనియు, నుపమానముల ఘటించి శతకకవి బోధించును. నిండునదివలె గాంభీర్యము మానవున కవసర మనియు, చల్లగాఁ బల్కుట సజ్జన లక్షణమనియుఁ దెల్పును. కులముకన్న గుణము ప్రధానమనియుఁ బూజకన్న బుద్ధి, మాట కన్న మనసు ప్రధానములని పల్కును. అల్పున కధికార మీయ రాదనియు, అప్పులేనివాఁడే యధిక ధనవంతుఁ డనియు, పట్టి విడుచుటకన్న పరగ చచ్చుట మేలనియుఁ గోపమునను ఘనత కొంచమై పోవుననియు, తప్పు లెన్నువాఁ తమతప్పు లెఱుఁగ రనియు, కాల మొక్కరీతి గడుప వలెననియు ననుభనముపైఁ జెప్పిన బోధలు. తనది కాదనుకొని పెట్టునదే "పెట్టు" అనియు,

చూచివిడచువాఁడు శుద్ధాత్మఁడనియుఁ బేదవేళ చూడు పెండ్లాము గుణమెల్ల ననియు, నిల్లాలువిడిచి తిరుగుట పంట చేని విడిచి పతిగ లేరినట్లనియుఁ, గాంతా కాంచనములపైన భ్రమ వీడవలెననియు, నగ్నితోఁ బరసతితో నాయుధముతోఁ బరిహాసమాడుట ప్రాణహాని యనియు భాషలెన్నియైనఁ బర తత్వ మొక్కటే యనియు దర్శనములు వేరైనను దైవ మొక్కటే యనియు నెన్నెన్నో బోధలు శతకకవి చేయు నట్టివి లోకయాత్ర కుపకరించునవి.

'చాలని పనికిఁ గాల్చాపరాదు; చేసిన సుకృతము చెప్పరాదు; ఆదాయ మెఱుఁగని యప్పు జేయరాదు;, అను వాక్యగతభావములు శాశ్వతసత్యములు. పలుకఁబడిన కలవిద్య లగుపడు ననియుఁ నిల్లుచూచిన నిల్లాలు శుభవృత్తి యెరుకపడు ననియుఁ' బరీక్షల పద్ధతి తెల్పుచున్నాఁడు; పుణ్యశీలము కంటె భూషణము లేదనియు, సాహసౌదార్య ఘనపౌరుషములు దొరతనమునకు వరుసలనియు, నంతియకాని యందల మెక్కుట తొడవులను దొడుగుట, విత్తమును గూర్చుట, ప్రజలను దండించుట దొరతన లక్షణములు కావనియు శతకకవి నిష్కర్షగా బోధించుచున్నాఁడు.

జనసమ్మతము లేని పనిచేయరాదనియు, చలము కార్య సాధనమునకుఁ గూడదనియు, గుట్టుపోనిచ్చిన గిట్టుపెద్దరిక మనియు, దుర్వ్యయపరుఁడైనఁ దొలఁగు మిసిమియనియు, ఘనతృష్ణ పెరిగిన మునుపున్నది. నశించుననియు, నాలస్య మమృతము విషమనియు, జాతస్య మరణం ధృవమనియు, గర్వంబు లావైనఁ గల్గు పరాజయ మనియుఁ దెల్పుచున్నాఁడు.

'గృహిణీ గృహ ముచ్యతే' యని చెప్పినట్లు గృహిణి స్థానము కుటుంబమున ననన్యమైనది. మగువల శీలముపై జాతి శీల మాధారపడి యుండును. భారతీయ సంస్కృతి మన స్త్రీల యోగ్యతపై నాధారపడి యున్నదనుట మరువరాదు. కావునే మగువ నుద్దేశించి చెప్పిన నీతులు శతకములలో శతధా యున్నవి. భారత సంస్కృతిని రక్షింపవలసినది భారత నారీమణులని పెక్కు పర్యాయములు శ్రీ రాధాకృష్ణపండితుఁడు వక్కాణించియున్నాఁడు. నాతి పతితయైన జాతి పతన మొందుట ధ్రువమని నా విశ్వాసము. అందులకే యీనాఁడు పాశ్చాత్య వ్యామోహమునఁ గొట్టుమిట్టాడుచున్న స్త్రీలోకమునకుఁ దిక్తముగనున్నను నాతుల నుద్దేశించి చెప్పిన నీతులు కొన్ని యవశ్యముగా గ్రహింపఁ దగినవి పొందుపరచు చున్నాను:

పడతుక పసుపుకుంకుమను గడియఁ బాయనను విడువ రాదు. పుట్టినయింటికిఁ బాదము మోపిన యింటికి వన్నెపెట్ట వలె. తెచ్చినను, లేకుండినను. ఇచ్చినను, నీయకున్నను, మగని నెగ్గాడరాదు సందెపొద్దు నిద్దుర పనికిరాదు. పతి భుజించిన పాత్రనే భుజింపనలె నడచుచుఁ దల విప్పుకొనరాదు. రోటిపైఁ గూర్చొని తుమ్మరాదు. గడపపైఁ గాలుపెట్టి నిలువ రాదు. సన్నెకల్లును బొత్తమును దన్నుక పోరాదు. దీపము వేఁగించెడుచో చీపురు కడ కుంచవలె; ఎంగిలి పళ్ళకుఁ బెట్టరాదు. ఎరువుల సొమ్ములు ముట్టరాదు. సేవకులఁ గసరఁ రాదు. పని తగిలిన విసుగుకొన రాదు. బంధులను బక్షపాత మొకింతయైనఁ జేయరాదు. పతియే దైవమని భావింపవలె.

ఆకులలోఁ బిండె రీతిం గలసియుండవలె. ఇంటిగుట్టు బట్టబయలు చేయరాదు. తూరుపు దిక్కై దంతములు తోమరాదు. "కార్యేషు దాసీ, కరణేషు మంత్రీ, క్షమయా ధరిత్రీ, భోజ్యేషు మాతా" ఇత్యాదిగాఁ బ్రాచీనులు పెట్టిన యాదర్శములు.

పురుషులలోఁ బరముఁ డెట్టివాఁడో గ్రహించుటయు నావశ్యకమేగదా. 'చేచాచని వాఁడు, చాచిన లేదన కిచ్చు వాఁడు, నోరాచి నిజంబకాని పలుకాడని వాఁడు, రణంబులోన మేను దాచనివాఁడు శ్రేష్ఠుఁడు.

పరనారీ సోదరుఁడై
పరధనముల కాసపడక, పరులకు హితుఁడై
పరులు దను బొగడ నెగడియు,
పర లలిగిన నలుగనతఁడు పరుముఁడు సుమతీ.

అను బద్యము మననము చేయఁదగినది.

ఇవ్విధముగా నీతి శతకములు బోధించుచున్న ధర్మములను బాటించి స్త్రీ పురుషులు తమ తమ జీవితముల గడపుట శ్రేయోదాయకము. మానవులు సాధకులై సజ్జనులై భారతీయాదర్శములకై తమ జీవితముల వెచ్చించి, ముముక్షువులై యాధ్యాత్మిక పథమున నడిచి తరించినచో భారత భూమిని జన్మించిన తమ జన్మలు సార్థకములు కాఁగలవు.

కేవల లౌకికాయత్తమై, భీతావహమై, ధర్మదూరమై, నై దేశిక సంస్కృతీ ప్రభావితమై, సంకరమై పతనమగుచున్న

భారతజాతిని నిలబెట్టుటకొఱకు, ధర్మ్మప్రవణము స్వీయ సంస్కృతీ సంపన్నమగుటకుఁ బాటుపడుట ప్రతిభారతీయుని కర్తవ్యమై యున్నది. శతకములందలి ధార్మ్మిక ప్రబోధము సూటిగాఁ దెలియవచ్చునది; సులభముగాఁ బ్రజల కవగత మగునది; అవశ్య మనుష్ఠింపఁదగినదియు; అట్టిమన నీతి శతకము లవశ్య పఠనీయములై నెగడొందు గావుత!

[12-1-1958 తేదీన వెలువడిన "జాగృతి" ప్రత్యేకసంచికలోఁ బ్రకటిత మైనది.]

వర్తమా నాంధ్ర వచన రచన

[నేఁడాంధ్ర సారస్వత రంగములో వివిధ భూమికలలో యథాశక్తిగాఁ గృషిచేయుచు నాంధ్రసరస్వతి నర్పించుచున్న కళారాధకు లందఱి మీవిధముగాఁ జరిత్ర పరిసిద్ధిగాంచిన యీ అలంపురము నందలి దివ్యస్థలి నొక్క-చోట సమావిష్టుల మగుట ముదాహము. ఇందులకుఁ గారణ భూతులైన ఆంధ్ర సారస్వత పరిషత్కార్య కర్తల నెంతగాఁ గొనియాడినను తక్కువే. తేనెమాగాణమైన తెలంగాణములో నాంధ్ర సరస్వతిని దాదాపుగా పదేండ్లకుఁ బైగా నారాధించుచు నవిరళ కృషిసల్పుచు గ్రామ గ్రామముల సాహిత్యసందేశము నందిఁచుచు నవిరళాద్భుత సేవగాంచుచున్న యీ పరిష త్సేవకులకివే నాయభివందనములు!

స్వాతంత్ర్యము స్థాపించుకొన్న నవభారతములోఁ బాశ్చాత్యసంస్కృతి సంపూర్ణముగా సమున్మేషము పొందుటకు మనీషులెంతయైన పాటుబడవలసిన యవసరమున్నది. ఏండ్లతరబడిగా సుషుప్తిలోనున్న పాశ్చాత్యకళా సరస్వతి స్వాతంత్ర్యోదయకాంతుల పరిసారముతో మేల్కని, మహా కవి పండిత వైతాళికుల పవిత్ర మంత్రివాగ్ధురులలో తాన

---

* అధ్యక్షులు : మన్నిత్రులు, శ్రీ దేవులపల్లి రామానుజరావ్ గారు; సభాపారంభకులు : ఉపరాష్ట్రపతులు, డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు.

మాడి పుష్టిచెంది, సర్వతోముఖ విన్యాసములతో నృత్యము సల్పి యానందామృతమును భాక్తులపైనఁ జిలుకరించుట కనువైన కాల మేతెంచినది.

అద్భుతనాద సౌందర్యమున కాలవాలమైన మనయాంధ్ర భాషాసరస్వతి యావత్పృథ్వీపంచమున 'ఇటాలియన్ ఆఫ్ ది ఈష్ట్' అను గౌవరమును బొందినను బహుభాషా యుతమైన భారతదేశములోఁ బ్రత్యేక స్థితినేకాక పృథమస్థానమునే యుంచు కొనఁగల యంతశ్శక్తి యాంధ్రసాహిత్యములో సమధికముగ నున్నను, నింతకాలము నివ్వరుగప్పిన నిప్పువలెఁ బ్రత్యేకావకాశములు లేక మరుగుననున్నది. కాని ప్రజాసామాన్యములో సమానావకాశము లందఱకు లభింప నుండుటయే కాక మనకుఁ ప్రత్యేకరాష్ట్రము రూపొందు శుభసమయమాసన్న మగుటయు, గారణములులుగా నాంధ్ర సరస్వతికి రాగల యద్భుత భవితవ్య మభివ్యక్తమగుచున్నది; అస్తు!

ఈ విధముగాఁ జారిత్రాత్మకముగాఁ బ్రాముఖ్యము వహించుచున్న యీ సమయమున సారస్వతేయులము మన పూర్వాపరములనుగూర్చి శ్రద్ధతోఁ బర్యాలోచించుకొనఁ బూనుకొనుట సముచితము!]

ఈ వర్తమానాంధ్ర సారస్వత యుగమును వివిధ నామములతో సంభావించుట సముచితము కాఁగలదు. చూడుఁడు: శ్రీవీరేశలింగముపంతులు యుగకర్తగా "సంస్కరణయుగ"మనియు-"వచన వాఙ్మయయుగ"మనియు;

శ్రీచిలకమర్తి లక్ష్మీనరసింహాము, శ్రీవేంకట పార్వతీశ్వరకవుల నెన్నుచు, నవలాయుగమనియు; శ్రీ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి శ్రీతిరుపతి వెంకటకవుల ప్రభావమును గమనించుచు "నవధాన యుగ" మనియు; గిడుగు రామమూర్తిపంతులుగారి భాషా సాంస్కారోద్యమకృషిని గుర్తించుచు "వ్యావహారిక భాషా యుగ" మనియు; శ్రీతల్లావర్ఝుల శివశంకరశాస్త్రి, శ్రీరాయ ప్రోలు సుబ్బారావుగారలు మున్నగు సాహితీ సమితీయుల ప్రభావమును సూచించుచు 'భావకవిత్వయుగ' మనియు; కొమర్రాజు వెంకటలక్ష్మణరావు, కట్టమంచి రామలింగారెడ్డి, సురవరము ప్రతాపరెడ్డి, వేటూరి ప్రభాకరశాస్త్రిగారలు మున్నగువారి కృషిని గణించుచు "పరిశోధనాయుగము"నియు; కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు, ముట్నూరి కృష్ణారావుగారలు మొదలైన వారి కృషి నెన్నుచు "పత్రికా యుగము" నియు; శ్రీయుతులు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, మాడపాటి హనుమంతరావు, మునిమాణిక్యం నరసింహారావుగారలు మొదలైన వారల రచనలనుబట్టి "కథానికా యుగ"మనియు; నట్లే నారాయణదాసుగారి ప్రభావముచే "హరికథాయుగ"మనియు; ఇంక ప్రజావాఙ్మయ యుగమనియు, విజ్ఞానశాస్త్రయుగమనియు; నిట్లు వస్తువునుబట్టియు, పద్ధియనుబట్టియు, నొక్కొకచో మహాప్రభావము నెరపిన సారస్వతేయునిపేరను యుగవిభజనము చేయవచ్చును. కొంద ఱిటీవల వచ్చుచున్న సారస్వత మంతయు, నింగ్లీషు - బెంగాలీ - హిందీ - ఉరుదూ - ఫ్రెంచి-రష్యన్ భాషలనుంచి యనువాదాత్మకమైన దగుట

జూచి "అనువాదయుగమ"నియుఁ బిలువవచ్చును. ఒక విధముగా నవలోకించిన నాంధ్రసాహితి నన్నయుదగ్గరనుండి నావఱకు నున్నట్టిది (ప్రబంధమును, హరికథను, బుఱ్ఱకథను వదలివేసినచో) అనువాదసాహిత్యమే యగును. ఇట్టిది మన జాతీయులకున్న యౌదార్యమును దెలుపఁ గలదు. కాని మన యాంధ్రసాహిత్య మితరభాషలలోనికి హెచ్చుగా ననువదింపఁబడకపోవుట విచారకరము. అందులకు వర్తమాన కవిపండితులు కృషిచేయవలసి యున్నదని మనవిచేయు చున్నాను.

ii

వర్తమానాంధ్ర సాహిత్యమును స్థూలముగఁ జూచిన రెండు విభాగములై కన్పించుచున్నది. ఒకటి పద్యగేయయుతము; రెండవది వచన రచనోపేతము.

ప్రాచీనకావ్యములలో వచనమనియు, గద్యమనియు నెడనెడ కల్పించుచున్నప్పటికి నాంధ్ర సాహిత్యములో వచన రచనము ప్రత్యేకముగా వృద్ధిపొందినట్టి దిటీవల కాలములోనే యనవలె. నాయకరాజుల కాలములో వచనకావ్యము లావిర్భవించుట యారంభమైనను వచనము సర్వోప భోగ్యమైనది యాంగ్లభాషా సాహిత్యప్రభావము బాగుగఁబడిన 19, 20 శతాబ్దములలోనే యని గుర్తింపఁగలము.

సంస్కృతములో లాక్షణికులు కావ్యములను గద్య పద్యమిశ్రమములుగా విభజించిరి. గద్య కావ్యములలోఁ గూడ విభేదము గల్పించిరి; ఆఖ్యాయిక, పరికథ, ఖండకథ, కథా,

కథానిక లనునవి వివిధ గద్యకావ్య భేదములు. 'గద్యం కవీనాం నికషం వదన్తి' అనియు 'ఓజస్సమాస భూయస్త్వ మేతద్గద్యస్య జీవిత' మ్మనియు సూత్రములు గల్పించుచున్న నేలకో సంస్కృతములో గద్యకావ్యము లధిక సంఖ్యాకములుగాఁ గన్పించుట లేదు. లక్షణ కావ్యములుకూడ ఛందోమయము లేయగుట గాంతుము. అట్లే తెలుఁగు భాషయందుఁగూడ 18 వ శతాబ్దమునకుఁ బూర్వము వచనకావ్యములు కన్పింపక పోవుట విచిత్రము. సంస్కృత మర్యాద ననుసరించి తెలుఁగు నను లక్షణ కావ్యములు పద్యమయము లై యుండుట గాంతుము

కావున నాంధ్రిమున బహుళముగా వచన రచన మాంగ్లభాషా సంపర్కజనిత మైన వి శే ష మ ను సూక్తి యదార్థమైనది. ఆంగ్లజాతిపైఁగల ద్వేషముండవచ్చును గాని, వారి భాషపై, సాహిత్యముపై, విజ్ఞానముపై నన్యభాషా పండితులైనవారలు ద్వేషము చూపఁజాలరుగదా. కావున నాంగ్లేయ విమర్శకుల యభిప్రాయములఁ దెలసికొందము.

నిర్వచనము :

పద్యమునలె నావేశపూరితము, భావలతాయుతము నలంకారిక రచనాబంధురము వ్యంగ్య ప్రధానము నైనచో వచనము కావ్యమే యనిపించుకొనును. అది గద్యములోనున్న కవిత. అట్టివే వచనకావ్యములు. పద్యకావ్యములను వచనములోనికి దింపిన రచనలన్నియు నీ జాతికిఁ జెందినవే కాఁగలవు.

ఛందోమయ మైనదంతయుఁ గవిత్వమనియు. ఛందో రహితమైన వచనమంతయు గావ్యము కాదనియు ననుకొనుట తప్పిదమే యగును. వస్తుస్వరూప యాదార్థ్యము కలిగి, స్వభావోక్తి ప్రధానము, నన్వయ సౌలభ్యసహితము నపేక్షా మాత్రమునసే విషయ వివరణముచేయు ప్రకృతాను సారి యైనది వచనము. ఇది యంత్రమువలె నుండును. ఛందో నియమములు లేనట్టిది స్పష్టముగా సూటిగాఁ జెప్పుట కను వైనదియు వచనము. ఇది తార్కిక పద్ధతికి లోనైనది. బుద్ధి జన్యమైన వచనము హృదయజన్యమైన పద్యముకన్న భిన్నమై భాసించునది. వచనము వైశద్య ప్రధానమైన రచనమని గమ నించుట ముఖ్యము. చక్కని వచనమునకు సమతయు సంక్షి ప్తియు నుండవలసిన గుణములని చెప్పిరి

పద్యమునకు వ్యతిరేకమైనది వచనమని తెలుపుచు నీ వచనము సాహిత్యములో నెన్నెన్ని ప్రక్రియలలో విని యోగము పొందుచున్నదో వివరించిన సందర్భము గ్రహించి తిరి గదా. నవల, కథానిక, వ్యాసము, విమర్శ, లేఖ. చరిత్ర, జీవితకథనము, ప్రవచనము, ప్రసంగము, ఉపన్యాసము లనెడి ప్రక్రియల మూలమున వచన మభివ్యక్త మగుచున్నది. [ఇటీవల వచన నాటికలు, వచన పద్యములును వెలువడు చుండుట గాంతుము.]

శైలి :

ఈ ప్రక్రియలలో నుండు రచన మంతటిని వచన మను బేరఁ బిలచినను నీ వచనములో విభిన్న శైలులంబట్టి వివిధ

ముగా భాసించుచుఁ బ్రత్యేస్థితులను బొందినట్టి దగుచుండును. పద్యకావ్యములలో శైలులవలె వచన రచనములలోను శైలులని యున్నవి. అవి వస్తువును బట్టియు రచనలోని యాత్మ్రి యతను బట్టియు భిన్నము లగుచుండును. 'డో బ్రే' యను విమర్శకుఁడు వచనమును మూఁడు విధములుగా విభజించి పేర్కొనెను; వర్ణనాత్మక మనియు, వివరణాత్మక మనియు, నావేశాత్మక మనియు నాతఁడు చేసిన విభజనము. వచనములు వాక్యములతోఁ గూడినట్టి వనియుఁ బరిచ్ఛేదములతోఁ బరిఢవిల్లు నవనియు విమర్శకు లుల్లేఖించుచు నావాక్య నిర్మాణమును గూర్చియు, విరామ చిహ్నములను గూర్చియు జిజ్ఞాస యొనరించిరి. సాహసోదంతములను జెప్పు వచనములో నావేగము, నుత్కంఠ, రూప నిరూపణము లనునవి ముఖ్యములగ నుండవలెనని హెర్బర్టు రీడ్ చెప్పుచున్నాఁడు. కథానికలలో నాఖ్యానాత్మకశైలి యుండుట యొప్పిదమైనది. శాస్త్ర గ్రంథములలో (విజ్ఞాన శాస్త్రము, న్యాయ, వేదాంత, మత, రాజకీయ చరిత్ర, విమర్శలలో) వివరణాత్మకశైలి యవసరము. నవలలో వర్ణనాత్మకశైలి బహుళముగా నుండుట యుచితము.

భాష:

భాషా విషయమై కూడఁ గొంత జిజ్ఞాస యవసరము. ఉదాత్త వస్తువునుబట్టి భాషకూడ నుదాత్తముగాను గంభీరముగా నుండుట యావశ్యకము. భాషాసాహిత్య విషయముల యొక్కయు, నితరశాస్త్ర విషయములయొక్కయు గ్రంథన

మంతయు నుదాత్తభాషోపేతమై యున్నదని యాక్షేపింప రాదు. కథానికలు, నవలలు, సులభబోధకమైన సజీవమైన, స్వాభావికమైన భాషతోఁ గూడియుండుట యెంతయుఁ బ్రియోజనకరము నౌచితీయుతము నగును.

వచన రచనమునందు విభిన్న ప్రక్రియలకుఁ బ్రత్యేక లక్షణములఁ బాశ్చాత్యవిమర్శకులు నిర్వచించియున్నారు.

వివిధ ప్రక్రియలు : నవల

నవల వచనరచనలలో విశిష్టస్థానము నాక్రమించుకొన్న ప్రక్రియా విశేష మని గమనింతుము. నవల చాల విపులమైన యవకాశములుగల రచనము. వర్ణనములు, సంభాషణములు, ననేక ప్రసంగములు, బహుళపాత్ర చిత్రణము, జీవితవ్యాఖ్యలు, లోకపరిజ్ఞాన ప్రబోధకములైన యంశము లనేకము కలిగిన మనోహర గద్యము నవల యగును. రసప్రధానము శిల్పసంయుతము నైన రచనము నవల. రమ్యమగు కథను గల్పించుటలో, వర్ణనలను గండ్లకుఁ గట్టునట్లు చిత్రించుటలో, సంభాషణములు సహజములుగా సజీవములుగా రచించుటలోఁ, బాత్రోన్మీలనము సన్నివేశముల మనుగునఁ గ్రమముగాఁ బొందించుటలో దేశకాల పరిస్థితుల నెఱిఁగించుచు జరిత్ర విసుగుపుట్టింపక చిత్తాకర్షకముగా రచించుటలో నంగాంగీభావ నిరూపణమందు నవలాకారుఁడు, కథకుఁడు, నాటకకారుఁడు నొకటని యేమి? ఎల్లరు తానేయై తీరవలెను. విపులమైన రచన యగుటచే నుత్కంఠ యను గుణ మధికముగ నుండకపోయిన నవల

రాణించదు; ఉత్కంఠ కొరవడి 'మాటలపోగు' అనిపించుకొని ప్రయోజనము లేదు, వచన రచనములో నుత్తమ తాంబూలము నవలదే ననియు, నగ్రతాంబూలము వివర్శదే యనియు గ్రహించితీరవలెను. వివర్శను నవల తనలో నిముడ్చుకొన్నను నవల కావ్యత్వము కలదై విరాజిలు వచనరచన మను విషయము మరువరానిది.

కథానిక:

ఇంకఁ గథానిక నవలకు సూక్ష్మరూప మని తెలిసినచో వేరుగాఁ గథానికాలక్షణములను జెప్పఁ బనిలేదు. ఈ కథానికలో వస్తువిస్తృతి కవకాశము లేదు; అట్లే పాత్ర బాహుళ్యము నుండరాదు; వర్ణనాది వివిధావయవములకును సావకాశము మెక్కువ లేనిది; సూక్ష్మములో మోక్షము కలిగించుటయే కథానికా పరమార్థము. అన్ని వచన ప్రక్రియలలో గణనకెక్కక పోయినను మనవారు కథలు చెప్పుటలో మాత్ర మెన్నిక వహించినవారని తెలిసికొందుము. సంస్కృతమునఁ గథాపరిత్యాగరమునకు మూలమైన బృహత్కథ నాంధ్రజాతి నిర్మించుకొన్నదే? యగుట గర్వకారణము గదా. నేఁటికి ముదుసలులు పిల్లలను జేరదీసి కథలు చెప్పుచు నూరడించుట లనూచానముగా వచ్చుచున్న సంప్రదాయ చిహ్నమే కదా!

వ్యాసము:

వచనరచనమునకుఁ జెందిన ప్రక్రియలలో వ్యాసమను నది పరిమితిలోఁ జిన్నదైనను బ్రత్యేక శిల్పఖండముగా దీనిని గ్రహింపవలసియున్నది. ఏ చిన్నవిషయముపై నైన రచయిత

తన భావనాబలముచే దృష్టి గేందీకరింపఁ జేసి, యీవస్తువును విస్తరించి యుత్తమశైలీ సంపదతో నిర్వహించిన రచనము వ్యాస మగును. వ్యాసము పూర్వానుభూత విషయ కథలతోఁ బ్రారంభము కావలెననియు నుద్దిష్ట విషయమును కూర్చి ప్రస్తావించుట యీ పిమ్మట జరుగవలెననియు సాధారణానుభవముల నేకరువుపెట్టుచు నావిషయవిస్మృతికిఁ బూనుకొనవలెననియు, నేదైన సన్నివేశమునో దృష్టాంతమునో జోడించి విషయబోధ చేయవలెననియు ననంతరము నీతినో సందేశమునో సారాంశమునో యుదాహరించవలెననియు లక్షణాదికము నుల్లేఖించిరి. వాసకర్తలు ప్రతిభావంతులేకాక విషయపరిస్తారము విశేషముగాఁ జేయఁగల భావనాబలముకల పరిజ్ఞానిధులు కావలెను. తార్కికశక్తితో పాటు నాకర్షక గుణముకూడ వారి వచనములలోఁ గల్పింపవలె. అంతియ గాక బహువిషయపరిజ్ఞాము నేత్రద్రచనములో ద్యోతమాన మగుటయు నవసరముగా భావింపవలె. వ్యాసమును గావ్య విభాగముగాఁ బరిగణించి యీంగ్లేయులు దాని గౌరవము నినుమడించిరని గమనింతుము.

విమర్శ:

విమర్శ* వచనరచనములో నుత్తమ మేధాసంపదకు ర్శనమైన ప్రక్రియ పరిశీలనము, వాఖ్య, సమీక్ష వివరణము, ప్రశంస, పరిచయము లను నంగములతోఁ గూడినట్టి దీ విమర్శ

* ఇందలి విషయములు కొన్ని 'విమర్శక లక్షణముందుఁ జెప్పినవి యగుట, పునరుక్తములుగాఁ దోపవచ్చును. కానివేని కవి ప్రత్యేకవ్యాసము లగుట యిట్టిది తప్పక పోయినది.

పరికియ. విమర్శకుఁడు విడమరిచి చూచుచు యుండు, విభ జించి పరిశీలించుటయుండు, వేరుగాఁ దుల్యవస్తువులతోఁ బోల్చుట- విలువకట్టుటయుండును నేర్పరియై యుండవలెను.

కొందఱు విమర్శయనిన నిరసించుటయని యభిపాయ పడి విమర్శకుఁడనిన భయపడుదురు. అదిసరియైన దృష్టికాదు. పరిసిద్ధతత్వజ్ఞుఁడు 'పోప్' అనినట్లుగా నభిరుచితోడనుఁ వివేచ నముతోడను, బుద్ధివైభముతోడను, సత్యాన్వేషణబుద్ధి తోడను విమర్శకుఁడు కావ్యమును దరిచేరవలెనే కాని కవి కున్న యుపజ్ఞనుమీరి తన కౌశలమును బరిదర్శింపరాదు.

సద్విమర్శకుఁడు విద్వేషముతో నిరసింపనురాదు. అభిమానముతోఁ బరిశంసింపను రాదు. కవి మనోగత భావార్థములను లక్షణాదికమును వివరించుటకు యత్నించు టయే యాతని సామాన్యసామాజకునకు నుద్దిష్టమై పరగ వలెను. అనఁగా నాలోచనాత్మకము వివరణాత్మకమునై యుండవలె నన్నమాట.

కేవలము శబ్దచర్చచేయువాఁడు భాషాభిజ్ఞుఁడే యగును గానివిమర్శకుఁడు కానేరఁడు. ఒక్కొకచో దోషజ్ఞుఁ డనిపించు కొను పరిమాదముకూడ నట్టివాని కుండగలదు. భాషావిమర్శ కాక భావవిమర్శ పరిధానమైన దని పించుకొనును. వ్యాఖ్య లలోఁ గావ్యము చదువనివానికిఁ గావ్యపరిచయము చేయుట వ్యాఖ్యాత్మ పరిధాన కర్తవ్యము. అనంతరము పాత్రచిత్ర ణము, మనస్తత్వ పరిశీలనము, వస్తైక్యము, శైలి, కవియాత్మీ యత, రసపరిమేయము, రసపరిశీలనము, నిర్మితీసౌభాగ్యము

మొదలైన వన్నియుఁ గావ్యవిమర్శలోని వివిధాంశములై గణన కెక్కును. కావ్యమును విడిచి కవిహృదయమును ననుసరించుచు గవిసందేశమును గనుకొనుటకూడ వి మ ర్శ కు, ధర్మము. శబ్దసౌకుమార్యము, నర్థగౌరవము, భావగాంభీర్యము, నాలంకారిక చమత్కారము శిల్పాభివ్యక్తియు వీని నన్నిఁటినిఁ బరిశీలింపఁగల పరిజ్ఞాని యాతఁడు; లక్ష్యలక్షణ సమన్వయకర్త విమర్శకుఁడు. విద్వన్మణియైనను వినయవంతుఁడై, సహృదయుఁడై, తాను గవికంటె నధికారి యను నహము లేనివాఁడు కావలెను. అయ్యది సాధ్యముకాని పక్షమున నిగూఢాహంకారియై తనరవలెను. వి మ ర్శ యు నాత్మాశ్రయ (Subjective) పరాశ్రయ (Objective) భేదము గలదై ద్వివిధముగా భాసించును.

విమర్శకుఁడు సాహిత్యోద్ధారకుఁడుగా నుత్తమస్థానము నలంకరించుచున్నాఁడు. ఆతని బా ధ్య త గురుతరమైనది. సాహిత్యారణ్యవకర్ణధారిగా విమర్శకుఁ బరిగణించిరి. ఆతఁడును దృష్ట, సృష్టయు; కవివలెనే సహృదయత్వము తన్మయీభావనయోగ్యత కల్పించు గుణ మాతనికి మెండుగా నుండవలె. ఆతఁడును శిల్పి, రసపిపాసువునై యుండవలెనేకాని కర్కశపాషండుఁడు కారాదు. చారిత్రకదృష్టి, కార్యకారణ భావ సమన్వయ మాతనికి నధికముగ నుండవలె. "పరిచయకర్తగ, గుణగ్రహణపారీణుఁడుగా, వ్యాఖ్యాతగా, వందిగా, న్యాయమూర్తిగా, విషయ వివేచనమునుండి రసాభివ్యక్తి వఱకుఁ గలవివిధ పరిస్థితులలోను సామాన్యుల నడిపించి

శిక్షణనొసంగి, యలరించి, యానందమును బంచిపెట్టి, యమృతత్వసిద్ధినిఁ గల్గించు నుదాత్తదార్శనికుఁడు విమర్శకుఁడు;" అందలి మహత్తర వచన రచన మాతనిది!

ఉపన్యాసము :

ఇంక నుపన్యాస మల్లికలో బిగు వవసరములేని వచన రచనము. ప్రసక్తాను ప్రసక్తముగ విషయాంతరము లనేకములు వచ్చట కీ వచన ప్రక్రియ బాహాటముగ నంగీకరించును. ఆంగ్లేయు లుపన్యాసము నొక కావ్యప్రక్రియగాఁ బరిగణించి కృషియొనర్చిరి. కథానికకు నవలకున్న సంబంధ మెట్టిదో వ్యాసోపవ్యాసముల కున్న సంబంధ మట్టిదే. ఉపన్యాసములో నాకర్షకగుణము హెచ్చుగ నుండవలెను; ప్రబోధాత్మకమైలి యుపన్యాసమునకు ముఖ్యమైనది. ఇతర గ్రంథకర్తల వాక్యముల నుల్లేఖించుట యుపన్యాసకర్త కర్తవ్యములలో నొకటియని యెఱుంగుదుము. ఉపన్యాసము నొక సారస్వతశాఖగా గుర్తించి సంక్షిప్త లేఖనమున్న పాశ్చాత్య భాషలన్నియు మహామహుల యుపన్యాసములను భద్రపరుచుకొన్నవి; కొనుచున్నవియు, ఆయా మహోదయుల భాషణములను గూడ యంత్రసాధనములచే (Recording) భద్రముచేయుట కనువైన యుగమిది. అట్లు సజీవములైన నుపన్యాసముల భద్రపరుచుచున్న రేడియో కార్యాలయములఁ గొనియాడవలసియున్నది. ఆంధ్రభాషలో నిప్పుడిప్పుడే యుపన్యాస ప్రక్రియ యొకరూపము నొందుచున్నదని యరయుదుము.

iii

అన్వయము :

ఆధునికయుగమును ముఖ్యముగా వచనయుగమని పేర్కొ-నుట సముచితము కాగలదు. చిన్నయసూరి గద్య గంగావతరణమునకు భగీరథుని వంటివాఁడు. నన్నయకుఁ బూర్వము పద్యమున్నట్లే చిన్నయకుఁ బూర్వము కూడ గద్య మున్నను, 'కావ్యభాషలఁ దీర్చి దిద్దిన వాగనుశాసను లగు టచే వీరుభయులును బార్థక్యమును గడించినారు. చిన్నయ సూరి రచించిన 'నీతిచంద్రిక' యాలంకారి వచన రచనో పేతమై, వన్నెచిన్నెలుకలిగి, గంభీరోదాత్త శైలీసంపద ఘటిల్ల వాక్యవిరామ పరిచ్ఛేద విభాగాదులను పాటింపనిదై ప్రశస్తివడయుచున్నది. ఈ మార్గము ననుసరించినను కొక్కొండ వెంకటరత్నము వీరేశలింగము గారల రచనము సంధి విగ్రహాది వచన కావ్యానువాదములలో సహజముగఁ గన్పింపక యాశైలి కృత్రిమముగఁ గన్పించుచున్నది.

కాని వీరేశలింగము గారించుమించుగ వచన పద్ధియ లన్నింటికి శ్రీకారము చుట్టినవాఁడై యాంగ్లభాషా ప్రభావ మును దన రచనములలో నధికముగఁ బ్రతిఫలింపఁజేసికొని వచనమును సర్వోపభోగ్యముగఁ జేసినవాఁడగుట నాయన 'గద్యతిక్క'నయై వచనయుగకర్త యనఁజెల్లు చున్నాఁడు. నవల, విమర్శ, చరిత్ర, వ్యాసము, ఉపన్యాసము, కవులచరిత్ర, స్వీయచరిత్ర, యాత్రాచరిత్రలను మొదటఁ దెలుఁగులో నవతరింపఁ జేసినకీర్తి వీరేశలింగముగారే పొందఁ

జూచిరి. వీరి వచనగ్రంథములు విజ్ఞానోపలబ్ధి కక్కరకు వచ్చు నవై వచన ప్రయోజనమును నిరూపించిన వగుచున్నవి. వీరేశ లింగముగారు సంఘసంస్కర్త యగుట నిప్పట్లు గమనింప వలెను. రచనముల మూలమున సంఘమును సంస్కరింపఁ బూనుకొనిన వీరేశలింగముగారు సులభార్థబోధకములైన వచ నములనే యవతరింపఁ జేయవలసిన యవసరమును గుర్తించి వచన రచనములోఁ జిన్నయసూరి మార్గమును వదలి యాకర్ష వంతమైన సరళ వచన రచనామార్గమును సృజించినాఁడు. అందుచే వీరి విగ్రహములోని వచనశైలికిని, జీసస్‌చరిత్రలోని, వచనశైలికిని ఉపన్యాసములలోని వచనశైలికిని భేదము కన్పిం చును. పదాడంబరయుతమైన శైలి కథాకథనశైలి పరిభో ధాత్మకశైలి యని కందుకూరివారి వచనశైలి యివ్విధముగాఁ బరిగణింపవచ్చు. గద్యవచనములోఁ జిన్నయసూరి గారెంత జటిలత్వమును జూపిరో వీరేశలింగముగారంత సారళ్యమును సాధించిరి. వీరి తర్వాత వచ్చిన యుపన్యాసకర్తలు పాను గంటి లక్ష్మీనరసింహారావుగారి త్యాది వచన రచన రచయిత లకు వీరేశలింగముగారి వచనశైలియే యనుసరణీయమైనది. లేక, వారి వారి యాత్మీయతలు వారి వారి శైలులలోఁ బ్రతి ఫలించుట ధర్మము గావున నీషద్భేదము లుండవచ్చును.

ఏమైనను వచనవాఙ్మయ బ్రహ్మగా వీరేశలింగము గారు మన సాహిత్యచరిత్రలోఁ గీర్తి వహించుచున్నారనియు నా మహనీయుఁడే వచనమును సర్వవ్యాప్తము, ప్రజాహితము బడయునట్టిదిగాఁ జేసినవాఁడనియుఁ జెప్పుకొని తీరవలెను.

వచనములోఁ గావ్యావతరణము పిమ్మట నవలారచనము చక్కగా సాధింపఁబడినది. ఆంగ్లము, బెంగాలీ, హిందీ, మరాటీ, కన్నడము మొదలైన భాషలలో నుండి యనేక నవలలు తెలుఁగులోనికి ననూదితము లగుచువచ్చినవి. చారిత్రక సాంఘిక కేతివృత్తములను గ్రహించి స్వతంత్ర నవలా నిర్మాణములోఁ గూడ మన తెలుఁగువారు పేరు పొందినారు. ఈ సందర్భమున చిలకమర్తి లక్ష్మీనరసింహం, వేంకటపార్వతీశ్వర కవులు, కేతవరపు వేంకటశాస్త్రి గారలు మున్నగువారి కృషి యెన్నఁదగినది.

హాస్యరసము తగురీతిగాఁ బోషింపఁబడినది. కథానికా రచయితలు మొదట కొలఁదిమంది కన్పించినను దనువాత కాలమున నసంఖ్యాకులగుట శుభావహము. గాంధిక వ్యావహారి కాంధ్రములు రెండు నీ పక్రియారచనమున రచయితలు క్రమముగా నుపయోగించిరి. ఇటీవల కొందఱి రచనములలో నితర భాషాప్రభావము లధికముగ సంక్రమించుచునుండుటచే స్వతంత్రవచనశైలి మృగ్యమై పోవుచున్నది.

లేఖలు మన వర్తమాన సాహిత్యము లోనేకాదు; ప్రాచీనసాహిత్య మందు నొకకావ్య పక్రియగా వర్ధిలలేదు. యువరచయితలు లేఖావాఙ్మయమును బెంపొందింపవలసిన యవసరమును గుర్తింపవలె.

ఉపన్యాసమును వీరేశలింగముగారు ప్రారంభించిననది కావ్య పక్రియగా గణనకెక్కుట యిటీవలనే; పానుగంటివారు మాత్రము "సాక్షి" సంపుటములలో నుపన్యాస వ్యాసములను గలిపి సాధించినారు. ఇటీవలకాలములోఁ బరిషత్తుల

ధ్యక్షోపన్యాసములు, రేడియో ప్రసంగములు, లిఖిత పూర్వకములై, యుండుటచేఁ గొంతసాధనము జరుగుచున్నట్లు భావింపవలెను. కాని "బర్క్, రస్కిన్, కార్లైల్" మున్నగు వారి ధోరణులలో నింక నుపన్యాసరచనము తెలుఁగులో వెలువడవలసి యున్నది.

ఇంక వ్యాసమునుగూర్చి నవ్యులనేకులు కృషిచేయు చున్నారు. రాజకీయ పరిజ్ఞానమును గల్గించు వ్యాసములు బహుళముగా నీమధ్య వెలువడుచున్నవి. కాని కొందఱు రచయితలు భాషావిషయకముగ జాగరూకత నేమియు వహింపక పోవుట శోచనీయము.

పీఠికాకారులుగాఁ గొందఱు పండితులు వచనరచనము సల్పినవారున్నారు. సవిమర్శకముగాఁ గావ్యగత వస్తువైలిలో ననువాదక విశేషములను గూర్చివ్రాసి వారెంతయో కృషి యొనర్చిరి. ఇట్టి పీఠికలలోఁ జాలభాగములు (మనకుఁ బూర్వ తరమువారివి) సహృదయత్వ దూరములై నిశితలాక్షణిక దృష్టి పరపినవై చారిత్రక సత్యములకు దూరములై యనేక ప్రతివిమర్శలను దారితీసినవైనవి.

కట్టమంచి రామలింగారెడ్డిగారు వస్తుతత్త్వము పరిశీలనము జేయుచుఁ బాశ్చాత్య విమర్శసూత్రముల నన్వయించుచుఁ బరిశీలనము గావించినవారిలోఁ బ్రథములు. తెలుఁగునాట భాషాసాహిత్య చరిత్ర పరిశోధనములకు బహుళ ప్రాధాన్యమునిచ్చి కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావుగారి కృషి

యనితరమైనది. సాహిత్యవిమకుర్మకులలో శాశ్వతముగా నిలచు కృషియొనర్చిన వారిలో శ్రీనంగూరి సుబ్బారావుగారు, శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు, శ్రీరాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారు, శ్రీకురుగంటి సీతారామయ్యగారు, శ్రీచేకుమళ్ల అచ్యుతరావుగారు, శ్రీ బండారు తమ్మయ్యగారు పైతరములో నెన్నఁదగిన పండితులు. తెలుఁగుభాషా పరిశోధకులలో శ్రీ గిడుగు రామమూర్తిపంతులు శ్రీ జయంతి రామయ్యపంతులు జేసిన పరిశ్రమ దొడ్డది. శ్రీయుతులు కోరాడ రామకృష్ణయ్యగారు, చిలుకూరి నారాయణరావుగారు, గంటిజోగి సోమయాజులు గారు, శ్రీ వజ్ఝల చినసీతారామస్వామిశాస్త్రిగారు, శ్రీదీపాల పిచ్చయ్యశాస్త్రిగారు భాషాపరిశోధనల నెన్నవలెను. ఇటీవల శ్రీ చాగంటి శేషయ్యగారు, శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనము గారు, శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు, శ్రీ కోన వేంకటరాయశర్మగారు, శ్రీ శిష్లా రామకృష్ణశాస్త్రిగారు ఆంధ్ర సాహిత్యచరిత్ర విషయమునను నరసభూపాలీయ వ్యాఖ్యయనుపేర శ్రీ సన్నిధానము సూర్యనారాయణశాస్త్రిగారొనర్చిన సాహిత్యశాస్త్ర గ్రథనము లభినందింపఁ దగినవి.

కొందఱిటీవల కాలమున నవ్యాంధ్రసాహిత్యముపైఁ జక్కని విమర్శలు చేసియున్నారు.* సాహిత్యసూత్ర గ్రథ

రీబిషప్ కాల్డ్వెల్, సి. పి. బ్రౌను, మెకెన్జీలనెడి పాశ్చాత్య పండితులు మన భాషాసాహిత్య చరిత్ర పరిశోధము లొనర్చి తత్తన్మార్గముల నగ్ర గాములైరి.

* శ్రీ కురుగంటి సీతారామభట్టాచార్యులవారు వ్రాసి 1942 లో వ్యావహారికములోఁ బ్రకటించిన నవ్యాంధ్ర సాహిత్యవీధులను ఉద్గ్రంథము

నముగూడ నొకవంక జరుగుచున్నది. పండితులు కొందఱాంగ్ల సంస్కృత విమర్శసూత్రములెఱిఁగి సాహిత్యశాస్త్ర జిజ్ఞాస చేయుచుండుటయు భావ్యభివృద్ధి సూచకము. † ఈమధ్య భాషా సారస్వతయుగములపైనను, సాహిత్య ప్రకియల పైనను బ్రత్యేకముగాఁ బరిశోధనల సల్పి డాక్టరేటు బిరుదముల నందిన విద్యార్థులకృషి ప్రకటితము గావలసియున్నది.

కవులచరిత్రలు, జీవితచరిత్రలు వ్రాసిన మహనీయులును వచన రచనమును బెంపొందించు చున్నవారే. రేడియో ప్రసంగవ్యాసము కూడ నూతనముగా వెలిసిన సాహిత్య ప్రక్రియయై వచన వాఙ్మయాభివృద్ధికిఁ దోడ్పడుచున్న మాట మఱువరాదు.

ఈ విధముగా వివిధ ప్రకియలలో వర్తమాన వచన రచనము గావించుచు నవ్యులు సాహితీసేవ జేయుచున్నారు. ఆయా ప్రకియలను బరిశీలించుటవలన నున్నలోపములను సైతము పరిశీలించినాము; అట్టివాని పూరణము కొఱకు రచయితలు పూనుకొందురు గాక.

iv

భాషా మీమాంస:

తెలుఁగు వచన రచనమును స్థూలముగాఁ బరిశీలించిన రెండు భాషామార్గములు కన్పించును. అవి గ్రాంథిక వ్యావహా బహుకాల పరిశోధనముజేరి పరివర్ధితము పరిపక్వతమునై ద్వితీయ ముద్రణ ప్రతి 1949 లో వెలువడినది.

†శ్రీయుతులు నోరి నరసింహశాస్త్రిగారు, శ్రీఇందర్తికంటి హనుమచ్ఛాస్త్రిగారు, శ్రీ జమ్మలమడక మాధవరాయశర్మగారు, ఈకృతికర్త, శ్రీ

హారిక భాషామార్గములు. ఈ యవసరమునఁ దదుద్యమముల స్వరూపముగూర్చి తెలిసికొనుట యుచితమే యగును.

(శ్రీ) గిడుగు వేంకట రామమూర్తి పంతులు వ్యావహారిక భాషాప్రచారము నిమిత్తము తన జీవితాంతమువఱకు గృషి సల్పిన భాషావేత్త. ఈ యుద్యమమును బ్రతిఘటించుచు (శ్రీ) జయంతి రామయ్యపంతులు గ్రాంథిక భాషా ప్రచారము నాంధ్ర సాహిత్య పరిషత్తు ద్వారా చేసిన భాషా పోషకుఁడు. వీరిరువురి కలహాములు తెలుఁగుభాషా పోషకములైనవి. కృతక గ్రాంథికభాషయందు జాతీయము (Idiom) నశించుననియు, వ్యక్తృభావోద్వేగోద్రేకావేశములు సహజ సిద్ధములుగఁ బ్రతిఫలింప జాలవనియు, విజ్ఞానము సులభ మార్గమున ప్రజల కవబోధ మగునట్లు చేయవలెనే కాని, ప్రయోజనమునకు దూరముగా నుండునది కృతకభాష యనియు, వ్యావహారిక భాషే సుబోధమైన భాషయనియు నందునను శిష్టులు మాట్లాడుకొనుభాష ప్రామాణికభాష యనియు, దానినే సర్వత్ర ప్రయోగింపవలసినదనియూ గిడుగు వారు ప్రచారము చేయసాగిరి. ఈ భాషాసంస్కారము నిమిత్తము వారనేక వ్యాసములను, ఉపన్యాసములను, గ్రంథములను బ్రచురించిరి; బాలకవిశరణ్యము, గద్యచింతామణులీసందర్భమునఁ బేర్కొనఁదగిన వారి గ్రంథములు. ఏతదుద్య

పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి గారు, శ్రీజి. వి. కృష్ణరావుగారు, శ్రీశ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు, శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు, శ్రీ అంబటి పూడి వెంకటరత్నంగారు, శ్రీపాట్లపల్లి సీతారామరావుగారు ప్రభృతులు.

మము బాగుగ బ్రాచుర్యము పొంది పత్రికాముఖమునఁ జక్కని యాలంబనము లభించినట్టిదై నేఁటికాలమున బాగుగఁ బాదుకొనిపోయినది.

ఈ నాఁటికి వ్యావహారికభాష బహుళముగా వేరూది కొని యుండుటచే దానిని తొలఁగింపుమని విజ్ఞులెవ్వరు పలుక సాహసించుట లేదు. ప్రాచీనపండితులకు బాధాకరముగ లేక పోలేదు. నవీనులుగాఁ దలఁచిన పండితులు గొందఱు కృతక వ్యావహారిక భాషను వ్రాయుచుండుట గమనింపఁగలము. సులభ వ్యావహారిక భాషాశైలి యేకొలఁది మందికోగాని లభింపలేదు.

ఉచ్చారణమందుఁ జాలమంది శబ్దస్వరూపమును గుర్తింపకపోవుటచే వ్రాఁతలో లోపములు ప్రాకుచున్నవి. వక్తల ముఖావయవలోపము లుచ్చారణములోను, వ్రాఁత లోను సంక్రమించుచున్నవి. వివిధమండలములలో శబ్దములు కొన్ని భిన్నార్థములు కలిగి వైచిత్రిని భాషలో ఘటిల్లఁ జేయు చున్నవి, సర్కారు- రాయలసీమ - తెలంగాణముల లోని జిల్లాలలోఁ తెలుఁగుభాష మాండలిక విభేదములను, యాస లను బ్రత్యేకముగఁ గల్గియున్నవి. ఈ భాషావైత్రిని గూర్చి యిటీవలఁ గొందఱు రేడియో, పత్రికాముఖమునఁ గృషి సల్పుచుండుట హర్షింపఁదగిన విషయము.

శిష్టుల వ్యావహారికభాష ప్రామాణిక భాషయగునని గిడుగువారి మతము. మఱి యిపుడు శిష్టులెవరో తేల్చుకొన లేక పోవుచున్నాము. భాషాస్వరూపా ద్యభ్యసనము లొనర్చిన

వారు మన రచయితలలో నెందఱున్నారు? భాషావిద్వాన్నిగాక పత్రికలోఁ బ్రవేశము లభించి, కలముపట్టి వలసి వచ్చిన యువరచయిత "శిష్టుఁడు కృతకవ్యావహారికము వ్రాయు నతఁడు కానేరఁడు గదా!* నాయిష్టము వచ్చినట్లు నేను వ్రాయుదు ననునంతటి విశృంఖలత్వము పొడచూపుట భాషా పోషక హేతువు కానేరదని హెచ్చరింప సాహసింతును.

భాషకు వ్యాకరణము వెన్నెముక వంటిది. ఇటీవల కొందఱు భాషాధికారములేని వారు వ్యాకరణమువలనఁ బ్రయోజనము లేదను చున్నారు. నేఁడాంగ్ల హిందీ గ్రంథానువాదములలో, ననేకగ్రంథములలో, నాయాభాషల జాతీయములు కారకములు, వాక్యనిర్మాణ క్రమములు దొర్లుచు మనభాషకు దూరమై తెలుఁగు కాదగునంతవఱకు పరిణామ మందుట శోచనీయము. ఉభయ భాషాధికారము పొందని రచయిత యనువాదముల కుద్యమించుట యపకర్ష హేతువు కాఁగలదని మనచేయుచున్నాను.

ఏమైనను వ్యావహారికభాష కొకనియమ మేర్పరుపవలసి యున్నదనియు, భాషాధికారి పండితుఁడేగాని, పామరుఁడు భాషావిద్వాన్నికానివాఁడు, గాఁజాలఁడనియు, నెఱుఁగఁ జెప్ప సాహసింతును!

---

* పత్రికాకార్యాలయములలో ప్రసిద్ధరచయితలు శ్రీనార్ల వెంకటేశ్వరరావుగారు, శ్రీ తిరుమల రామచంద్రగారు, శ్రీ విద్వాన్ విశ్వంగారు, శ్రీ పిలకా గణపతిశాస్త్రిగారు మున్నగు కొలఁది కవిపండితులుండి చేయు చున్న భాషా సేవ గణనీయమైనదే.

ప్రామాణిక వ్యావహారిక భాషానుశాసనము చేయు టకుఁ బండితులు పూనుకొనవలసి యున్నది. వ్యావహారిక భాషారచన మందును కట్టుబాట్లు లేకపోయిన తీరనినష్టము భాషకు వాటిలుననుట తథ్యము. అట్టి ప్రమాదమునుండి భాషను గాపాడవలెను. ఇందులకై భాషావేత్తలైన పండి తులు, ప్రచారకేంద్రములనఁ దగిన పత్రికలు, రేడియోలు, పూనుకొనవలెను. నలు మూలలనున్న భాషాకృషీవలుర సహాయముచే మాండలిక పదకోశముకూడ నిర్మాణము పొందవలసియున్నది

ఇంక భిన్నకాలములందు వర్తిలిన సాహిత్య యుగ ములపైన, ప్రత్యేకముగా నాయికావులఁ గూర్చి కృషియొన ర్చిన సాహితీవేత్తలతో నొక సంఘ మేర్పరిచి సాధికారమైన సాహిత్యచరిత్ర నిర్మాణము జరుగ వలసియున్నది. వచన రచ నము ద్వారా భాషాసాహిత్య జాతిచరిత్రలే కాక సమస్త శాస్త్ర విజ్ఞానములకూడ సులభముగాఁ బ్రజాయత్తము చేయుటకు మేధావంతులు మున్ముందు విశేషముగాఁ గృషి చేయుదురు గావుత! వచనయుగమే యీ ప్రజాయుగమగు ననియు, వచనము వలన విజ్ఞానము సర్వథా సర్వదా పరి వ్యాప్త మందుచుండవలెననియుఁ గాంక్షింతును.

[ప్రత్యేకముగా నాహూతుఁడనై వెళ్లి 12 జనవరి 1953 తేదీన అలంపురములో జరిగిన "ఆంధ్రసారస్వత పరిషత్తు" (పస్తకు) వార్షికోత్సవ మహాసభలో నేను జదివిన యుపన్యాసము. ఇయ్యది మే 1953 "సుజాత" ప్రత్యేక సంచికలోఁ బ్రచురితమైనది.]

గద్య కవిత

సాహిత్య మొక జాతియొక్క క్రమవికాసమును సూచించు మహత్తర దర్పణము. జాతిని సంపూర్ణముగ వ్యక్తీకరించుచు సాహిత్యము మానవసంస్కరణమునకుఁ బూనుకొనును. ఇది కారణముగా సాహిత్యములో మానవలోక ప్రతిబింబము నాదర్శలోకచిత్రణము ఈ రెండును సమ్మిశ్రితములై యుండును. కాలానుగుణముగా మార్పును బొందునది లోకమని తెలియుదుము. అట్లే యాదర్శలోక మనునది కూడఁ గాలానుగుణముగా, మానవాభిరుచులనుబట్టి సంఘములో, జీవనదృక్పథములో మార్పులను బురస్కరించుకొని, తత్ప్రభావానుసారిగా రూపురేఖలను దిద్దుకొనుచుండును. కావుననే సాహిత్యమంతయు నేకైకసూత్రలక్ష్యమై యున్నను, సాహిత్యతత్వము ప్రధానముగా నొకటియేయైనను, పయనములో భిన్నత గోచరించుచున్నది.

సాహిత్యవస్తువులో, కావ్యాకృతిలోఁ గొత్తందనములు, కొమ్మొఱుఁగులు కావ్యకారులు తీర్చి దిద్దుకొనుచు వచ్చిరి. మానవుఁడు సహజముగ నిత్యనవ్యతాగవేషణుఁడు. ఈ నవ్యత సాహిత్యమునకును వర్తింపక తీరదుగదా. తత్పరిణామముగా సాహిత్యములోఁ బ్రాచీనమనియు, నాధునికమనియు రెండు విభాగములు విస్పష్టమైన వైవిధ్యముతోఁ బ్రతీయమానమగుచున్నవి. సాహిత్యములో భిన్నత్వము, వస్తువులోను

నాకృతియందును బొంచెడిమార్పులవలన గోచరించునని యిట్టిపూర్వమే గ్రహించితిమి.

పురాణము, చరిత్ర, శాస్త్రము మొదలైన పేర్లు కావ్యాకృతిని నిర్దేశించి చెప్పు నామములు.

ఇంక గావ్యాకృతింగూర్చి వివేచన మొనరింతము.

రసవద్రచనా వ్యాపారమున కంతటికి గావ్యమను బదము నుపయోగింతుము. కవి తాను జూచిన సన్నివేశములను, దానుబొందిన వికారవికాసాదులను, సామాజికుల కందించుటకు సర్వదా యత్నించుచుండును. అట్లందించుట కాతనికి "రచన"మే సాధనము. ఈ రచనమును ఛందోబద్ధముగాఁ జేసేనా యది పద్యకావ్యమగును; ఛందమువినా రచించెనో యది గద్యకావ్య మగును. కొంతఛందోనువర్తిగాఁ గొంత ఛందోరహితముగా సాగించినచో నది చంపూకావ్య మనిపించుకొనును. సంభాషణా రూపముగ రచన ప్రధానముగ సాగుచు ఛందోబద్ధమైన చణుకు లక్కడక్కడ 'కన్పించు చుండిన నట్టిది రూపకమగును. ఈ విధముగా కావ్యాకృతి యను నది ముఖ్యముగా రచనా విధానము మీఁద నాధారపడినదని గ్రహింతుము. ఏ యాకృతినిఁదాల్చినను రచనము రసవంతముగ నుండవలెను; కాకున్న నది కావ్యమనిపించు కొనఁజాలదు. రమణీయార్థ ప్రతిపాదక శబ్దఃకావ్య' మను నిర్వచనము చెప్పినను, 'వాక్యమ్రసాత్మకమ్ కావ్యమ్' అను నిర్వచనము చెప్పుకొనినను ప్రసిద్ధాంతమే యందులో దాగియున్నట్లు గుర్తింతుము; ఆకృతిలో భిన్నత్వము కన్పించినను, రసవంత

మైన రచనయైనచో నది కావ్యత్వసిద్ధి పొందినదగునని తాత్పర్యము.

కాని నిత్యవ్యవహారములో 'గా వ్య' మను బదము పరిమితార్థములోనే రూఢమైయున్నట్లు గాంతుము. ఛందోమయమైనదే కవిత్వమనియు, నదే కావ్యమనియు వాడుక ప్రబలిపోయినది. ఇది కేవలము భ్రాంతిజనకము. ఛందోమయమైన రచనమంతయుఁ గవిత్వము కాకపోవచ్చును. ఛందస్సు లేనంత మాత్రమున గద్యమును గవిత్వము కాదని తోసివేయరాదు.

"అని చెప్పి వీడు కొలిపిన
చనె రాముఁడు వేడ్క తనదు సదనంబునకున్
జనపతియుఁ గొల్వు విరిసియు
చనె నంతఃపురమునకును జతురతతోడన్.

ఇందుఁ గవిత్వము లేదు ; చందస్సున్నది. కథాకథనములో నిట్టిరచన ఛందోబద్ధమై కన్పించుచుండును. కాని ఛందోమయమైన మాత్రమున దీనిఁ గవిత్వమని యనలేము ; అనముకూడ !

'అదే నది కార్తికమాసంలో తనగర్భంలో దాచి వుంచుకొనిన శిలాశిశువులను చూపుతూ వాటిచుట్టూ ప్రేమతో ప్రశాంతంగా తిరుగుతూ ముద్దు పెట్టుకుంటూ పరిష్వంగ సౌఖ్యం అనుభవిస్తూ ప్రవహిస్తుంది."

ఈ వాక్యములో ఛందోరహితమైన రచనముకూడ కవిత్వము కావచ్చునని కదా సారాంశము. "కాలరిడ్జి" యని నట్లుగా ('Poetry can exist without metre') కవిత ఛందస్సు వినా యుండవచ్చును. ఛందస్సుకవితా భావమున కొక యాచ్ఛాదనము మాత్రమే - అలంకార సదృశమే. అంతియ కాని ఛందస్సుకవితకు మూలకారణము కాజాలదు. కవిత్వము భావాశ్రయ కాని ఛందోనువర్తిమాత్రమేకాదని పండితుల యభిప్రాయము - ఇయ్యది పండితార్థము!

మన ప్రాచీనలాక్షణికుల నిర్వచనముల ప్రకారము వారు గద్యమున కిచ్చిన గారవమింతింతగాదు; కావ్యత్వగౌరవము గద్యమున కాపాదించుటయేగాక, "గద్యం నికషం కవీనాం వదన్తి" అని గద్యకవికి నున్నతస్థానము నమర్చి పెట్టినారు. ఈ యభిప్రాయము ప్రకారము పద్యము కంటె గద్యము రచించుట కష్టతర మని స్ఫురించును. ఇది విచిత్రముగఁ గన్పించునుగాని తీవ్రముగా నాలోచించిన గద్యరచనము సులభసాధ్యము కాదని గోచరింపకపోదు.

కవి తానందింపఁ దలఁచిన భావమును సమగ్రముగా సులభముగా, విశదముగా, బద్యమందుఁ జెప్పలేడు. పద్యమందు ఛంధస్సు, అన్వయ కాఠిన్యము లాటంకములు. కావున గవి వీనిపైఁ గొంతకాలము తనశక్తిని వెచ్చించి తత్సౌలభ్యమును సాధింపవలెను. అప్పటికి నాతఁడు తన మనోగత చిత్రమును సంపూర్ణముగా భాసింపఁజేసితినని తృప్తిపడఁ జాలఁడు. గద్యములో నతని కీవిధమైన బాధలేదు. కవితాకళకుఁ బ్రధాన

మైనట్టి భావస్ఫోరకమగు నాలంకారిక రచనము గద్యలోఁ గూడ సాధ్యమగును. సహజసిద్ధముగ 'గద్య' మను బదమందు "స్పష్టముగాఁ జెప్పఁదగినది" యను నర్థము పొదగఁబడి యున్నది. ఇవ్విధముగా సులభార్థబోధ కల్గించు గుణము గద్య మునకున్నపుడు దాని ద్వారా కవిసందేశమును సామాజికులు త్వరగా నందుకొనఁ గల్గుదురుగదా! అట్టిచో కవిప్రయోజనము శీఘ్రముగ నెరవేరుచున్నదని యెఱుంగనగును. కాని యుదాత్తుఁడైన కవి సులభముగా, సరళముగా, వివరించు గద్య రచనము చేయువలెనని నంమనాతనికికున్న శ్రీమ యింతింత గాదు. కనుకనే గద్యకవితారచన ముత్కృష్టస్థితికిఁ జెందిన దగుచున్నది.

గద్యాకృతి దాల్చిన కావ్యము లాంధ్ర సాహిత్యములో నెందువలననో క్వాచిత్కముగఁ గన్పించుచున్నవి. సంస్కృత సాహిత్యములో గద్యకావ్యములున్నను, మన ప్రాచీనులు వాని జోలికి, బోవక, పోయినను బద్యకావ్యములుగ వాని ననుసరించుచును వచ్చిరి. పాల్కురికి సోమనాథుఁడు తనకుఁ బూర్వమే గద్యపరిబంధ రచనమున్నట్లుగను, నది సంస్కృతభూయిష్టరచనముగా నున్నట్లు నుల్లేఖించి యున్నాఁడు. కాని యీగద్యపరిబంధముల జాడ మనకగుపింప లేదు. మనకాంధ్ర సాహిత్యములో చంపూకావ్యములే యెక్కువగా వెలసినవి. పురాణములలోఁ బద్యములకుఁ గుడియెడమగా నడిచిన వచనములు కేవలవచనములే కాని కావ్యత్వము పొందుట కర్హములైన గద్యములు మాత్రముకావు;

ఈవిధముగా శ్రీనాథునివలకు సాగినది. ఆలంకారికవచన రచనము శ్రీనాథకవిసార్వభౌముని చేతిలో బ్రాదుర్భావము నందినది. పోతన భావుకుండై వచనమును గూడ తన సహజ కవితాధోరణిలో నడిపించినాడు. ప్రబంధకవుల రచనములలో సైతమిగుణము వచనములలో మిక్కుటముగా భాసించినది. తరువాత వచ్చిన నాయకరాజుల కాలములో గొంతవఱకు వచనపాశిథిల్యమును గవులు గుర్తించిరని చెప్పుకొనవలె. కాని యాకాలములో గూడ బంధము- యుక్తగానము- గేయమను బంకియల కెక్కువ యాదరముండుటచే గద్యకవి తకు జరుగవలసినంత గౌరవము లభింపలేదనియే చెప్పవలెను.

ఆంగ్ల సాహిత్యప్రభావమాధునిక యుగములో నాంధ్ర గద్యకవితా వికాసమునకు నుపకరించినదనిన నతిశయోక్తి కాదు. కృమముగా బండితులు మనపాచీనపురాణములను వచనములో దిరిగి వ్రాసిరి. 'గద్యనన్నయ' యని చెప్పఁ దగిన చిన్నయసూరి చేసినమేలు మరువరానిది ఆతఁడు వ్రాసిన నీతిచంద్రిక యాంధ్రిగద్య కవిత్వ చరిత్రలో నున్నత స్థానము నాక్రమించును. ఆతని యాలంకారిక శైలి యదృష్ట పూర్వమైనది. సంస్కృతములో బాణుని కాదంబరి యెట్టిదో యాంధ్రిములో నీతని "నీతిచంద్రిక" యట్టిదని చెప్పవచ్చును.

సంస్కృతములో గద్యకావ్యము నైదు విధములుగా విభజించి లక్షణమును నగ్నిపురాణకర్త యందించినను మన యాంధ్ర సాహిత్యములో నావిధమైన గద్యకావ్యములు వెలయు లేదనవలె- ఆఖ్యాయిక, కథ, ఖండకథ, పరికథ, కథా

నిక యను గద్య రచనములు మన తెలుఁగు భాషలో నవత రింపలేదు. కాని, యాంగ్లసాహిత్య ప్రభావమే యున్నట్లు ద్యగ రచన మిటీవల పరిబలినది. ఈ విషయములో సంస్కృత సాహిత్య పరిభావము కంటె నాంగ్లసాహిత్య పరిభావము మిక్కుటమైనదని యొప్పుకొనవలెను. ఆధునికయుగములో నాంధ్రరచనా వ్యాపారమును బరిశీలించినచో గద్యరచనము గొంతవఱకుఁ బరిమితిని పొందినట్లు తెలియఁగల్గుదుము. ఆధు నిక రచనములో విస్పష్టముగ విన్పించుచున్న అంసస్వరము లలో గద్యకవితా కన్యశ్రౌవ్యకంఠము సమధికమైన స్థాన మును గొనఁగలదు.

ఆంగ్ల సాహిత్యములో నవతరించిన గద్యప్రక్రియలలో నవల, కథానిక, పరిధానముగా మన తెలుఁగుకవుల దృష్టి నాకర్షించినవి. శ్రీ కందుకూరి వీరేశలింగంపంతులు నవల నాంధ్రలోకమున కవతరింపఁజేసినాఁడు; వచనమును సర్వోప భోగ్యమైనదానిగాఁ జేసినమహనీయుఁ డీయనే. సులభబోధక మైన శైలిలో వచన రచనము సాగించి యేతత్ప్రయోజన మును లోకమునకు బాగుగఁ జాటినవాఁడు వీరేశలింగం పంతులు. ఈయన వ్రాసిన రాజశేఖర చరిత్ర, సత్యరాజు యాత్ర లిందుల కుదాహరణములు. శ్రీ చిలకమర్తి లక్ష్మీనర సింహంకవిగా రాంధ్రనవలావాఙ్మయము నధికముగాఁ బెంపొం దించిరి. వీరి నవలలలో వచనశైలి నాతికఠినముగను, సర్వ జనాదరణీయముగను నడచినది. మేలైన హాస్యముతోడను, సౌకుమార్యముగల రచనములతోడను విలసిల్లుచున్న వీరి

నవలలు తెలుఁగువారికి మేలుబంతులు. రామచంద్రవిజయము, గణపతి, సౌందర్యతిలక, శాపము, సుధాశరశ్చంద్రికములు వీరిగొప్పనవలలు. చారిత్రిక విషయములను నవల రూపములో నందించిన పోడ చిలకమర్తివారు. వీరి తరువాత నెన్నఁదగినవారు వెంకటపార్వతీశ్వరకవులు, కేతవరపు వెంకట శాస్త్రిగారలు. వేంకటపార్వతీశ్వరకవుల వచనశైలి ప్రసన్న మైనది. వీరి ప్రమదావనము శిరోమణివంటిది. హిందీ, బెంగాలీ భాషలలోని నవల లనువదితమగుచు వచ్చినవి. నవలలలో స్వతంత్రికములు కన్న ననువాదములే యధికసంఖ్యగలవి. సాహితీసమితి కవులు వ్రాసిన నవలలలో గద్యకవితా లత మొగ్గతొడిగినదని చెప్పిన సత్యదూరము కాదు. అనువాదములుకాని, స్వతంత్రములుకాని వీరిరచనములలోఁ గవిత యెక్కువపాలు గలదై యుండును. శ్రీయుతులు శివశంకర శాస్త్రి, వీరరాఘవస్వామిగారలు మన కిచ్చిన గద్యకవిత యల్పమైన దైననునందలి యుత్తమత్వము నెన్నుకొని తీరవలె.

*ఇచట చెప్పనలసినవి రెండు విషయములు. నవలలో గద్యకవితకున్న స్థానము మొదటిది. భాషావాదము రెండవది.

నవలలోఁ గథను రమణీయముగఁ జెప్పుట ముఖ్యధర్మము. దీనినే కథాకథన మందుము. పాత్రలను వర్ణించు

---

* శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణపంతులుగారి 'మాలపల్లి' నవల సర్వస్వతంత్రమై భాషయందును, వస్తువునందును భావములందును ముందు యుగములోనికిఁ బర్వు లెత్తుచున్నది.

నపుడు, సన్నివేశములను జిత్రించునపుడు, కవితాభావములను బ్రివేశపెట్టుట కవకాశములున్నవి; కథయే కల్పితమై యున్నపుడు కవితాధర్మ మందధికముగా నున్నట్లుగదా. కనుక గద్య కవిత యాధునిక కాలములో నవలలో స్థానము గొనియున్నట్లు గ్రహింపవలె.

ఇంక వ్యావహారిక భాషావాదము గిడుగువారిచే నుద్ఘాటింపఁబడి గద్యరచనములపైఁ దత్ప్రభావము లెస్సగాఁ బడినది. నవలలందు వ్యావహారికభాష యుపయుక్తమై ప్రాచుర్యము బొందినది. యదార్థమునకు భాషోద్యమము చాల మంది గద్యకవులను దయారు చేసినదని చెప్పవలసియున్నది. వచనము సులభార్థబోధయే పరమాశయముగలట్టిది. అట్టి గద్యమును వ్యావహారికభాషలో నడుపుట మఱింత సౌలభ్యమును సాధించుటయే యుగునుగదా యని గద్యరచయితలీ వ్యావహారిక భాషను గ్రహించిరి.

ఈ వ్యావహారిక భాషావాదము నందు విశ్వాసము లేని వారు గ్రాంథికభాషలోనే రచనము సాగించుచున్నారు. పాశ్చాత్యక్రమమందు మాత్రమింక గ్రాంథికమే గౌరవము పొందుచున్నది; కాని వ్యావహారిక భాషకుఁ బ్రివేశము లభింపలేదని యెఱుంగవలెను. ఈ సంధియుగమున భాషా విద్యార్థులు వ్యావహారిక గ్రాంథికభాషల మధ్య తికమకపడు చుండుట గమనింపఁ గలము.

ఆధునికనవలాకర్తలలో గద్యకవిత్వమునకు మెఱుఁగులు దిద్దుచున్నవారిలో శ్రీయుతులు విశ్వనాథ సత్యనారా

యణ, అడివి బాపిరాజుగారలు ప్రముఖులు. వీరి నవలలు శర పరంపరగా వచ్చుచున్నవి. విశ్వనాథవారి చిత్రణములో సంపదాయము, పాండితీవైభవములు- బాపిరాజుగారి రచన ములో చిత్రకళాభిజ్ఞత, కళావిలాసములునధిగమించుచుండును. విశ్వనాథవారి 'వేయిపడగలు,' అడివివారి "హిమబిందు" లెన్నదగినవి. (శ్రీ నోరి నరసింహశాస్త్రి గారిటీవల నవలా రంగమునఁ బ్రవేశించి యాంధ్రుల చరిత్రకు, నాంధ్రకవుల చరిత్రకు సంబంధించిన విశేషముల గ్రహించి నారాయణ భట్టు - రుద్రమదేవి - మల్లారెడ్డియను నవలలను నిర్మించి గణన కెక్కుచున్నారు. శ్రీ 'బుచ్చిబాబు 'గారు నుత్తమ సాంఘికనవల 'చివరకు మిగిలేది'యనునది వ్రాసి కీర్తిగడించు నున్నారు.)

ఇంకఁ దెలుఁగు కథానికారచనమునుగూర్చి దిజ్ఞాత్రి ముగాఁ దెలిసికొందము. కథానికకూడ గద్యకవిత కాకర మైన ప్రక్రియావిశేషమేనని ముందే గణించియుంటిమి. ఈ ప్రక్రియాసాధకులలో గద్యకవులని పేర్కొనఁదగిన ప్రసి ద్ధులలో శ్రీయుతులు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, చింతా దీక్షితులు, భమిడిపాటి కామేశ్వరరావు, మునిమాణిక్యం నరసింహారావు, మొక్కపాటి నరసింహశాస్త్రి, కరుణ కుమార్, గుడిపాటి వేంకటచలం, కొడవటిగంటి కుటుంబరావు, గోపీచంద్ గారలు ముఖ్యులు. భావాతిశయమైన గద్యరచ నము హెచ్చుగా వీరికథలలో గద్యరచనములలోఁ గన్పిం చును. వీరు పద్యములు వ్రాయకపోయినను కవిత్వము చెప్పఁ గలవారని మనము వీరిని పరిగణింపవలసియున్నది.

ఇటీవల పాఠకలోకమునఁ బద్యముపైకన్న గద్యముపై నభిలాష యధిక మైనట్లు గాంతును. ఆధునిక కావ్యపద్ధియ లలో నవలాకథానికలకు నాదరావకాశము లధిక ముగ నున్నట్లు స్పష్టము కాఁగలదు. "వచన పద్యాలను నూతన పద్ధియను గూడఁ జూచుచున్నాము. "వచనాలనే దుడ్డు కర్రలతో పద్యాలనడుములు విరగదంతాను" అను వాక్యములు చెవింబడుటయే కాదు; కావ్యరూపము ధరించుచున్నవి గూడ! ఏమైనను 'గద్యకవితాసృష్టి కవులకు నికషోపలము వంటిది' అనుసూత్రమును చాలమంది మరచినట్లిటీవలవచ్చెడి గద్యరచనములు బుజువుపఱుచుచున్నవి. కావ్యత్వము సిద్ధిం పని వచన రచన గద్యముకాదని మొదటనే తెలిపితినిగదా!

ఏదియెట్లున్నను నేఁడు గద్యరచయితకు గౌరవము సాహిత్యలోకమందును, సామాజికలోకమందును సిద్ధించుట ముదావహము. ఆధునిక సాహిత్యములో గద్యకవితలో నంస స్వరములు విస్పష్టముగా విన్పించుచున్నవి. ఇఁకముంము గద్య రచనములోఁ గవితాంశమభివృద్ధి పొందవలసియున్నది. గద్య కవి కూడఁ గవియనియు, గద్యకవితకూడఁ గవిత్వమేననియు బాగుగ గుర్తించు దినములు వచ్చినవని యీనాఁడు మనము సంతోషము బొందవలసియున్నది; పరిపూర్ణత్వము కాల క్రమమున సిద్ధించు విశేషము సుమా!

[ఏప్రియల్ 1946 లో మద్రాసు రేడియోకేంద్రమునుండి నేను జేసిన ప్రసంగము; 'ఆంధ్రిపబ్లిక్', 'భారతి' సంచికలలోఁ బ్రకటితమైనది.]

తెలుఁగునవల - రచనాశిల్పము

తెలుఁగుసాహిత్యములో వచనకావ్యమనఁ దగిన నవల యిటీవలకాలములో- అనఁగా 19 వ శతాబ్దములో వర్ధిలిన నూతన ప్రక్రియావిశేషము. తెలుఁగునవలలోని రచనాశిల్పము నెన్నుకొనుటకుఁ బూర్వము తెలుఁగునవలల పుట్టుపూర్వోత్తరములను గొంత తెలిసికొనుట యవసరము.

తెలుఁగు సాహిత్యము సంస్కృతాంగ్ల, ఫ్రెంచి, రష్యన్, హిందీ, వంగ సాహిత్య ప్రభావములకులోనై ముఖ్యముగా నాఁటినుండి నేఁటివఱకు వర్ధిలుచు వచ్చుచున్న విషయము మఱువరానిది. తెలుఁగు భాషలో నవలాసాహిత్య వికాసమును గమనించుచున్న మనకీపై నభిప్రాయము బుజువు పడగలదు. అగ్నిపురాణములో గద్యకావ్యము లైదు విధములనియు నం దాఖ్యాయిక విస్తృత కథావస్తువు కలట్టిదని చెప్పఁబడి యుండుటచేత, కాదంబరివంటి యాఖ్యాయికా గ్రంథములు క్వాచిత్కముగాఁ గన్పించుచున్నందు వలన 'నవల' స్వరూపముకొంత సంస్కృత గద్యకావ్యములలోఁ బొడగట్టుచున్న దనవచ్చును. అతిప్రాచీనమైన బృహత్కథ కథాసరిత్సాగర రూపములోఁ గథా సంచయముగా గణనమునకు వచ్చుచున్నది. కాని యఖండమైన కావ్యముకాక పోవుచున్నది. పింగళి సూరన్న యపూర్వ వస్తునిర్మాణదక్షుఁడై కళాపూర్ణోదయమునొక యద్భుతమైన నవలగాఁ

జిత్రించెను కాని యది పద్యములలో నున్నది! మధిర సుబ్బన్న దీక్షితులు గూర్చిన 'కాశీమజిలీలు' కథాసముచ్చయమే కాని నవలకాదుగదా. శ్రీయుతులు కొకొండ వేంకటరత్నముపంతులు వ్రాసిన 'మహాశ్వేత', నరహరి గోపాలకృష్ణమ్మ సెట్టి వ్రాసిన 'రంగరాజ చరిత్ర' లను వచన కావ్యములు వీరేశలింగంపంతులుకుఁ బూర్వమే వెలసినవి. కందుకూరివారి రాజశేఖర చరిత్రతోడనే తెలుఁగు సాహిత్యములో నాంగ్ల ప్రభావమున నవల ప్రాదుర్భవించినట్లు చెప్పుకొనవలసియున్నది.

తెలుఁగు నవల, యాంగ్ల నవల ననువదించుటతోడను, వాని ననుసరించుటతోడను నారంభమైనది. అటు పిమ్మట వంగభాషనుండి, హిందీభాషనుండి క్రమముగా దిగుమతులు హెచ్చినవి. అట్లు వచ్చిన నవలలే, ఆంధ్రప్రచారిణి, వేగు చుక్క, ఆంధ్రవిజ్ఞానచంద్రిక, సరస్వతీ గ్రంథమాలలద్వారా వెలువడినవి. వీరేశలింగంపంతులు, చిలకమర్తి లక్ష్మీనరసింహము, కేతవరపు వెంకటశాస్త్రి, వేంకటపార్వతీశకవులు, శివశంకరశాస్త్రి, త్రిపురారిభొట్ల వీరరాఘవస్వామి, జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి, "చక్రపాణి", శివరామకృష్ణ మొదలైన వారన్యభాషా నవలల ననువదించుటలో నండదండలైనవారు.

క్రమముగాఁ గొంతకాలమున కనువాదములు సన్నగిలి యాకృతిలో, శిల్పములో నన్యభాషానవలల ననుసరించుచు స్వతంత్రనవలలఁ గొన్నింటిని వైరచయితలును, మఱికొందఱును రచియించిరి. మొదట చారిత్రకగాథలు తదంతర్గ

తమ్ములైన పాత్రలు, సన్నివేశములు వీరిదృష్టి నాకర్షించినవి. ఏతత్కలితములే చిలకమర్తివారి ''అహల్యాబాయి, సౌందర్యతిలక, హేమలత, కర్పూరమంజరులు'', దుగ్గిరాలవారి ''విజయనగరసామ్రాజ్యము'', భోగరాజువారి 'విమలాదేవి, ఆంధ్రరాష్ట్రములు, వేలాలవారి 'రాణీసంయుక్త,' కేతవరపువారి ''రాయచూరు యుద్ధము'' మొదలైనవి నిబిడములైన సంఘటనలతో, దీర్ఘములైన వర్ణనములతో, సమాసజటిలము పదాడంబరయుతము నైనభాషతో విలసిల్లుచున్నవి.

వీనికిఁ బ్రక్కగా నొకదెస నదే కాలములో నపరాధ పరిశోధకనవలలుద్భవించి యన్యసాహిత్యముల ప్రభావమును, ముఖ్యముగా షెర్లాక్ హోమ్ను ప్రభావమును వ్యక్తీకరించుచున్నవి. ''వాడే వీడు, జాగిలము, నేనే, కాలూరాయి, (కొమర వోలువారి) 264, మండ్రగబ్బ, మాయావి, మనోరమ, మాయావిని, చలిపిడుగు జాగ్రత్త, చోరాగ్రేసర చక్రవర్తి'' మొదలైనవి ఈ శ్రేణికిఁ జెందినవి. వీనిలో హఠాత్సన్నివేశములు, భయంకర దృశ్యములు, ఆందోళన కారకములైన సంఘటనములు, రహస్యాలోచనములు, మారువేషములు, గూఢచారులు మొదలైన వెన్నో యుండి పాఠకుల మనములకు భయోత్పాతమును గలుగఁజేయుటలో సమర్థములై గణనకెక్కినవి. విపరీత సంఘటనా సృజనములో, భీభత్సరసపోషణములో నేత న్నవలా రచయితలందఱు నిమగ్నులై యుండువారు.

ఇంక సాంఘిక కేతివృత్తములను స్వీకరించిన నవలలుద్భవించుట తర్వాత కాలమునకుఁ జెందినది. వరశుల్క

ములు, ఆంగ్లవిద్యపై వ్యామోహము, స్త్రీవిద్యా సహవిద్యల వలన ఫలితములు, బాల్యవివాహములు, స్వేచ్ఛాపరిణయము-అస్పృశ్యత-రాష్ట్రీయవాంఛ-గాంధీతత్వము-జమీన్దారులయొక్కయు రైతులయొక్కయు కష్టసుఖములు, మూఢవిశ్వాసములు, నవనాగరికత- ఆర్థికవ్యత్యాసములు, మద్యపానము- స్త్రీలోలుపత్వము- వర్ణవ్యవస్థ- భిన్న మనస్తత్వములు- ఆశలు నాశయములు- ఆవేదనలు మొదలైన యంశములన్నింటినో స్పృశించుచు నాంధ్రజీవితమును వర్ణించిన నవలలు, నవలికలు నసంఖ్యాకములుగా వెలువడినవి. అట్టివానిలో వీరేశలింగముగారి "రాజశేఖర చరిత్ర"- కేతవరపు వెంకటశాస్త్రిగారి "లక్ష్మీప్రసాదము" చేకుమళ్ళ రామచంద్రరావుగారి "క్షమాపణము", చిలకమర్తివారి "గణపతి", వున్నవవారి "మాలపల్లి", విశ్వనాథవారి "వేయిపడగలు" చెలియలికట్ట, ఏకవీరలు", బాపిరాజుగారి "నారాయణరావు, తుఫాను, కోనంగులు", మొక్కపాటివారి "బారిష్టరు పార్వతీశము", గోపీచంద్‌గారి 'పరివర్తనము', బుచ్చిబాబుగారి "చివరకు మిగిలేది", రంగనాయకులుగారి "స్వర్ణలత", వి. డి. ప్రసాదరావుగారి 'నాకబలి', పోతుకుచ్చి సాంబశివరావు 'ఉదయ కిరణాలు' యనునవి గణన కెక్కినవి.*

* ఆంధ్ర విశ్వవిద్యాలయమువారి పోతిత్సాహము నందుకొని, వాకేర్వరచిన యాంధ్రుల చరిత్రపై నాధార పడిన నవలారచన పరీక్షలలో విజయము పొంది యిటీవల కాలమున కొన్ని నవలలు, తెలుగు భాషాసమితి వున్నగుసంస్థల బహుమతులనందినట్టి నవలలు మఱికొన్ని వెలువడుచున్నవి.

ఇటీవల కాలములో నాంధ్రుల చరిత్రపై దృష్టిపడి యపరిమితాభిమానముతో నేతచ్చరిత్రను గ్రథింపఁజూచిన నవలా కారుల కృషివిశిష్టమైనది. శాతవాహనులకాలమునకుఁ జెందిన చరిత్ర నాధారము చేసికొని అడివి బాపిరాజుగారు 'హిమబిందు,' కుసుగంటి సీతారామయ్యగారు 'శాతకర్ణి'యను నవలలను నిర్మించిరి; కాకతీయ చరిత్రనాధారముగఁ జేసికొని వ్రాసినవి నోరి నరసింహశాస్త్రిగారి "రుద్రమదేవి," బాపిరాజు గారి 'గోనగన్నారెడ్డి' శ్రీమతి వసుంధర 'సప్తపర్ణి' యను నవలలు; తూర్పు చాళుక్యుల కాలమునాఁటి చరిత్రను గ్రహించి వ్రాసినదే నరసింహశాస్త్రిగారి "నారాయణభట్టు" నవల. తంజావూరు నాయకరాజుల చరిత్ర నాధారముగ జేసికొని వెలువడినవే బాపిరాజుగారి 'మధురవాణి' శ్రీమతి వసుంధర వ్రాసిన 'తంజావూరు పతనములు,' యన్. యస్. వి. సోమయాజులు వ్రాసిన 'రఘునాథవిలాసము' విజయనగర కాలము ప్రతిబింబించు చారిత్రక నవల ధూళిపాళ శ్రీరామమూర్తిగారి 'భువన విజయము'; కేశవభొట్ల సుదర్శన వేణుగోపాలమూర్తిగారి "అశోకధర్మచక్రము", తెన్నేటి సూరిగారి "చంఘీసుఖాన్", పాటిబండ మాధవశర్మగారి "రాజశిల్పి" చారిత్రక భిత్తికపై నిర్మాణము పొందిన నవలలే.

ఇట్లనువాదముతోఁ బ్రారంభమైన తెలుఁగునవల క్రమవికాసము పొంది యీనాఁటి కొకవిధముగా స్వతంత్రముగా జీవించుట నేర్చినది.

ఇఁక మన తెలుఁగు నవల వన్నెచిన్నెలను తీరుతీయములు నించుక పరికింతము; పరజాతిస్త్రీలకు (నవలలకు)

తెలుఁగువేసము దిద్ది పేరంటమునకుఁ బంపిన ముచ్చటగా నుండును గాని వారు యదార్థమైన తెలుఁగువారు కారుగదా; నోరు తెరచుసరికి తేలిపోదుము ! అట్లే యనూదిత నవలలు నాంధ్రేతరములైన వస్త్వాచారాదికము గలిగి బయటపడి పోఁగలవు! పాత్రలపేర్లు, పరిదేశవర్ణనలు, కథావస్తువు, ఆచార వ్యవహారాదులు, సంభాషణరీతులు, వాక్యనిర్మాణములు, పరికరణ విభాగములు, అస్నియు నాంధ్రేతరములై యుండును. వీనిలోఁ గన్పించు శిల్పము మాతృకాకారునిదే గదా ! కావున ననువాదకర్తల శక్తి భాషవఱికే పరిమితమై పోవు చున్నది. ఇంక తెలుఁగు నవలలలో రచనాశిల్పము నరయఁవలెనని స్వతంత్ర రచనమునందే గ్రహింపవలెను. నవలలోని శిల్పవివేచన చేయుటకు నవల లక్షణము నెఱుఁగుట యావశ్యక మగును.

నవల* ముఖ్యముగా నొకకథపై నాధారపడిన విపుల వచనకావ్యము. ఈ కథయే యాధికారికేతి వృత్త మనిపించు కొనును. ఏతత్కథా పోషకములైన పార్శ్వసంగికము లనేకము చేరి, చిలువలు పలువలు కల్పితములై, వర్ణనములతో, బహుళ

---

* "The fundamental of any novel is story.

NOVEL : A fictitious prose narrative or tale of considerable length (now usually one long enough to fill one or more volumes)in which characters and actions representative of the real life of past or present times are portrayed in a plot of more or less complexity."

పాత్రచిత్రణముతో, చిత్రసంభాషణములతో, జీవిత వాఖ్యానములతో వర్తిలి లోకపరిజ్ఞానముతోపాటు నీతిబోధ జేయుచుండు కల్పనాత్మకము మనోహరమునైన గద్యకావ్యమే నవల. కావ్యమని నిర్దేశించుటయే తడవుగా నది రసప్రధానము, శిల్పసంయుతమునని తెలియగలదు రమ్యమైన కథను గల్పించుటలో, వర్ణనములలో, జీవమును సంపూర్ణత్వమును సాధించుటలో, సంభాషణములలో, నాటకీయతను బొడమ జేయుటలో, పాత్రోన్మీలనము సంఘటనముల మరుగునఁ గ్రమముగాఁ బొందించుటలో, దేశకాలపరిస్థితుల నెఱిఁగించుచో కేవల చరిత్రవలె విసుగుపుట్టింపక చిత్తాకర్షకముగ రచించుటలో, నాధికారికేతివృత్తముతోఁ బ్రాసంగికముల నతికించుటలో, నంగాంగీ భావౌచితీగణనములో, మనస్తత్వ చిత్రణమునకు వలయు భావుకతా ప్రకటనములో, నవలా కారుఁడు తాను కథకుఁడు, నాటకనిర్మాత, అనుభవశాలి, మనస్తత్వవేత్త, ద్రష్ట, భావుకుఁడు, ప్రవక్త, చిత్రకారుఁడు, నటుఁడునై తీరవలెను. నవలారచనమం దిన్నివిధములైన శిల్పము పొడగట్టవలసి యున్నది.

మనకున్న తెలుఁగు చారిత్రక నవలలలోఁ జరిత్ర గ్రథనముతోడనే చాల భాగము నిండిపోవుచుండుట గమనింతుము. ఆకర్షకమైన కథాంశమును గుంటుపడఁ జేయునదే యాచారిత్రక కథనమగుచుఁ బాఠకులకు విసుగు కల్గించుచుండును. కొన్ని నవలలలోఁ బాత్రలపైనే రచయిత దృష్టి కేంద్రీకరించుట వలన వర్ణనములు, సంభాషణములు విషయ

నైవిధ్యము లేక యున్నవి. కొన్నింటి బహువిషయ పరిజ్ఞానము కల్గించుయత్నము మితిమీరి, వానిని నవలలను కానీయ కున్నవి. వర్ణనా ప్రాధాన్యములైకొన్ని, సంభాషణ ప్రాధాన్యములైకొన్ని, పూర్వపక్ష సిద్ధాంతములతో నిండిపోయి కొన్ని, ప్రకరణవిభాగములో సంఘటనలను యథాతథముగా గ్రామ పరిణామము లేక కుప్పపోసినవికొన్ని, అన్నింటికన్న ముఖ్యముగా నవలలో నుండవలసిన ఉత్కంఠ (Suspense) లేకకొన్ని, శిల్పవివేచనమునకుఁ జాలకున్నవి.

అయినను బ్రసిద్ధాంధ్ర నవలాకారుల రచనలలో శిల్ప నైపుణ్యము లేక పోలేదు; విశేషలింగము పంతులు నవలను డెలుఁగున నాఁటిన యాద్యులలోనొకఁ డైనను శిల్పవిషయ మున సిద్ధహస్తుఁడని పేరుపొందిన నవలాకారులు చిలకమర్తి వారు– ఆయన 'ఆంధ్రస్కాట్'! అనువాదములను గూడ మాతృకలవలె రచించుట వీరికున్న శిల్ప విశేషమే; వీరితో శివ శంకరశాస్త్రిగారి నెన్నవలె; "సుధాశతచ్చందమ్ము– కుంకుమ బరిణెలు" తుల్యయోగ్యత కలవిగానుండి శిల్పమును వెలాఁకుచున్నవి. భాషా పాటవమునందు, విపుల వర్ణనా సందర్భముల యందును, మున్ముందేమి రానున్నదో యనెడి కుతూహలమును రేకెత్తించుట యందును వేంకటపార్వతీశ్వర కవులు, చిలకమర్తివారి రనన్య ప్రజ్ఞకలవారు. వ్యాసో చితమైన యాలంకారిక శైలి (Ornate style)వీరి లేఖనులనుండి వెలువడిన నవలలన్నిఁటిఁ గన్పించును. ముఖ్యముగా హాస్య రస పోషణములో చిలకమర్తివారి "గణపతి," మొక్క

పాటి నరసింహశాస్త్రిగారి 'బారిష్టరు పార్వతీశము' గణన కెక్కినవి !

ఇంక "డిటెక్టివ్" నవలాకారులలో ననువాదకులు కాక స్వతంత్రులలో కొమరవోలు నాగభూషణరావుగారు '264' అను నవల రచించి రచనాశిల్పముచే బాఠకులను విభ్రాంత మనస్కులను గావించిరి. వీరి భాష యున్నత భావాభినివేశ యుతమైనను సులభార్థబోధకమై కృత్రిమము గాక యుండును. వీరెల్ల రిప్పటికి రెండు దశాబ్దములకిందట నవలలను సృజించి పేరు బొందినవారు.

తరువాతదశకములోఁ బేరొందిన నవలాకారుల విశ్వేశ్వర నాథ సత్యనారాయణగారు, అడివి బాపిరాజుగారు, వున్నవ లక్ష్మీనారాయణగారు, నోరి నరసింహశాస్త్రిగారు త్తమ నవలల నిర్మించిరి. ఇందు మొదటి యిద్దరు శరపంపరవలె స్వతంత్ర నవలలను సృజించినవారు. వీరిలో నోరివారు విశ్వనాథవారు గ్రాంథికభాషనే యధికముగా గ్రహించినట్లును, వున్నవవారు వ్యావహారికమును గ్రహించినట్లును, బాపిరాజు గారు గ్రాంథిక వ్యావహారికముల రెంటిని గ్రహించినను వ్యావహారికముపైఁ బ్రబలమైన యాదరమునినట్లు గమనింతుము. ఆంధ్ర విశ్వకళా పరిషత్తుచేఁ దొలుత బహుమతులను బడసినవి "వేయిపడగలు - నారాయణరా"వను నవలలు ; తెలుఁగుభాషాసమితిచేఁ దొలుత బహుమతి నందిన నవల 'నారాయణభట్టు.' ఈ నవలలందు వారిరచనా శిల్పము సమగ్రముగాఁ బ్రకటనము కాలేదు. ఈ నవలాకారులు ముప్పుసు నాదర్శములను స్థాపించుటకుఁ దెలుఁగు సంఘమును జిత్రించు

టకు, విజ్ఞానబోధకములైన విషయముల నధికముగఁ బొం
దించుటకు నినుమిక్కిలిగా శ్రమపడిరి.

విశ్వనాథవారి "ఏకవీర, చెలియలికట్టలు పరిణయ
పరిధానములై, ధర్మ- మధుర పరిణయములకుఁగల సంఘర్ష
ణమును స్వభావసిద్ధముగా వర్ణించునట్టివి; బాపిరాజుగారి
"హిమబిందు- తుఫాను" లుత్తమాదర్శ శిల్పహృదయమును
వెలార్చునట్టి నవలలు, కథాసంవిధానములో, హృదయముల
నాకట్టు వర్ణనలను బొదించుటలోఁ బాత్ర చిత్రణములో
నొక్కొక్క ప్రకరణము నొక్కొక్క రసగోళముగాఁ దీర్చిదిద్దు
టలోఁ గావ్యత్వమును గల్గియుండుటలోఁ 'హిమబిందు' ప్రశ స్తి
వహించును. వున్నవవారి 'మాలపల్లి' సంఘ సంస్కారో
ద్దేశితమైనది. సహజ సంభాషణములు, స్వాభావిక వర్ణన
ములు, నాతిదీర్ఘములైన సన్నివేశముల ద్వారా విషయ
బోధనము కలిగిన వస్తువుచే నిది విశిష్టమైన నవలగాఁ బరిగ
ణింపఁబడుచున్నది. వున్నవవారి భాషాశైలి క్రొత్తది. ఆంధ్ర
జాతీయములు, పలుకుబళ్లు, జాతిరత్నముల వంటివి యీనవ
లలోఁ బదిల పడియున్నవి. బాపిరాజుగారి భాష సులభ బోధ
కమై కథావేగమున కనువైనదై యొక తేనెవాకవలెఁ బ్రవ
హించుచుండును. విశ్వనాథవారి భాష పాండిత్య స్ఫోకరమై,
వారి యాత్మీయతను బూర్తిగాఁ బ్రతిబింబింపఁజేసి నొన్నట్టిది;
నోరివారి నవలలలో భాష యింకను రాటు తేలవలసియున్నది.

నవలలలో నా యా నవలాకర్తల యాత్మీయతలు
(Personalities) వారి వారి యభిరుచులు కన్పించుచుండును.

కొన్ని నవలలాయా రచయితల యాత్మకథలపై నాధారపడి యుండును. విశ్వనాథవారు ధర్మారావుపాత్రలో, బాపిరాజుగారు నారాయణరావుపాత్రిలో, నోరివారు నారాయణభట్టులో స్పష్టముగాఁ గన్పించుచున్నారని వారి నెఱిఁగినవారు చెప్పఁగలరు. నవల లోకమునకు దర్పణము వంటిదేకాని నవలా కారుఁడు కవి కావున నా కవి యాత్మీయత తప్పనిసరిగా నీడవలె నాతని రచనమును వెన్నంటి యుండును.

కొలఁదిమంది నవలాకర్తలు ఉత్తమ పురుషలోఁ గథ చెప్పుట కారంభింతురు; "బారిష్టరు పార్వతీశము, వీరవల్లడు, మాబాబు"అనెడి నవలలిట్టివి. ఇట్టివిధాన మాకర్షముగా నుండును కాని, పాఠకుఁడు కవిని వదలి పాత్రిలతో నెంతగా సాను భూతి చూపఁగలఁడనునది ప్రశ్నయే. ఆత్మాశ్రియ పరాశ్రియ కవితలకున్న సాధక బాధకములే వీనిలోను గనవచ్చును.

ఇంక నిటీవల యువరచయితలు కొందఱు నవ్యమార్గములలో నవలలను నిర్మించుటకు యత్నించుచుఁ గొంత యాశ కల్పించుచున్నారు. వీరిలో శ్రీ తెన్నేటిసూరి, శ్రీ లక్ష్మణరావు, శ్రీ వి. డి. ప్రసాదరావు, శ్రీ పోతుకూచి సాంబశివరావు లను వారు పేరొక్కనఁదగిన ప్రతిభావంతులు.*

---

* ఆంధ్ర విశ్వవిద్యాలయమువారు పెట్టిన పోటీలలో నెగ్గిన నవలలు విద్యార్థులకుఁ బాఠ్యగ్రంథములై యిటీవల వ్యాప్తిలోనికి వచ్చుచున్నవి. వీనిలో భాష సమాసబంధురమై పెక్కుచోట్ల పాండిత్య ప్రకర్షకై యేతత్కర్తలు ప్రత్యేక ప్రయత్నము చేసినట్లు తెలియుదుము. కథలలో, సహజవికాసము, ఉత్కంఠలు వీనిలోఁ దక్కువగాఁ గన్పించుచున్నవి.

మొత్తముమీఁద నాంధ్ర సారస్వతములో నవల తెలుఁగులోఁ గ్రమముగా వికాసముబొంది, నేఁటికొక స్వరూపము దాల్చినదనియు, యువరచయితల కృషిచే నొకచక్కని భవిష్యత్తుకల పరిక్రియయై తెలుఁగులో నవల చెలఁగుచున్నట్లు చెప్పుకొనుటకు వలనుపడుచున్నది !

(27-8-1957 తేదీన విజయవాడ రేడియోకేంద్రమునుండి నేను జేసిన ప్రసంగము. చి॥ సౌ॥ నిర్మల దీనికి సాధుపరితి వ్రాసిపెట్టినది.)

తెలుఁగులో గేయము - స్థూల పరిశీలనము

నన్నయ్యకుఁ బూర్వము తెలుఁగుభాషలోఁ బదము లుండెడివని సాహిత్య చరిత్రజ్ఞు లందురు. నన్నయప్రవాసిన దంతయు నీనాఁటికి మార్గకవితయై పరిణామ మొందినది. నన్నయతర్వాత వచ్చిన శివకవులు పదకవిత్వము నాదరించి పోషించిరి; ద్విపద కావ్యమనెడిది వెలువడిన దీకాలమునఁ నే! హైవసంకీర్తనము నిమిత్తము పల్లెలలో ననేక పదములు, కీర్తనలు పరిచారములో నుండెడివని శివకవుల గ్రంథముల వలనఁ దెలియుచున్నది; తరువాత అప్పుడప్పుడు దేశిసాహిత్య మన్ని యుగములందును బొడసూపుచునే వచ్చినది. రంగనాథ రామాయణమనఁ నేమి, పల్నాటి వీరచరిత్ర మనఁ నేమి, హరిశ్చంద్ర ద్విపదయేమి యీతరువాత తాళ్ళపాకవారి కీర్తనలేమి, యక్షగానము లేమి, యివన్నియు దేశికవిత్వసరళికిఁ జెందినవే. ప్రబంధ మనునది బిరుదు సడలకవచ్చిన కావ్యప్రక్రియ పండితా మోదము బడయుచు రాజాస్థాన గౌరవము నందుచుండగా, నప్పుడప్పుడు పామరులను రంజింపఁ జేయుటకు స్వర రాగ రంజితములైన పదము లుద్భవింపక పోలేదు.

తెలుఁగు సాహిత్యములో నన్ని యుగములందును మాత్రాఛందస్సు కొలఁదిగనో గొప్పగనో కవిలోకముచే నారాధింపఁబడుచు వచ్చినదనుట యదార్థము. కాని రాజాశ్రయము పొందనిదే సాహిత్యమను ముద్ర దానిపైఁబడని కారణమున ననేకములైన రచనములు మరుగునఁ బడిపోయి

యుండును. ఈ దేశికవిత పల్లెలలోఁ బాశ్చర్యము పొందియుండునని నమ్మవచ్చును. త్యాగయ్య, క్షేత్రియ్య, శ్యామశాస్త్రి, ముద్దుపళని, మున్నగు వాగ్గేయకారుల రచనలును సారస్వతములో నుల్లేఖించుకొనుటయు నీదేశి కవితా పరిక రణమునకే! అనంతరకాలములోఁ బ్రజాభిరుచిని చూరగొన్న కాటమరాజుకథ, బాలనాగమ్మకథ, దేశింగురాజుకథ, బొబ్బిలి కథ, గోపిరెడ్డిపాటలు, బతకమ్మపాటలు, ఇతరములైన స్త్రీల పాటలు, పడవ పాటలు, పల్లె పదములు, దంపుళ్ళ పాటలు, భజన కీర్తనలు మొదలైన వన్నియు నీదేశిమార్గమునకుఁ జెందినవే!

ఇవన్నియుఁ బల్లీయుల నధికముగ నాకర్షించి, వారిని రంజింపఁజేయుచు వచ్చిన పదములు, నాగరక స్థలములని తలఁచఁబడిన రాజాస్థానములందు వీనికిఁ బ్రవేశము సున్న యనవలె. నాయకరాజులకాలములో సంగీతమునకు స్థాన మధికముగ లభించుట కారణముగఁ గొన్ని కీర్తనలకు గౌర వము సిద్ధించినది. మొత్తముమీఁద మొన్న మొన్నటివఱకు వృత్తమునకున్న గౌరవము పదమునకు సాహిత్యప్రపంచములో లేకపోయినట్లే చెప్పవలె.

నవ్యయుగములోమాత్రము గేయము బహుళ ప్రచా రము నందినదనుటకు సందేహింప నవసరము లేదు. ఈ పద్ధతి యకు సాహిత్యలోకములో నాదరమబ్బిన కాలమిదియే. గేయమున కంతకుఁ బూర్వమున్న గురుపరంపర యజ్ఞాత ముగ నున్నప్పటికి, నవ్య సాహిత్యయుగములో గేయమున

కింతఁ బ్రతిష్ఠ చేకూర్చిన మహనీయుఁడు గురజాడ అప్పా రాయకవియే యని చెప్పవలె. ముత్యాల సరములనెడి నూతన ఛందమును సృజించి గీతములల్లినకీర్తి గురజాడకవిది; గీతములో సమానముగా వ్యావహారిక భాషను సారస్వతములోఁ బ్రవేశపెట్టి సాహసించిన సంస్కారప్రియుఁడు గురజాడకవి. భావకవిత్వ మీకాలమున వర్ధిలినకొలఁది, గేయ మున్మేషము పొందుచు వచ్చినది. ఒకప్రక్క వృత్తముల నెయ్యొత్తిడియున్నను ఖండకావ్యములలో గేయముకూడ సమధికస్థానమును బొందుచు వచ్చినట్లు కనుగొంటము.

ప్రథమ నవ్య కవులలో పింగళి కాటూరి కవులు గేయము వైపు మళ్లలేదనియే చెప్పవలె. రాయప్రోలువారు ప్రబోధమునకై గేయమును గ్రహించి తదీచనలోఁ గృతార్థులైనారు.* కాని వీరువ్రాసిన యిటీవలి గేయములు హాయిని వీడి కృత్రిమముగా భాసించుచున్నవని చెప్పకతీరదు. కృష్ణశాస్త్రిగారు గేయకన్యకు మంచిమంచి యలంకారములను జేకూర్చిరి. వీరిగేయ కవిత లొకనాఁటి కాలములో శ్రీరజనీకాంతరావుగారి కంఠమాధుర్యముతో మేళనముపొంది యువలోకమును బాగుగా నాకర్షించిన సత్యము మరువరానిది. †

---

* "ఏదేశమేగినా ఎందుకాలిడినా
ఏపీఠమెక్కినా ఎవరెదురయినా
పొగడరా నీ తల్లి భూమిభారతిని
నిలుపరా నీజాతి నిండుగర్వమ్ము!— శ్రీ రాయప్రోలు.

† జయజయ ప్రియభారత జనయిత్రీ దివ్యధాత్రి!
జయజయ జయ శతసహస్ర నరనారీ హృదయనేత్రి! - శ్రీకృష్ణశాస్త్రి.

అది మొదలుగాఁ బెక్కురు గేయములు వ్రాయుట కారంభించి నారు. బసవరాజు అప్పారాయకవి గీతావళి నూటికి నూరు పాళ్లు కవితకలవై యువతీ యువకుల మనసులను గొన్ని యేళ్లేలినవి. * అట్లేయొక పక్క-నుండి నండూరి వేంకట సుబ్బారావుగారి యెంకిపాటలు విన్పించి యువలోకమును బరవశులను జేయసాగినవి. ఈపాటలువచ్చి చేసిన కోలాహల మింతింతగాదు; గాలిదుమారములనే రేకెత్తించినవి. పల్లీయులను కావ్యనాయికా నాయకులనుగాఁ జేసి రచించినందులకు, పల్లీ యుల భాషనుపయోగించి నందులకుఁ బండితు లభ్యంతరములఁ జెప్పిరి. గేయకన్య వింతయైన వ్యావహారిక భాషను పదిల పరుచు కొన్నది. నండూరివా రాలంకారిక మర్యాదల నతిక్ర మించిరను దూషణమునకు గురియైరి. ఏమైననేమి? ఆధునిక గేయ వాఙ్మయములో "ఎంకిపాటల" దొక విశిష్టస్థానమనుట నిర్వివాదాంశము!

ఈ గేయరచనము మఱింత ప్రచారమునకుఁ దెచ్చిన వారిలో నిద్దరిని పేర్కొ-నవలె. వారు కవికొండల వెంకటరావు గారు, అడివి బాపిరాజుగారును. శశికళారాధకుఁడైన బాపి రాజుగారు జానపదములలోని ప్రకృతి సౌందర్యమును జూచి తన్మయుఁడై యనేకగీతముల నాలపించి ప్రజలను బాగుగ నాకర్షించిరి. తన గీతములనేకాక యితర మిత్రుల గీతము లను బాడి ప్రాచుర్యము కల్పించిపెట్టిన సారస్వతజీవి బాపి

* ప్రాచుర్యమునుబట్టి భావగీత యుగమున బసవరాజు అప్పారావు గారిదే నాయక స్థానమన్న విప్రతిపత్తి యుండరాదు.

రాజుగారు; ఆయన యనేక యువకులను బ్రిబోధించి వారి చేత గీతములను వ్రాయించినవాఁడు !

ఒక దెసనుండి యీ కాలమునఁ జాజిపూవుల వాసన వలె నలుదెసలఁ బర్వి సామాజికులను లోఁగొన్నవి విశ్వనాథ సత్యనారాయణగారి "కిన్నెరసాని పాటలు;" వీనితో బాటుగా వారి ''కోకిలమ్మ పెళ్లి'' సన్నాయికూడ వ్యాప్తిచెందినది.

ప్రిబోధమునకుఁ బ్రిచారమునకును హెచ్చుగా నుపకరించునది గేయము. దీని నెఱింగి గరిమెళ్లి సత్యనారాయణ గారసహాయోద్యమ వ్యాప్తికొఱ కనేక గేయములను వ్రాసి ప్రజలలో దేశభక్తినిఁ బురిగొల్పిరి. వారిపాటలు నాఁటి ప్రభుత్వమునకు నుచ్చాటన మంత్రములుగాఁ బరిణమించి భయమును గల్పించినవి.* అందు వలననే యీపాటలను బాడిన వారు జైళ్లకుఁగూడ వెళ్లిరి; దీనిఁనిబట్టి గరిమెళ్ల వారి దేశభాసా సేవలను గుర్తింపవచ్చు. వీరితోఁ బాటుగా నెందరెందరో దేశభక్తి ప్రిబోధ గీతములను వ్రాసినట్లు తెలియఁగలము. దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు వ్రాసిన యుద్ధిక్షేప గేయములు గూడఁ బ్రిజలను జక్కలిగింత పెట్టుచువచ్చినవి. వేదుల సత్యనారాయణశాస్త్రిగారు కూడఁ గొన్ని గేయములు వ్రాసిరి. కాని వృత్తరచనములోనే వీరికిఁ బ్రిశస్తి హెచ్చు !

---

* గాంధీ టోపీ పెట్టి పాఠశాల ల్లోకి
రావద్దు రావద్దంటాడు
రాట్నం, బళ్లో పెట్ట వద్దంటాడు
రాజద్రోహ మంతా రాట్నములో వున్నదట
మాకొద్దీ తెల్లదొరతనము. — శ్రీ గరిమెళ్ల

మధ్య మధ్య భక్తిపరములైన కీర్తనముల బ్రవాసిన వానును బయలుదేరిరి. వారికిందోడు హరినాథ, సాయిబాబా భక్తిమార్గము లాంధ్రదేశమున నేర్పడుట గుర్తింపందగినది. పెండ్యాల సీతారామయ్యగారి నీ సందర్భమునఁ జేర్కొనవలె. బ్రహ్మసమాజపరములైన ప్రార్థన గీతములను దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు కూర్చినట్లు నవి యీ యీ కూటములందుఁ బ్రచారములో నున్నట్లును గనుగొందుము.

గేయ సాధన మొకదెస విరివిగా సాగుచున్నను ఖండ కావ్యము 'ఫ్యాషనై' పోయినది. ఈ మధ్యకాలమున వృత్తములతోఁగూడిన ఖండకావ్యములు హెచ్చుగా వెలువడుట గందుము; వచ్చిన గేయములుకూడ భావమునందు రమణీయముగా నున్నచో రాగమున కనువుపడక వచ్చినవి. రాగతాళముల కనుకూలముగ లేక యున్న నట్టిగేయములకుఁ బ్రాచుర్యము లభింపదని నిస్సంశయముగాఁ జెప్పవచ్చును. హిందీ సినిమాలు నందున్న పాటలును జనము నాకర్షించుచున్న దినములివి. ఆ బాణీలలోను, ఆ యీ 'ఫక్కీ'లలోను తెలుఁగు పాటలుకూడ సినిమాల యవసరములకై తయారగుచు వచ్చినవి. ఈ సందర్భమున సినిమాకవుల కృషి గుర్తింపందగినది.

ఆధునిక గేయకవులలో రజనీకాంతరావుగారి కృషి మెచ్చందగినది. సభాముఖముగా మంచిప్రచారములోనికి వచ్చిన యొకనాఁటి తెలుఁగు ఎం. ఏ. పట్టభద్రుఁడీయన. రేడియో కేంద్రములు మద్రాసు, హైదరాబాదు, విజయవాడలలో వెలిసి గీతములకు మహాదవకాశము గల్పించుసరికి నసేక

గేయ రచయితలు, గాయకులును బయలుదేరిరి. రేడియో యుద్యోగియై కొత్త కొత్త బాణీల నసంఖ్యాకముగా గల్పించి తాను సాధనచేసి శిష్యులచే సాధన చేయించిన రజనీకాంతరావుగారి స్థానమిశాఖలో ననితరమైనది. వీరి "శతపత్రసుందరి"యను గేయసుచ్చమునకు తెలుఁగు భాషా సమితివారి బహుమతి లభించినది. ఈ గ్రంథమందలి గేయములు రేడియో ముఖమున బహుళ ప్రచారమునంది శ్రోతలనానంద పరుచుచున్నవి. *

ఇంక-ఇందిరకంటి, శ్రీ శ్రీ, మల్లవరపు, సంపత్, వావిలాల, గణపతిశాస్త్రి, అడివి. కృష్ణశాస్త్రి, వింజమూరి, పిల్లలమఱ్ఱి, భాగీ, నారాయణరెడ్డి, దాశరథి, అనిసెట్టి, పైడిపాటి మొదలైన భావుకులెన్నెన్నో గేయములను రచించి యున్నారు. అవి రేడియో ముఖమున, సభాముఖముల ప్రాచుర్యము పొందుచున్నవి. పుట్టపర్తి నారాయణాచార్యులవారి 'శివతాండవము', ఇందిరకంటి హనుమచ్ఛాస్త్రిగారి "పాటల మంజరి", పిల్లలమఱ్ఱివారి 'రాగరేఖలు', శ్రీశ్రీవారి 'మహాప్రస్థానము', సుబ్బరామశాస్త్రిగారి 'జాతీయభారతి', 'వరదకృష్ణమ్మ', 'నృత్యభారతి' (దశావతారములు) గేయ సరస్వతికి ముచ్చటగూర్చు నలంకారము లనఁదగినవి. దాశరథి, నారాయణరెడ్డిగారల "తేనెపాటలు" యెన్నఁదగిన గేయ సంపుటి.

---

*"సుగమసంగీత" యుగమునకు, లేదా ఇటీవల "గేయ సాహిత్య" యుగమునకు శ్రీ రజనీకాంతరావు యుగపురుషుఁడన్న నత్యుక్తి కానేరదు.

ఆంధ్ర రాష్ట్రీయగీతము లనేకులు వ్రాయుటయు జరిగినది. వేమూరి వేంకట రామనాథము, వేములపల్లి శ్రీకృష్ణగారలు మున్నగువారు వ్రాసిన ప్రబోధ గీతము లెన్నియో ప్రచారము లోనికి వచ్చినవి. వట్టికొండ విశాలాక్షిగారి గేయములును పాటక జనమున కనపడినవి.

రేడియో యధికారు లొకప్రక్క గేయములకు మంచి దోహద మిచ్చిరని గ్రహించితిమిగదా. పల్లెపదములనుగూడ సేకరించి ప్రసారము చేయించుటకు నవకాశమువారు కల్పించుచున్నారు. ఈ సేకరణము చేయించుటతో ననేక ప్రాచీన పదములు లభించిన ననవచ్చు. శ్రీయుతులు నేమనూరి గంగాధరం, చిలుకూరి నారాయణరావు. అడివి బాపిరాజు, పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి, గిడుగు వేంకట సీతాపతి, యరోజు మాధవాచార్యులు, అనిసెట్టి సుబ్బారావు. ప్రయాగ కోదండరామశాస్త్రి, సురవరం ప్రతాపరెడ్డి మొదలైన వా రెందఱో సేకరించి జానపద గేయములను సమర్పించుచుండుట గ్రహింపఁదగినది ఈ సందర్భమున నేమనూరి గంగాధరముగారి కృషి ప్రత్యేకముగా సమ్మానింపఁదగినది.

ఇటీవల తరమునకు వచ్చుసరికి గేయము చందస్సును బూర్తిగా విసర్జించినదని చెప్పవలెను. అది వచనమువలె నడ

---

* నారాయణరెడ్డిగారి "కర్పూర వసంతరాయలు", జమదగ్ని గారి "మహోదయము", లను గేయకావ్యము లీ మధ్య వెలువడి, పండితులదృష్టి నాకర్షించినవి.

చుట నేర్చుకొన్నది. వచన పద్యములనియు, వచన గేయము లనియు ననవన్చు. శ్రీ శ్రీ వేసిన బాటలో నడిచిన యువ రచయిత లట్టివాని నందించుచున్నారు. ఆవేశము, నుద్వేగము కలిగించు రచనలు లయతాళ గతుల నిముడ్చుకొన్నవికావు. అనిసెట్టి, బాలగంగాధరతిలక్, సోమసుందర్, రామదాసు, ఏలూఁచారి, రమణారెడ్డి, రెంటాల, కుందుర్తి, కాళోజి, అజంతా, ఆకుద్ర మున్నగు నుదీయమాన రచయిత లెందఱో బయలదేరినారు. ధవళా, వెల్దుర్తి, ధనకుధరం, చిరంజీవి, కొనకళ్ల, సుంకర, వాసిరెడ్డి మొదలైనవారు కూడ యథాశక్తిగా గేయసాహిత్యమునకై కృషిచేసినట్లు తెలియఁగలము.

మన మింతకుఁ బూర్వము తెలిసికొన్నట్లు రేడియో సినిమా లనునవి రెండుసంస్థలే గేయమున కీనాఁడు గొప్ప దోహదము చేకూర్చుచున్నవి. హిందీపాటల బాణీల ననుకరించుటతోఁ దల బొప్పికట్టి పోచుండుట చూచికాఁబోలు మన తెలుఁగు సినిమాకవులు సంగీత దర్శకులు నూతన బాణీల నన్వేషింపసాగిరి. కొన్ని యాంగ్ల ఘణుతులు వచ్చిచేరినవి. మహారాష్ట్రపు బాణీకొంత పారిచర్యము పొందినది. కర్ణాటక సంగీతముపై నభిమాన మభివృద్ధి పొందుచున్నది. ఈపరిణామమును గ్రహించిన శ్రీదేవులపల్లి కృష్ణశాస్త్రి*'సినీకవి'యై

* నేఁటి సినిమాసంగీత యుగమునఁ బైతరమువారిలో శ్రీదేవులపల్లి మహాకవిదే యగ్రతాంబూలము!

'మల్లీశ్వరి' అను సినిమాకు పాటలువ్రాసి యత్యద్భుతమైన యాకర్షణమును ప్రజలలో సంపాదించిపెట్టి ఖ్యాతి గడించి నారు. పదలాలిత్యము, తాళ ప్రాధాన్యముకలవై సినిమాపాట లకు సాహిత్యరంగమున స్థానమునుగల్పించి పెట్టినవనుట యతిశ యోక్తి కానేరదు. సినిమాపాటల కర్తలలో శ్రీయుతులు సముద్రాల రాఘవాచార్య, పింగళి నాగేంద్రరావు, రావూరు, అనిసెట్టి, సదాశివబ్రహ్మం, కొసరాజు, శ్రీ శ్రీ, ఆత్రేయల నామముల నెన్నుకొనవలసి యున్నవి.

బాల బాలికలకై వ్రాసిన గేయరచయితలు కొందఱు తాళమును, సౌలభ్యమును, నీతిని రంగరించి బోధింప దొర కొన్న వాఱున్నారు. వీరిలో శ్రీచింతా దీక్షితులుగారు సిద్ధ హస్తులు; వారి 'లక్కపిడతలు' పిల్లలను బాగుగ నాకర్షించి తెలుఁగువారి జీవితములో నవినాభావ సంబంధము కలవై పోయినవనవలె. ఏటుకూరి, సీతాపతి, బాపినీడు, నండూరి రామమోహనరావు, విశ్వం, నార్ల, కవిరావు, బైరాగి, నార్ల చిరంజీవి, బి.వి. నరసింహారావు మున్నగువారు బాలుర కొఱకై శ్రమపడి గేయములఁ గూర్చుచు వచ్చినవారు; రానున్నతరము వారిని స్వతంత్ర దేశరక్షకులనుగా నుత్తమ పౌరులనుగాఁ దీర్చి దిద్ది గలుగు చున్నారని వారిని యభి నందింపవలసి యున్నవి!

నాటకమునకు నటునకు నెట్టి యవినా భావసంబంధ మున్నదో యట్టిదే గేయమునకు గాయకునికి నుండితీరును.

అందుచే నీ సందర్భమున గేయసాహిత్య ప్రాచుర్యమునకై యుపయోగపడిన సంస్థలతోపాటుగా తత్తద్గాయకుల నుల్లేఖించుట యుపస్తుతము గాబోదు :

శ్రీయుతులు 'రజనీ'- సీతాఅనసూయలు- సూర్యకుమారి- మల్లిక్-పద్మావతి-భానుమతి-యం యస్. రామారావు-ఘంటసాల వెంకటేశ్వరరావు-రాజేశ్వరరావు-మాధవపెద్ది సత్యం-బొడ్డుపల్లి రవి- మాధవపెద్ది రామస్వామి- వేదకుమారి- బాలసరస్వతి- బాలమురళికృష్ణ- మందపాటి- విజయమూరి లక్ష్మి- మల్లాది అన్నపూర్ణ- నాగరాజు- గోపాలరత్నం- ముసునూరి వెంకటరమణమూర్తి మున్నగువారు రేడియో ముఖముగ, రికార్డులద్వారా తమ తమ తీయనికంఠములను నాయా గేయములకు మేళవించి శ్రోతల నలరించుచుండుట మరువరాని యంశము. ఆకాశవాణ్యాధిపత్యమున 'సుగమ సంగీత' కార్యక్రమమును విస్తృతపరచి పోషించుట హర్షింపదగిన విషయము. గేయప్రాచుర్యమున కది హేతువుకాగలదు.

ఇట్లు గేయరచన మనాదిగా నున్నట్టిదై యీనాటి కొక చక్కని స్థాయి నందుకొన్నదై, దేశికవిత యను ననాదరమును బోనాడుకొన్నదై, సంఘములోను సాహిత్యములోను నెన్నదగిన ప్రక్రియగా వర్ధిలుచుండుట ముదావహము !

(3-6-1955 తేదీ 'జాగృతి'వార పత్రికలో ప్రకటితమైనది.)

శాన్తిశ్రీ ప్రెస్, అగ్రహారము, గుంటూరు - 1.



శ్రీ పిల్లలమర్రి

జననము : 31-12-1918; తల్లి : పుణ్యవతి; తండ్రి : సుబ్రహ్మణ్యం.

జన్మస్థలము : గుంటూరు మండలము : బ్రాహ్మణకోడూరు.

విద్యాభ్యాసము : తెలుగు భాషాసాహిత్యములందు 1943 సం॥ లో ప్రథమశ్రేణిలో ఎం. ఏ. పట్టభద్రుడు.

ఉద్యోగము : హైదరాబాదు ప్రభుత్వ సమాచారశాఖలో ద్విభాషిగా కొలది కాలము; గుంటూరు హిందూకళాశాలలో ఆంధ్రోపన్యాసకుడుగా 1943 సం॥ నుంచి.

బిరుదములు : సాహిత్యాచార్య, ఆంధ్ర ఆర్నాల్డు.

సంస్థా నిర్వాహణము : నిజాం కళాశాలయందలి తెలుగు సారస్వత సమితి సంచికా నిర్వహణము - సికింద్రాబాదులో సాధన సమితీ వ్యవస్థాపకత్వము : వాల్తేరు శాఖానిర్వహణము - గుంటూరులో సరస సారస్వత సమితి, కవితావనము, ఆంధ్ర సాహిత్యమండలి, జ్యోత్స్న సమితుల సంస్థాపకత్వము - "ఆంధ్ర రిపబ్లిక్" పత్రికా సహాయ సంపాదకత్వము - హిందూకళాశాల పత్రికా, సంస్కృత సమ్మేళన సంచికా, ఆంధ్రప్రదేశ్ సావనీర్ సంపాదకత్వము.

సభ్యత్వము : సాధన సమితి, సాహితీ సమితి, హైదరాబాదాంధ్ర సాహిత్య పరిషత్తు, నవ్యసాహిత్య పరిషత్తు, ఆలిండియా ఓరియంటల్ కాన్ఫరెన్సు, నవ్యసాహితీసమితుల సభ్యుడు; జ్యోత్స్న సమితి సభాపతి; శారదా పీఠ కులపతి.

శ్రీ పిల్లలమఱ్ఱి వారి కృతులు

అంబరీష	...	నాటిక ...	0-50
శారదా విలాసము		పరిసంగ వ్యాసములు ...	1-50
సాహిత్య సమాలోచనము	...	వ్యాసములు ...	3-00
ధూప దీపాలు	...	కథలు ...	1-00
ఇష్టాగోష్ఠి	...	పరిసంగములు ...	1-00
పూజాపుష్పాలు	...	శ్రీమతి రచనములు...	0-75
సాహిత్య సమీక్ష	...	ఉపన్యాసములు ...	1-75
మాధురీ మహిమ	...	వ్యాసములు ...	2-00

[పై అయిదు పుస్తకాలు కాలికోబైండు రు. 6 లకే.]

★

* అచ్చులో నున్నవి *

మధు కణములు	చిత్రి
రాగ రేఖలు	వత్సల
వెలుగు నీడలు	మాలిని
వ్యాకరణ దీపిక	కళాశ్రీ
కావ్యాలోకనము	దీపకళిక
మహోదయులు	పద్యబాణము
సాహిత్య సంపద	రసగుళికలు
సాహిత్య వేదిక	విష జ్వాలలు
ఆంధ్ర సాహిత్య చరిత్ర	చమత్కార చంద్రిక
ఆంధ్ర భాషా తత్వము	విద్యార్థి పారిజాతము
(శ్రీ - చుక్క - దెబ్బ	(STUDENTS' COMPANION)

శారదాపీఠము : పట్టాభిపురము : గుంటూరు